అనుదినం... జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
శుక్రవారం 22-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 261 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



## మూడు దశాబ్దాల పోరాట ఫలితం
### రాజకీయ సాధనంగా వాడుకోవటం తగదు

- తొమ్మిదేండ్లు అధికారంలో ఉండి..చివరిదశలో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టారు..
- మోడీ ప్రభుత్వ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లించటానికే : బృందాకరత్ ఆగ్రహం

**న్యూఢిల్లీ :** దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్ బిల్లును సజీవంగా ఉంచిన మహిళా లోకానికి సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ బిల్లు కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నామని, అయితే ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి దీనిని ఒక సాధనంగా వాడుకోవడం దురదృష్టకరమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు చివరి దశకు చేరిన వేళ ఈ బిల్లును హడావిడిగా ఆమోదించారని, ఇది 18వ లోక్‌సభ కూర్పుపై ఎలాంటి ప్రభావం చూపబోదని తెలిపారు. మహిళా బిల్లును జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడంతోనే ప్రభుత్వ ఆంతర్యం అర్థమైపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై 2014 ఎన్నికల సమయంలోనే బీజేపీ హామీ ఇచ్చిందని బృందా కరత్ గుర్తు చేశారు. 2014లోనూ, ఆ తర్వాత 2019లోనూ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ హామీని బీజేపీ పట్టించుకోలేదని విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్న విమర్శల నుంచి తప్పించుకునేందుకే ప్రభుత్వం హడావిడిగా ఈ బిల్లును ప్రవేశపెట్టిందని తెలిపారు. బిల్లు లక్ష్యాలు, కారణాలపై ప్రభుత్వం పక్షపాతపూరితమైన ప్రకటన చేయడం అభ్యంతరకరమని చెప్పారు. ఈ ప్రకటన బీజేపీ ఎన్నికల ప్రణాళికను చదివినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. గ్యాస్ సిలిండర్ల నుంచి మరుగుదొడ్ల వరకూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఏకరువు పెట్టారని బృందా కరత్ అన్నారు.


మాట్లాడుతున్న తమ్మినేని

## కలిసే పోటీచేస్తాం....

అక్టోబర్ 1న మళ్లీ సమావేశం
సీట్లపై నిర్ణయాన్ని ప్రకటిస్తాం

**సీపీఐ, సీపీఐ(ఎం) ఉమ్మడి నిర్ణయం**
- పరోక్షంగా బీజేపీకి మద్దతిస్తున్న కేసీఆర్ : తమ్మినేని
- కాంగ్రెస్‌తో పొత్తు వద్దనుకోవడం లేదు : కూనంనేని

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఐ(ఎం) కలిసే పోటీ చేస్తాయని ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం చెప్పారు. అయితే ఏయే సీట్లలో పోటీ చేయాలనేది ఇంకా కొలిక్కి రాలేదని అన్నారు. వచ్చేనెల ఒకటిన మళ్లీ సమావేశమవుతామని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేసే సీట్లపై చర్చించి నిర్ణయాన్ని ప్రకటిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో గురువారం సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుల ఉమ్మడి సమావేశం జరిగింది. ఇందులో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ్మినేని, కూనంనేని మీడియాతో మాట్లాడారు.

**మహిళా బిల్లును వెంటనే అమలు చేయాలి : తమ్మినేని**

తమ్మినేని మాట్లాడుతూ మహిళా బిల్లు వెంటనే అమల్లోకి వచ్చేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ...13లో

## ఢిల్లీ గడ్డపై వాలిన నేతలు... సీటు కోసం పైరవీలు
### స్క్రీనింగ్ కమిటీ సభ్యుల కోసం కాంగ్రెస్ ఆశావహుల క్యూ
- అక్కడే మకాం

వివరాలు 13లో..



## మహిళా బిల్లుకు ఓకే
### రాజ్యసభలో ఏకగ్రీవ ఆమోదం
- అనుకూలంగా 171 ఓట్లు
- వ్యతిరేకంగా జీరో
- రాష్ట్రాలు ఆమోదించాల్సి ఉన్నది

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను నిర్ధారించే 128వ రాజ్యాంగ సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. 171 ఓట్లతో ఏకగ్రీవ ఆమోదం పొందింది. ఒక్కరూ కూడా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయలేదు. రాజ్యాంగ సవరణ కావడంతో సగానికిపైగా రాష్ట్రాలు బిల్లును ఆమోదించాల్సి ఉంది. ఆ తర్వాత రాష్ట్రపతి సంతకం చేయగానే బిల్లు చట్టంగా మారుతుంది. అయితే చట్టం వచ్చిన తరువాత కూడా మహిళా రిజర్వేషన్లు అమలు కావడానికి ఏండ్లు పడుతుంది. తదుపరి జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తర్వాతే మహిళా రిజర్వేషన్ నిబంధన ...5లో


### ఓటమి భయంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు
**మహిళలకు సాధికారత సాధించాలనే తపన బీజేపీకి లేదు**
- సీపీఐ(ఎం) రాజ్యసభ పక్షనేత ఎలమారం కరీం

వివరాలు 13లో..

## దక్షిణాదికి ఇబ్బందే !
### నియోజకవర్గాల పునర్విభజనతో
### తగ్గనున్న స్థానాలు..మహిళల ప్రాతినిధ్యానికి దెబ్బ

ప్రస్తుతం దేశంలోని జనాభాను పరిగణనలోకి తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన జరిపితే ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఉత్తరాదిలో లోక్‌సభ స్థానాలు అదనంగా పెరుగుతాయి. దక్షిణాది ఉన్న స్థానాల్లో కూడా కొన్ని కోల్పోతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఉత్తర భారత రాష్ట్రాలకు మరో 32 స్థానాలు కలుస్తాయి. దక్షిణ భారత రాష్ట్రాలు 24 స్థానాలను కోల్పోతాయి. దీనివల్ల దేశంలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యం తగ్గిపోతుంది. దీనికితోడు పార్లమెంటులోనూ, రాష్ట్రాల శాసనసభలలోనూ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది.





ప్రస్తుతం పార్లమెంట్ స్థానాలు

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ బిల్లు ఉభయసభల్లోనూ ఆమోదం పొందింది. కానీ అమలు మాత్రం జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అంటోంది బీజేపీ ప్రభుత్వం. అయితే అవన్నీ ఆచరణలోకొస్తే దేశంలో ప్రధానంగా రెండు మార్పులు చోటుచేసుకుంటాయి. ఒకటి, మహిళా రిజర్వేషన్లతో దేశ రాజకీయాలలో పురుషుల ఆధిపత్యం తగ్గి మహిళలకు సముచిత ప్రాధాన్యత లభిస్తుంది. ఇది ఆహ్వానించదగిన పరిణామమే. ఇక రెండవది, దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గి ఉత్తరాది, తూర్పు రాష్ట్రాల ప్రాభవం పెరుగుతుంది. ఇదే ఆందోళన కలిగించే విషయం. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే.. జనాభా స్థిరంగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు తగ్గడంతో పాటు ఆయా రాష్ట్రాల నుండి మహిళల ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతుంది.

కొన్ని అంచనాల ప్రకారం కేరళలో ప్రస్తుతం 20 లోక్‌సభ స్థానాలు ఉండగా వాటి సంఖ్య 14కు తగ్గుతుంది. 39 స్థానాలు కలిగిన తమిళనాడు 11 స్థానాలను కోల్పోతుంది. ఇలా దక్షిణాది రాష్ట్రాల్లో చాలా ...13లో

**ఈ బిల్లు వెనుక ?**

లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తే చట్టాల రూపకల్పనలో వారి ప్రాతినిధ్యం పెరుగుతుంది. ఇది ఆహ్వానించదగిందే. కానీ బీజేపీ వ్యూహం మరోలా ఉంది. బిల్లు ఆమోదం పొందినా అమలు చేసే ఉద్దేశం ఆ పార్టీకి లేదు. అందుకే జనగణన, ఆపైన నియోజకవర్గ పునర్విభజనకు ముడిపెట్టి ఆచరణకు తలుపులు మూసింది. మరి అమలు చేయని బిల్లును ఎందుకు తెచ్చినట్టు? ఎందుకంటే తమ వైఫల్యాలనుండి ప్రజల దృష్టిని మళ్లించవచ్చు. పైగా ఎన్నికలముందు మహిళల ఓట్లను ఆకర్షించవచ్చు. అదే సమయంలో ప్రాంతీయ గుర్తింపు చుట్టూ అల్లుకున్న రాజకీయాలతో పాటు హిందీ రాష్ట్రాలలో ఓబీసీ రాజకీయాలను కూడా బలహీనపర్చవచ్చు. బీజేపీ ఇప్పటికే తన హిందుత్వ గొడుగు కిందికి కుల రాజకీయాలను తీసుకొచ్చింది. మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నానని చెబుతూనే తన సామాజిక మూలాలను పటిష్టం చేసుకుంటోంది.



### రైల్వే కూలీగా రాహుల్
**ఎర్ర షర్టు, చేతికి బ్యాడ్జి, తలపై లగేజి**
- ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుడి హల్‌చల్
- కార్మికులు, కూలీలు పడుతున్న ఇబ్బందులు వినడానికే : కాంగ్రెస్

13లో..

### ఇదేనా సనాతన ధర్మం?
**కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి గైర్హాజరుపై ఉదయనిధి స్టాలిన్**
- గిరిజనురాలు, వితంతువు కావటం వల్లనే ఆమెను ఆహ్వానించలేదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ మళ్లీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గైర్హాజరిని ఉటంకిస్తూ సనాతన ధర్మం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ద్రౌపది ముర్ము వితంతువు, గిరిజనురాలు కావటం వల్లనే ఆమె గైర్హాజరు కావాల్సి వచ్చిందని అన్నారు. మధురైలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్ బీజేపీ లక్ష్యంగా పై వ్యాఖ్యలు చేశారు. "కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించారు. వారు (బీజేపీ) ప్రారంభోత్సవానికి ...13లో

### కెనడాకు భారత్ షాక్..
**ఆ దేశ పౌరులకు వీసాలు నిలిపివేత..**



**న్యూఢిల్లీ:** కెనడా ప్రధాని ఆ దేశ పార్లమెంట్ సాక్షిగా ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు ఇండియా కారణం అంటూ ఆరోపణలు చేశారు. అంతే కాకుండా సీనియర్ భారత దౌత్యవేత్తను దేశం నుంచి బహిష్కరించారు. అయితే ఇందుకు ప్రతిగా భారత్ కూడా కెనడియన్ సీనియర్ దౌత్యవేత్తను 5 రోజుల్లో ఇండియా వదిలి వెళ్లాలని ఆదేశించింది. కెనడా ఆరోపణల్ని అసంబద్ధ, ప్రేరేపిత ఆరోపణలుగా ఖండించింది. ఇదిలా ఉంటే కెనడాకు భారత్ షాక్ ఇచ్చింది. కెనడా పౌరులకు భారతీయ వీసాలను సస్పెండ్ చేసింది. తదుపరి నోటీసులు వచ్చే వరకు వీసాల ప్రక్రియను ...5లో



### ఎస్ఎఫ్ఐ నాయకులపై ఖాకీల కర్కశం
**జూనియర్ కాలేజీలో గ్రంథాలయ భవన నిర్మాణ పూజకు అభ్యంతరమే నేరం...!**
- లాక్కెళ్లి ఆటోల్లో పోలీస్ స్టేషన్‌కి తరలింపు
- ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌పై విచక్షణారహితంగా దాడి
- స్టేషన్‌లోనూ నాయకులను చితకబాదిన పోలీసులు
- తీవ్రంగా ఖండించిన ఎస్ఎఫ్ఐ

**నవతెలంగాణ - పెద్దపల్లి**

ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులపై పెద్దపల్లి పోలీసులు కర్కశంగా వ్యవహరించారు. విచక్షణారహితంగా చితకబాదారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలల భవనం ఆవరణంలో జిల్లా గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణం భూమి పూజ కార్యక్రమానికి మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రఘువీర్ సింగ్ హాజరయ్యారు. అయితే బాలికల జూనియర్ కళాశాల భవన ఆవరణంలో గ్రంథాలయ సంస్థ భవనం నిర్మించొద్దని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీగా తరలివెళ్లి అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ కొంతమంది పోలీసులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌తో పాటు విద్యార్థులను లాక్కెళ్లారు. ఆటోల్లో కుక్కి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆ మార్గమధ్యలో ఆటోలోనే ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌ను ఎస్ఐ విచక్షణారహితంగా చితకబాదాడు. నాయకులను, కొంతమంది విద్యార్థులను పెద్దఎత్తున స్టేషన్‌కు తరలించిన పోలీసులు తీవ్రంగా కొట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కొట్టిన ...5లో

## చేనేతపై కేంద్రం పిడుగు
### తొమ్మిదేండ్లలో రెట్టింపైన ముడి సరుకు ధరలు
- జాతీయ చేనేత సంక్షేమ బోర్డు రద్దు
- చేనేత వస్త్రాలపైనా జీఎస్టీ భారం
- అవసరాలున్నా ఆర్డర్లు ఇవ్వని ప్రభుత్వం
- పోచంపల్లి ఇక్కత్‌కు పేటెంట్ ఉన్నా కాపీకొడుతున్న వస్త్ర కంపెనీలు
- కేంద్రం చర్యలతో తీవ్రంగా నష్టపోతున్న కార్మికులు
- కేంద్రం విధానాలపై పోరాడేందుకు జాతీయస్థాయిలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసే అవకాశం

**ఎస్వీకేలో నేడు అఖిల భారత చేనేత కార్మికుల కన్వెన్షన్**



**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

పొద్దున లేస్తే స్వదేశీ జపం చేసే మోడీ సర్కారు వస్త్రరంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ చేనేత రంగాన్ని దివాళా తీయిస్తున్నది. ఆ రంగంపై పిడుగులా పడి కార్మికుల సంక్షేమం కోసం ఉన్న బోర్డునూ, పథకాలను తుంగలో తొక్కింది. ఒకనాడు దేశంలో వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి రంగమైన చేనేత పరిశ్రమ నడ్డివిరిచేసి లక్షలాది మంది కార్మికుల పొట్టగొట్టింది. వస్త్రతయారీకి అవసరమైన ముడిసరుకులపైనా, తయారైన బట్టలపైనా జీఎస్టీ వేయడం ఆ పరిశ్రమకు గుదిబండగా మారింది. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు పేటెంట్ హక్కు ఉన్నా వస్త్ర కంపెనీలు యథేచ్ఛగా కాపీ కొడుతున్నా కేంద్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు ఒక్కతాటిపైకొచ్చి అఖిల భారత చేనేత కార్మికుల జాతీయ కన్వెన్షన్‌ను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్నారు. అఖిల భారత స్థాయిలో ఉద్యమాలు చేసేందుకు ఒక స్టీరింగ్ కమిటీని కూడా వేయబోతున్నారు.

**పథకాల్లో ఎత్తివేత..నిధుల్లో కోత**

ఎవరైనా చేనేత కార్మికుడు చనిపోతే మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందేది. మోడీ సర్కారు అది దక్కకుండా చేసింది. ఐసీఐసీఐ లాంబాడ్ హెల్త్ స్కీం ఆరోగ్య సమస్యలున్న ...5లో

# ఫీజుల దోపిడీ

## ప్రయివేటు మెడికల్ కాలేజీల ఆగడాలు అరికట్టాలి : తెలంగాణ రాష్ట్ర వైద్యవిద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ప్రయివేటు వైద్య కళాశాలల ధనదాహానికి కళ్లెం వేయాలని తెలంగాణ వైద్యవిద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.రవి ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రయివేటు మెడికల్ కాలేజీలు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఇష్టానుసారంగా ఫీజుల పేరుతో తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బి కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులను ఆయా కళాశాలలు ఇబ్బంది పెడుతున్నాయని మండిపడ్డారు. మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందిన మేనేజ్ మెంట్ కోటా విద్యార్థులను ఫీజుల పేరిట ప్రయివేటు మెడికల్ కాలేజీలు వేధిస్తున్నాయని విమర్శించారు.

మొదటి సంవత్సరం ఫీజులు కట్టించుకున్న సదరు కళాశాలలు రెండో సంవత్సరానికి బ్యాంకు గ్యారంటీ తీసుకున్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం పలు కాలేజీలు రెండో సంవత్సరానికి ఫీజు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తూ మానసిక వేధనకు గురి చేస్తున్నారు. కాళోజీ విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం విద్యాసంవత్సరంతో సంబంధం లేకుండా తమకు ఫీజులు చెల్లించాలనీ, లేకుంటే మొదటి సంవత్సరం పరీక్షలకు అనుమతించబోమంటూ సెల్ మెసేజ్ లను తల్లిదండ్రులకు పంపిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని వందలాది మంది మధ్యతరగతి వర్గాలు తీవ్ర అవస్థలకు లోనవుతూ వ్యయప్రయాసలకు గురవుతున్నాయని వారు తెలిపారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం వైద్యవిద్య అభివృద్ధి ద్వారా ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశాన్ని కల్పిస్తుంటే మరోవైపు ప్రయివేటు వైద్య కళాశాలలు ఫీజుల పేరిట విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నాయని చెప్పారు. వెంటనే రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు జోక్యం చేసుకుని ప్రయివేటు మెడికల్ కాలేజీల ఫీజుల విషయంలో చేస్తున్న ఆగడాలకు, అవకతవకలకు, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని తెలంగాణ రాష్ట్ర వైద్యవిద్యార్థుల పేరెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. వైద్యారోగ్యశాఖ మంత్రిగా హరీశ్ రావు రాష్ట్రంలో వైద్యవిద్య అభివృద్ధికి నూతన కళాశాలల ఏర్పాటు ద్వారా ఎంతో మంది పేద మధ్య తరగతి వర్గాలు వైద్యులు అయ్యే అవకాశం కల్పిస్తూ వారి జీవితాలకు బంగారు బాటలు వేస్తున్నారని కొనియాడారు. ఈ విషయమై విద్యార్థుల పక్షానా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించింది. ఇప్పటికైనా ఫీజుల విషయంలో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు ప్రయివేటు వైద్య కళాశాలలను నియంత్రించే విధంగా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని కోరారు.



అంతరాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా కవిసమ్మేళనంలో మాట్లాడుతున్న కె. ఆనందాచారి

# నిబంధనల ప్రకారం మీడియాపై పర్యవేక్షణ

- అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికలకమిషన్ సూచించిన నిబంధనల ప్రకారం మీడియా పోషించే పాత్రను పర్యవేక్షించాలని రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ కేఆర్ భవన్‌లో ఆయన ఎన్నికల్లో మీడియా పాత్ర పర్యవేక్షణపై జిల్లా పౌర సంబంధాల అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల సమయాల్లో వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే పెయిడ్ న్యూస్ గుర్తించే ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందనీ, అప్పటి నుంచి మీడియా సర్టిఫికేషన్ , మానిటరింగ్ కమిటీ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను పర్యవేక్షించాలన్నారు. కేంద్ర ఎన్నికల కమీషన్ విడుదల చేసిన ప్రాణానిక ప్రక్రియ పద్ధతి ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సూచించారు. షెడ్యూల్ ప్రకటించిన తర్వాత నుంచి వార్తా పత్రికల్లో అభ్యర్థులకు వచ్చే ప్రకటనలను ప్రతి రోజు సేకరించాలనీ, అభ్యర్థులకు అనుకూలంగా వచ్చే వార్తల గుర్తింపు, పెయిడ్ న్యూస్ నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి

నవతెలంగాణ - ముషీరాబాద్

నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెన్షనర్ల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గద్దర్, ప్రజాస్వామ్యవాది ఉర్దూ పత్రిక సంపాదకులు జహీర్ అలీఖాన్, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సంఘం సీనియర్ ఉపాధ్యక్షులు అంపయ్యకు సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ సంఘం అధ్యక్షులు రాజేంద్రబాబు, జనరల్ సెక్రెటరీ నర్సింగ్‌రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నదన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే బ్యాంక్ ఖాతాల్లో పెన్షన్ జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం వాయిదాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ సంఘాన్ని త్వరితగతిన ఏర్పాటు చేసి మధ్యంతర భృతి ప్రకటించాలని, ఈ కుబేర్‌లో ఉన్న అన్ని బిల్లులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ అసోసియేట్ అధ్యక్షులు వీరస్వామి, సీనియర్ ఉపాధ్యక్షులు వామన్ రావు దేశపాండే, ఆర్థిక కార్యదర్శి నర్సయ్య, గౌరవాధ్యక్షులు నారాయణరావు, ఉపాధ్యక్షులు పురుషోత్తం, రామమనోహర్, మల్లయ్య, సలహాదారులు ఇ. నరసింహారెడ్డి, గోనారెడ్డి, రఘురామిరెడ్డి, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారికి టీఎస్ఆర్టీసీ శుభవార్త

- ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకుంటే 10 శాతం రాయితీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దసరాకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు శుభవార్త. ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే వారికి 10 శాతం రాయతీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. అక్టోబర్ 15 నుంచి 29 తేదీల మధ్యలో ప్రయాణానికి రానుపోనూ ఒకేసారి టికెట్లు బుకింగ్ చేసుకుంటే, తిరుగు ప్రయాణం పై 10 శాతం డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఆయా తేదిల్లో ప్రయాణానికి ఈ నెల 30వ తేది వరకు ముందస్తు రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే 10 శాతం రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. రిజర్వేషన్ సదుపాయమున్న అన్నీ సర్వీసుల్లో రాయితీ అమల్లో ఉంటుందని పేర్కొంది. దసరా పండుగ సెలవుల సమయంలో 15 రోజులు మాత్రమే ఈ రాయితీ అమల్లో ఉంటుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ఈ డిస్కౌంట్ సదుపాయాన్ని ఉపయోగించుకొని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి. టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కొరకు సంస్థ అధికారిక వెబ్ సైట్ www.tsrtconline.inని సంప్రదించాలని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచించారు.

# మరే పార్టీలోనూ చేరను : ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాను బీజేపీ నుంచి మారుతానని కొందరు భావిస్తున్నారనీ, పార్టీ మారే ప్రసక్తే లేదని బీజేపీ చేరికల కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నొక్కి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ రాజకీయ నాయకుడైనా హమీలు ఇచ్చాడంటే అమలు చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలయ్యాయని విమర్శించారు. పేదలకు పది లక్షల డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. రూ. 3, 016 చొప్పున నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. రైతుల డిక్లరేషన్, యువత డిక్లరేషన్, ఉమెన్ డిక్లరేషన్ అంటూ కొందరు ఊదరగొడుతున్నారని విమర్శించారు. రింగురోడ్డు, కోకాపేట భూమల అమ్మకం, మద్యం దుకాణాల టెండర్ల ద్వారా వచ్చిన ఆదాయంతో రైతుల రుణమాఫీ చేస్తున్నారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాష్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మెన్ తుల ఉమా, అశ్వద్ధామ రెడ్డి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 16 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు వచ్చేనెల 16 నుంచి 26వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) డైరెక్టర్ పివి శ్రీహరి గురువారం టైంటేబుల్‌ను విడుదల చేశారు. ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు రెండు విడతల్లో జరుగుతాయని వివరించారు. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు వచ్చేనెల 30 నుంచి నవంబర్ ఆరో తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

# పోలీసుల లాఠీ-చార్జీకి ఎస్ఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులపై పోలీసులు లాఠీఛార్జీ చేసి తీవ్రంగా గాయపర్చడాన్ని ఆ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్దపల్లి పట్టణంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీ సమస్యలను పరిష్కరించాలంటూ దశలవారీ ఆందోళనలు చేపట్టారని గుర్తు చేశారు. వాటిని పట్టించుకోకుండా అదే స్థలంలో జిల్లా గ్రంథాలయం కట్టేందుకు భూమిపూజకు ఏర్పాటు చేశారని తెలిపారు. దాన్ని వ్యతిరేకించిన ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, రవీందర్‌పై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రయివేటు విద్యాసంస్థ యజమాని అయ్యి ఉండి పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ కళాశాలను కూల్చివేసేందుకు సిద్ధపడ్డారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఆయనకు విద్యార్థిలోకం తగిన గుణపాఠం చెప్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ కాలేజీని కాపాడే బాధ్యత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి లేదా?అని ప్రశ్నించారు. జిల్లా గ్రంథాలయాన్ని వేరే చోటకు తరలించి, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలనీ, నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులపై దాడి చేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు.

# సొంత పార్టీ నేతలపైనే రాములక్క ఫైర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్విట్టర్ వేదికగా రాజకీయ బాంబులు పేల్చే సినీనటి, బీజేపీ నేత విజయశాంతి ఈ సారి సొంత పార్టీ నేతలపైనే ఎక్కుపెట్టారు. "చిట్‌చాట్‌ల పేరుతో ఏదో ఒక వ్యూహంతో పని చేసే కార్యాచరణ తనకు లేదు" అని స్పష్టం చేశారు. 'పార్టీకి ఏది ముఖ్యమో ఆ అంశాలను ముఖ్యనేతల సమావేశంలో అగ్రనేతలకు స్పష్టంగా చెప్పాను. ఆ విషయాలు బయటకు లీకేజీల పేరుతో ఇవ్వడానికి నేను వ్యతిరేకిని. కొంతమంది మా పార్టీలోని నేతలు పనిగట్టుకుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీజేపీకి రాములమ్మ దూరమంటూ నాపై సోషల్ మీడియా ద్వారా చేయిస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నా' అంటూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ ట్వీట్ ఈటలకు కౌంటర్‌గానే చేశారని ప్రచారం జరుగుతున్నది.

# కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం: కోలేటి దామోదర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారని తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొమ్మిదన్నరేండ్ల పాలనలో సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజల్లో ఆనందం కనిపిస్తున్నదని తెలిపారు. బీజేపీకి క్యాడర్ లేదనీ, కాంగ్రెస్ కు లీడర్లు లేరనీ, ఆ రెండు పార్టీలు వాపును చూసి బలుపనుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ గెలవబోతున్నదనేందుకు భారీ చేరికలే నిదర్శనమని ఆయన తెలిపారు.

# సుదీర్ఘపోరాటాల ఫలితమే రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ నియామకం

- నూతన చైర్మెన్, సభ్యులకు కేవీపీఎస్ అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుమారు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్, సభ్యులను సుదీర్ఘ పోరాటాల తర్వాత ఎట్టకేలకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు గురువారం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన చైర్మెన్, సభ్యులకు వారు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులను నిరోధించడానికి పార్టీలకు రాజకీయాలకతీతంగా రక్షణ కేంద్రంగా పెద్దదిక్కుగా నిలవాలని కోరారు. చాలా ఏండ్లుగా జరిగిన దాడులు దౌర్జన్యాల ఘటనలను పరిశీలించి బాధితులకు తగిన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని నూతన చైర్మెన్ బక్కి వెంకటయ్య, సభ్యులకు సూచించారు. ది వివిధ సామాజిక సంఘాల సూచనలు, ఫిర్యాదులు స్వీకరిస్తూ బాధితులకు బాసటగా నిలవాలన్న ఆకాంక్షను వారు వ్యక్తం చేశారు.

# హెచ్ఎం పదోన్నతులకు ఆప్షన్లు షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్ఎం) గ్రేడ్-2 పదోన్నతులకు సంబంధించి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల వెబ్ఆప్షన్ల నమోదు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. శుక్రవారం వరకు గడువున్నది. మల్టీ జోన్-1 పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు 99, లోకల్ బాడీలోని పాఠశాలలు 995 ఉన్నాయి. మల్టీ జోన్-2 పరిధిలో ప్రభుత్వ బడులు 146 ఉన్నాయి. ఆ పాఠశాలల్లోనే హెచ్ఎం పదోన్నతులు పొందడానికి స్కూల్ అసిస్టెంట్లు వెబ్ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈనెల 23న ఆప్షన్ల సవరణకు అవకాశమిస్తారు.

**స్పౌజ్ పాయింట్ల వినియోగానికి ఉత్తర్వులు**

స్పౌజ్ పాయింట్లను వినియోగించుకోవడానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

# పోలీసుల లాఠీచార్జిపై ఆగ్రహం..

- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రాస్తారోకోలు
- సీఎం దిష్టిబొమ్మ దహనం
- ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం
- 11వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



**నవతెలంగాణ-విలేకరులు**

కలెక్టరేట్ల ముట్టడిలో అంగన్‌వాడీలపై పోలీసులు లాఠీచార్జిని నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రాస్తారోకో నిర్వహించి, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ, హెల్పర్స్ యూనియన్ జాయింట్ రాష్ట్ర కమిటీల (సీఐటీయూ, ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 11వ రోజూ సమ్మె కొనసాగింది.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు వర్షంలోనూ తమ నిరసనలు కొనసాగించారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున తరలిరావడంతో పోలీసులు భారీగా మోహరించి అంగన్‌వాడీలను భయాందోళనకు గురి చేసేందుకు ప్రయత్నించారు. అయినా మొక్కవోని దీక్షతో పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు చేరుకోవడంతో వందలాంది మంది అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు చేరుకోవడంతో పోలీసులు కలెక్టరేట్ గేట్లు మూసివేశారు. దాంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలు గేట్లను తోసే ప్రయత్నంలో భాగంగా పైకెక్కారు. పోలీసులు వారిని వారించడానికి ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులను ఎదిరించి లోపలికి చొచ్చుకెళ్లారు. దాంతో అంగన్‌వాడీలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగి తోపులాట జరిగింది. పోలీసు ఆందోళనకారులను చెదరగొట్టి సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు. అంగన్‌వాడీలు వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మధు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఓదెలు, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించి, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. చేవెళ్ల, కందుకూరు, మంచాలలలో అంగన్‌వాడీలు నిరసన ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. షాద్‌నగర్ పట్టణంలో అంగన్‌వాడీలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఫరూక్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి షాద్‌నగర్ ప్రధాన కూడలి వరకు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో దిష్టిబొమ్మ దహనం చేశారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ నల్ల చీరలను ధరించి తమ నిరసన తెలిపారు.

నల్లగొండ జిల్లా సీడీపీఓ ఆఫీస్ ఎదుట కొనసాగుతున్న సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారీ ఐలయ్య, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ మద్దతు తెలిపారు. చండూరు, దేవరకొండ, నకిరేకల్, హాలియాలో సమ్మె కొనసాగింది. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఆలేరు మండలకేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి, వేంసూరు మండల కేంద్రాల్లో దీక్ష శిబిరాల వద్ద మోకాళ్లపై నడిచి నిరసన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టారు. ఇల్లందు, భద్రాచలంలో ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి ఆయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

## అంగన్‌వాడీ ఉద్యోగులపై దమనకాండను ఆపాలి

- దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి : తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ డిమాండ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ, పని భారం తగ్గింపు, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లతో చట్టబద్ధ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై పోలీసుల దమనకాండను ఆపాలనీ, మహిళా ఉద్యోగులు అని కూడా చూడకుండా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ, కమిటీ సభ్యులు పి.జయలక్ష్మి, కాసు మాధవి, ఎ.సునీత ఒక ప్రకటన విడుదల చేశారు.

అంగన్‌వాడీ సంఘాలతో మంత్రి సత్యవతి రాథోడ్ చర్చలు జరిపిన సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం నిర్బంధ కాండను ప్రయోగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. సెంటర్ల తాళాలు బలవంతంగా పగలగొట్టి అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని తెలిపారు. బుధవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న అంగన్‌వాడీలపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. రంగారెడ్డి జిల్లాలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి పై మగ పోలీసులు పిడిగుద్దులతో విరుచుకుపడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో లక్ష్మి అనే అంగన్‌వాడీ టీచర్ స్పృహ తప్పి పడిపోయిందన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్యలక్ష్మి, కవితకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. అదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న అంగన్వాడీలను పోలీసులు రెచ్చగొట్టారనీ, గిరిజన మహిళలను కులం పేరుతో దూషించారని విమర్శించారు. మహిళలను విచక్షణారహితంగా కొట్టడాన్ని ఖండించారు. అంగన్‌వాడీలపై మగ పోలీసులు లాఠీచార్జి చేయడంపైనా, ఆదిలాబాద్‌లో కులం పేరుతో దూషించిన ఘటనపైనా మహిళా కమిషన్, ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్లు సుమోటోగా తీసుకుని విచారించాలని కోరారు.

## సాగర్ క్లబ్‌ని ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించడంపై ధర్నా

- ఎన్ఎస్పీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు



**నవతెలంగాణ-నాగార్జునసాగర్**

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని క్లబ్‌ను ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించడాన్ని నిరసిస్తూ గురువారం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, యువకులు నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైటాయించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని క్లబ్ డ్యామ్ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి ఎన్ఎస్పీ అధికారులకు స్థానిక యువకులకు, విశ్రాంత ఉద్యోగులకు ఆటవిడుపుగా, ఫంక్షన్లకు అనువుగా ఉండేదని తెలిపారు. అలాంటి క్లబ్‌ను ప్రయివేట్‌పరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్‌పరం కాకుండా క్లబ్‌ను మినీ స్టేడియంలా మార్చాలని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కోరారు. ఎన్ఎస్పీ అధికారులు క్లబ్‌ను నందికొండ మున్సిపాలిటీకి అప్పజెప్పకుండా తమకు ఇష్టమైన వాళ్లకు కేటాయిస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, నందికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ మంద రఘువీర్, బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, కాంగ్రెస్ నాయకులు ఉంగరాల శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌గా బక్కి వెంకటయ్య

- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నూతన చైర్మెన్‌గా బక్కి వెంకటయ్యను సభ్యులుగా కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్‌లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఈమేరకు గురువారం నియమించారు. సీఎం కేసీఆర్ నిర్ణయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

## మత్స్యరంగం అభివృద్ధికి వెయ్యి కోట్ల రుణం

- ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్ వెల్లడి

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రాష్ట్రంలో మత్స్య రంగం అభివృద్ధి చేయడంతోపాటు మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మరో వెయ్యికోట్ల రుణ సదుపాయాన్ని కల్పించేందుకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) తన సంసిద్ధతను వ్యక్తం చేసినట్టు తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ పిట్టల రవీందర్, వైస్ చైర్మన్ దీటి మల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని ఎన్సీడీసీ ప్రధాన కార్యాలయంలో వారు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ పెళ్లయి, డిప్యూటీ డైరెక్టర్ పాటిల్ నీలేష్ సురేష్‌లను కలిశారు. మొదటి దశలో అమలు జరిపిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా సుమారు ఒక లక్ష 18 వేలమందికి ప్రత్యక్షంగా లబ్ది చేకూరిందని అధికారులకు వారు వివరించారు.

## ఓటర్‌కార్డు ఆధార్ లింకు చేయొద్దు

- టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ఓటర్‌కార్డుకు అధార్ లింకు చేయడం సరైందికాదని టీపీసీసీ ఉపాధ్యక్షులు జి నిరంజన్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆయన లేఖ రాశారు. దాన్ని మీడియాకు విడుదల చేశారు. ఫామ్ 6లో కొన్ని మార్పులు చేయాలని కోరారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇంటిస్థలం గొప్ప గౌరవం

- మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పడం వారికిచ్చే గొప్ప గౌరవమని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన సోనియా గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ఉద్యమకారులకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

## అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ : శ్రీధర్‌బాబు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మ్యానిఫెస్టో కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా కొంత మంది విద్యార్థులు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి మార్పు కావాలని కోరుకుంటున్నారో అలాంటి హామీలు ఇస్తామన్నారు. త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తామని తెలిపారు. జిల్లాలు, నియోజక వర్గాలలో కూడా అక్కడి ప్రత్యేక అంశాలతో కూడిన స్థానిక మ్యానిఫెస్టోను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

## మణిపూర్ ఘటనపై మభ్యపెట్టేందుకే మహిళా బిల్లు

- బిల్లు విషయంలో బీజేపీకి చిత్తశుద్ధి లేదు
- మహిళలపై దాడులకు నిరసనగా 5న ఢిల్లీలో ర్యాలీ : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



**నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, మణిపూర్ ఘటనపై మభ్యపెట్టేందుకే బిల్లు తెచ్చిందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఊరించే రీతిలో ఈ బిల్లును ప్రవేశపెట్టారని తెలిపారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన సాకుతో 2036 ఎన్నికల వరకు ఈ బిల్లు అమలు వాయిదా వేశారని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వచ్చేనెల 5వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే నిరసన ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఐద్వా అధ్యక్షులు బండి పద్మ అధ్యక్షతన ఖమ్మంలోని సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

మణిపూర్ మారణకాండను మరిపింప చేయడం కోసమే, మహిళల దృష్టిని మరల్చేందుకే ఉన్నపళంగా చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తెరమీదకు తెచ్చారని ఆరోపించారు. మెజార్టీ ఉందని అనేక బిల్లులను ఇష్టానుసారంగా ఆమోదించుకున్న బీజేపీ మహిళా బిల్లు అమలు విషయానికి వచ్చేసరికి జాప్యం చేస్తుండటాన్ని తప్పు పట్టారు. తొమ్మిదిన్నర ఏండ్లలో లేనిది ఇప్పటికిప్పుడు ఈ బిల్లును ప్రవేశ పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తరువాతే బిల్లు అమల్లోకి వస్తుందని చెప్పడంతోనే బీజేపీకి మహిళల పట్ల ఉంది కపట ప్రేమని అర్థమైందని అన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హింస, నిత్యావసరాల ధరల పెరుగుదలపై నోరు మెదపని ప్రధాని మోడీ.. మెజార్టీ ఓట్లు దండుకొని మళ్ళీ అధికారంలోకి రావాలని మత ఘర్షణలు సృష్టిస్తున్నారన్నారు. బీజేపీ కుటిలయత్నాలను సాగనీయకుండా ఉండేందుకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 5న నిర్వహించే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే జిల్లా జాతాను విజయవంతం చేయాల్సిందిగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల భారతి కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, మెరుగు రమణ, అఫ్రోజ్ సమీనా, నాగసులోచన, మెహరున్నీసాబేగం, పయ్యావుల ప్రభావతి, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## జీనోమ్ వ్యాలీ ఏర్పాటు మా విజన్‌లో భాగం

- మున్సిపల్, పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- యూరోఫిన్స్ అత్యాధునిక బయోఫార్మా సర్వీసెస్ క్యాంపస్‌ను ప్రారంభించిన మంత్రి



**నవతెలంగాణ-శామీర్‌పేట**

జీనోమ్ వ్యాలీని ఏర్పాటు చేయడం తమ విజన్‌లో భాగం అని మున్సిపల్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. లైఫ్ సైన్సెస్, పరిశ్రమలకు టెస్టింగ్ సేవలను అందించడంలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న యూరోఫిన్స్ అత్యాధునిక బయోఫార్మా సర్వీసెస్ క్యాంపస్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం జీనోమ్ వ్యాలీలో గురువారం యూరోఫిన్ రీజినల్ డైరెక్టర్ నీరజ్ గార్గ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. జీనోమ్ వ్యాలీ శక్తివంతమైన ఆర్ అండ్ డీ పర్యావరణ వ్యవస్థకు మరొకటి జతకలిసినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. యూరోఫిన్స్ వృద్ధి ప్రణాళికలో భాగంగా ఇక్కడ పెట్టుబడి పెడుతుందని చెప్పారు. ఈ క్యాంపస్ నుంచి ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశిస్తున్నానన్నారు. ప్రస్తుతం జీనోమ్ వ్యాలీలో ఫేజ్-3లో ఉన్నామని.. దీన్ని మరో 250 ఎకరాల్లో విస్తరిస్తామని తెలిపారు. ఇన్నోవేషన్ కోసం 'గ్లోబల్ వ్యాలీ ఆఫ్ గ్రోత్'ను స్థాపించడం జరిగిందన్నారు. తమకు కేంద్ర ప్రభుత్వానికి పడదని.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎప్పుడు ఏదో పంచాయితీ నడుస్తూనే ఉంటుందని చెప్పారు. అయినప్పటికీ ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో నెంబర్‌వన్ ఎవరని అడిగితే తెలంగాణ అని వాళ్లు కూడా ఒప్పుకునే పరిస్థితిని సీఎం కేసీఆర్ తీసుకొచ్చారన్నారు.

నీరజ్ గార్గ్ మాట్లాడుతూ.. యూరోఫిన్స్ హైదరాబాద్ బయోఫార్మా సర్వీసెస్ క్యాంపస్ భారత్‌లో రెండో క్యాంపస్ అని తెలిపారు. హైదరాబాద్ క్యాంపస్‌లో 15 ఎకరాల స్థలంలో దాదాపు లక్ష చదరపు అడుగులలో ప్రయోగశాల, కార్యాలయం ఉందన్నారు. జీనోమ్ వ్యాలీలోని క్యాంపస్ ప్రపంచ ఔషధ కంపెనీలకు డిస్కవరీ కెమిస్ట్రీ, డిస్కవరీ బయాలజీ, సేఫ్టీ టాక్సికాలజీ, బయో అనలిటికల్ సర్వీసెస్, ఫార్ములేషన్ డెవలప్‌మెంట్ సేవలను అందిస్తుందని చెప్పారు. భారత్‌లో యూరోఫిన్స్, యూరోఫిన్స్ అడ్వినస్ ద్వారా ఫార్మాస్యూటికల్, అగ్రోసైన్సెస్ కంపెనీలకు ఆర్అండ్‌డీ అవసరాల కోసం సేవలను అందించనుందని చెప్పారు. ఈ కొత్త స్టేట్ ఆఫ్ ది ఆర్ట్, బయోఫార్మా సర్వీసెస్ క్యాంపస్ భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి యూరోఫిన్స్ నిబద్ధతకు తార్కాణం అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో తమకు ఉన్న సహకారం విశేషంగా ఆకట్టుకుందన్నారు.

యూరోఫిన్స్ అడ్వినస్ డైరెక్టర్ రాజీవ్ మాలిక్ మాట్లాడుతూ.. భారత్‌లో యూరోఫిన్‌లకు షోకేస్ సైట్‌గా హైదరాబాద్ క్యాంపస్ విస్తరించడం జరుగుతుందన్నారు. డిస్కవరీ నుంచి డెవలప్‌మెంట్ వరకు జీఎంపీ టెస్టింగ్ వరకు పూర్తి ఫార్మా ఆర్అండ్‌డీ వాల్యూ చైన్‌లో చిన్న మాలిక్యూల్స్, రెండింటికి సంబంధించిన సేవలను కలిగి ఉంటుందన్నారు. ఆసియాలో డ్రగ్ డిస్కవరీ, డెవలప్‌మెంట్ సేవలకు హైదరాబాద్ కేంద్రబిందువు అన్నారు. జీనోమ్ వ్యాలీ గ్లోబల్, ఇండియన్ ఫార్మాస్యూటికల్స్‌లో ఇండస్ట్రీ లీడర్ల కోసం పనిచేస్తున్న దాదాపు 25 వేల మంది నిపుణులతో కూడిన శాస్త్రీయ వర్క్‌ఫోర్స్‌తో 200 కంటే ఎక్కువ కంపెనీలకు నిలయంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహా రెడ్డి ఐఏఎస్, తెలంగాణ ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ అండ్ ఫార్మా డైరెక్టర్ శక్తి ఎం.నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి కేటీఆర్ మాట్లాడుతుండగా ఎమర్జెన్సీ అలర్ట్

దేశవ్యాప్తంగా గురువారం అన్ని మొబైల్ ఫోన్లలో ఎమర్జెన్సీ అలర్ట్ మోగింది. విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఎన్డీఎంఏ రూపొందించిన వ్యవస్థను పరీక్షించే క్రమంలో దేశవ్యాప్తంగా మొబైల్ ఫోన్లకు ఈ అలర్ట్ మెసేజ్ పంపారు. అయితే జీనోమ్ వ్యాలీలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతుండగా.. అక్కడ ఈ ఎమర్జెన్సీ అలర్ట్ వచ్చింది. అది గమనించిన కేటీఆర్ 'ఏమైనా ఫైర్ అలారమా? వెళ్లిపోదామా?' అని ప్రశ్నించారు. అయితే స్పీకర్‌లో సౌండ్ వస్తుందని అధికారులు చెప్పగా.. కేటీఆర్.. ' స్పీకరే కదా.. ఓకే.. ఇది క్లోజ్డ్ ఆడిటోరియం, అందరికీ గుడ్ లక్' అంటూ చమత్కరిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. అయితే ఇది మొబైల్ ఫోన్‌లో వచ్చిన అలర్ట్ అన్నది తర్వాత తెలిసింది.

## జూనియర్ సివిల్ జడ్జిగా దీక్షా బట్టు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే)గా దీక్షా బట్టు ఎన్నికయ్యారు. 2021-22 తెలంగాణ జేసీజే నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. ఆమె చదువులో ఎప్పుడూ ఉత్తమ ప్రతిభ కనబరిచే వారు. ఎల్ఎల్‌బీలో రెండు బంగారు పతకాలను సాధించారు. పీజీలాసెట్‌లో ప్రథమ ర్యాంకు పొందారు. మొదటిసారి పరీక్ష రాసి జేసీజే ఫలితాల్లో ఆమె ఈ ఘనత సాధించారు. దీక్షా బట్టు తెలంగాణ కోఆపరేటివ్ ట్రిబ్యునల్ సభ్యురాలు డాక్టర్ కిరణ్మయి కూతురు కావడం విశేషం.

## రోడ్డు ప్రమాదంలో వరంగల్ నిట్ విద్యార్థి మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు..

**నవతెలంగాణ కాజీపేట**

రోడ్డు ప్రమాదంలో వరంగల్ నిట్(జాతీయ సాంకేతిక విద్యాలయం) విద్యార్థిని నిస్సీ మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా జంగాలపల్లి వద్ద గురువారం ఉదయం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిట్‌కు చెందిన బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరానికి చెందిన ఆరుగురు విద్యార్థులు బుధవారం ఉదయం అద్దె కారులో లక్నవరం విహారయాత్రకు వెళ్లారు. ఆ రోజు అక్కడే ఒక కాటేజీలో బస చేసి గురువారం తెల్లవారుజామున హన్మకొండ వైపు అతి వేగంగా వస్తున్న కారు..

జంగాలపల్లి క్రాస్ రోడ్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి దూసుకెళ్లి ఆపై లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఏలూరుకు చెందిన విద్యార్థిని నిస్సి అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు విద్యార్థుల్లో హైదరాబాద్‌కు చెందిన ముర్తుజా, ఉమర్, సాయి, సుజిత్, విశాఖకు చెందిన శ్రేయకు తీవ్రగాయాలయ్యాయి. వీరికి ములుగు ప్రాంతీయ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

## సింగరేణి ఉద్యోగులకు ఏరియర్స్ చెల్లింపు

- సంపాదనలో 49శాతం కోత
- ఆదాయ పన్ను మినహాయింపుపై కార్మికుల ఆగ్రహం

**నవతెలంగాణ - సింగరేణి ప్రతినిధి**

11వ వేజ్ బోర్డు ఏరియర్స్ రూ.1450కోట్లు సింగరేణి ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో గురువారం మధ్యాహ్నం జమ చేశారు. అయితే, వచ్చిన డబ్బుల్లో ఎక్కువగా ఆదాయపు పన్ను కింద కోత విధించడంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా యాజమాన్యం వెల్లడించిన విధంగా ప్రస్తుతం సర్వీసులో ఉన్న 39,413 మంది ఉద్యోగులకు 23నెలల ఏరియర్స్ డబ్బులు జమ చేశారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ.3లక్షల70వేల ఏరియర్స్ లభిస్తుందని సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్) ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులకు లభించే ఏరియర్స్ డబ్బుల వివరాలను బుధవారం రాత్రి వెల్లడించారు. డబ్బుల వివరాలను పొందుపరుస్తూ ముద్రించిన చీటీలను కూడా కార్మికులకు అందజేశారు. అయితే, కార్మికుల కష్టార్జితం నుంచి 30శాతం ఇన్‌కమ్ ట్యాక్స్ రూపేనా కోత విధించడం పట్ల కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడు సంపాదించే ప్రతి పైసా నుంచి ఆదాయం పన్ను రూపేనా ప్రభుత్వాలు ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. అవే డబ్బులను బ్యాంకులో దాచుకున్నా, సరుకులు కొనుగోలు చేసినా జీఎస్టీ, సీఎస్‌టీల పేరా మళ్లీ కోతలు విధించడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. ఒకే ధపా ఏరియర్స్ చెల్లించడం వల్ల ఆదాయపు పన్ను స్లాబులు మారి కార్మికులు ఎక్కువ మొత్తంలో ఆర్థికంగా నష్టపోయారు. 12శాతం సీఎం పీఎఫ్, 7శాతం పెన్షన్ కోసం ఏరియర్స్ డబ్బుల నుంచి మినహాయింపు చేసుకున్నారు. చాలామంది కార్మికులు తమకు వచ్చిన ఏరియర్స్ డబ్బుల నుంచి 49శాతం మినహాయింపు చేశారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల జీతాలు పెంచి ఆదాయపన్ను రూపేనా తిరిగి దోచుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల ఆదాయంపై విధించే పన్నును సింగరేణి యాజమాన్యమే చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.సింగరేణి భవన్ నుంచి గురువారం మధ్యాహ్నం 12గంటలకు ఆన్‌లైన్ ద్వారా ఏరియర్స్ డబ్బులు చెల్లించే విధంగా డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) ఎన్.బలరామ్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేష్ ఏర్పాటు చేశారు. త్వరలో దసరా అడ్వాన్స్, దీపావళి బోనస్‌ల చెల్లింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది.

# మహిళలను మోసం చేసిన మోడీ

- ఇప్పటికిప్పుడు బిల్లును అమలు చేయొచ్చు : రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బి. వినోద్‌కుమార్



**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

మహిళలను ప్రధాని మోడీ మోసం చేశారని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. గురువారం హన్మకొండలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ మహిళా బిల్లును ప్రవేశపెడితే మహిళలందరూ లోక్‌సభ, శాసనసభ స్థానాల్లో రిజర్వేషన్లు వెంటనే దక్కుతాయని ఆశించారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే క్లాస్ 5లో మార్పులు చేసి ఇప్పటికిప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయొచ్చని, ఒక న్యాయవాదిగా ఈ విషయం చెబుతున్నానని తెలిపారు. 2002లో తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ.. ఆర్టికల్ 82, 170 ప్రకారం 2026లోపు నియోజకవర్గాల పునర్విభజనకు వీలు లేదన్నారు. 2031 జనాభా లెక్కలు పూర్తయ్యాకే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందన్నారు. అంటే 2039 ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు దక్కుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రవేశపెట్టిన అనంతరం తెలంగాణలో లోక్‌సభ స్థానాలు 34, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 50కి పెరగాల్సి ఉండగా, ఆ బిల్లులో 'నాట్ విత్ స్టాండింగ్' అనే పదాన్ని చేర్చకపోవడం వల్ల లోక్‌సభ స్థానాలు పెరగలేదని తెలిపారు.

ఈ విషయంపై సీఎం కేసీఆర్‌తోపాటు ఎంపీలందరం ప్రధాని మోడీని కలిసినా ఆయన స్పందించలేదన్నారు. పార్లమెంట్ వ్యవహారాల్లో మోడీ కొత్త పద్ధతి అవలంబించారని, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏ విషయంపై పెడుతున్నారో ప్రకటించకుండా 15 రోజుల క్రితం మంత్రి ప్రహ్లాద్ జోషి ట్విట్టర్‌లో ట్వీట్ చేయడాన్ని తప్పుపట్టారు. అంతేకాదు, క్యాబినెట్‌లో మహిళా బిల్లుపై నిర్ణయం తీసుకున్నా ఆ విషయాన్ని ప్రకటించకుండా మళ్లీ ట్విట్టర్‌లోనే ట్వీట్ చేశారన్నారు. జమిలి ఎన్నికల పేరిట వేసిన కమిటీకి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను చైర్మెన్‌గా నియమించారని, ఇప్పటి వరకు ఎలాంటి కమిటీలకు మాజీ రాష్ట్రపతులను చైర్మెన్లుగా నియమించలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎంపీలందరూ మద్దతివ్వడం శుభపరిణామమన్నారు. దేశంలో మొదట మహిళా పాలకురాలు రజియా భేగం అని చెబుతుంటారని, కాని, కాకతీయ రాణి రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించారని గుర్తుచేశారు. విలేకరుల సమావేశంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మెన్ సుందర్‌రాజ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నవంబర్ 19, 20, 21 తేదీల్లో హన్మకొండలో తపాల ఉద్యోగుల జాతీయ మహాసభలు

హన్మకొండలో నవంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు మూడ్రోజులపాటు 12వ ఆలిండియా గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలు జరుగనున్నాయని, ఈ సభలను విజయవంతం చేయాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, మహాసభల ఆహ్వానసంఘం చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్, చీఫ్ విప్, ఆహ్వానసంఘం వైస్‌చైర్మెన్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి గ్రామీణ తపాల ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. దేశంలో 3 లక్షల మంది గ్రామీణ తపాల ఉద్యోగులున్నారని, వీరంతా సుమారు 8-10 గంటల మేరకు పనిచేస్తున్నారని, వీరిపై తీవ్రమైన పనిభారం పడుతుందన్నారు. 25 ఏండ్ల క్రితం నుండే పోస్టల్ శాఖను నిర్వీర్యం చేయడం ప్రారంభమైందన్నారు. తాను ఎంపీగా ఉన్న సందర్భంలో పార్లమెంట్‌లో పలుమార్లు గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం మాట్లాడానని, అప్పట్లో కేరళ ఎంపీగా ఉన్న ప్రేమ్‌చందర్ వీరి సమస్యలపై ప్రధానంగా చర్చించేవారని తెలిపారు. పోస్టాఫీసును పోస్టల్ బ్యాంకులుగా మార్చిన ఈ తరుణంలో పోస్టల్ వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ మహాసభల్లో పాల్గొనడానికి 3 వేల మంది ప్రతినిధులు రానున్నారన్నారు. విలేకరుల సమావేశంలో గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. జయరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మర్రి కొమురారెడ్డి, హన్మకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

> కృషి అనే ద్వారం తెరవకపోతే అదృష్టం అదృశ్యమవుతుంది.
> - అబ్రహాం లింకన్



సంపాదకీయం

# భారత్ వర్సెస్ కెనడా..!

భారత్-కెనడా మధ్య దిగజారిన సంబంధాల పూర్వరంగంలో కెనడాలో ఉన్న మన పౌరులు జాగ్రత్తగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం చేసిన హెచ్చరిక అక్కడ విద్యాభ్యాసం, ఉపాధికోసం వెళ్లిన భారతీయుల కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోంది. విదేశాల నుంచి వచ్చి చదువుకుంటున్న ఎనిమిదిలక్షల మందిలో నలభై శాతం మనవారే

చేసిన ఆరోపణను కెనడా వెనక్కు తీసుకోవాలని మనదేశం డిమాండ్ చేస్తోంది. మూడునెలల పరిశోధన తరువాత భారత హస్తం ఉందని నిర్ధారించుకున్నామని కెనడా అంటోంది. ఈ ఆరోపణను ఉపసంహరించుకుంటే తప్ప మనదేశం వెనక్కు తగ్గదు, అదే జరిగితే అభాసుపాలవుతుంది కనుక కెనడా వెనక్కు తగ్గే అవకాశాలు తక్కువ. ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యూహంలో చైనాను నిలవరించేందుకు భారత్‌ను ముందుపీఠిన ఉంచాలన్న అమెరికా కూటమి దేశాల్లో కెనడా కూడా ఒకటి.

ఉన్నందున తలిదండ్రుల్లో ఆవేదన సహజం. ఇప్పటి వరకు ఉన్న పరిస్థితులను బట్టి వారి భద్రతకు ఎలాంటి ముప్పు లేనప్పటికీ పరిస్థితులు దేనికి దారితీస్తాయో చెప్పలేము. భాయీ - భాయీ అన్నట్లుగా ఇటీవలి వరకు కనిపించిన పరిస్థితి పరస్పరం దౌత్యవేత్తలను బహిష్కరించుకోవటం, వాణిజ్య చర్చలను రద్దు చేసుకోవటం వరకు వచ్చింది. సామాజిక మాధ్యమాలు, ఇతరంగా వచ్చిన బెదిరింపుల కారణంగా పరిమిత సిబ్బందితో దౌత్య కార్యాలయాలను నిర్వహించనున్నట్లు మన దేశంలో కెనడా కార్యాలయం ప్రకటించిందంటే తిరిగి పూర్వస్థితి ఎప్పుడు ఏర్పడేది చెప్పలేము.

కెనడా పౌరుడు, ఖలిస్తానీ టైగర్ ఫోర్స్ అనే సంస్థ నేతగా చెప్పుకొనే హరదీప్ సింగ్ నిజ్జర్‌ను జూన్ నెలలో బహిరంగ ప్రదేశంలో గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు, దానికి భారత దేశమే బాధ్యురాలని కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ చేసిన తీవ్ర ఆరోపణ, ఎలాంటి సంబంధం లేని మనదేశం చేసిన ప్రకటన పూర్వరంగంలో ఈ పరిణామాలు వెంటవెంటనే జరిగాయి.



కెనడా రాజకీయాల్లో సిక్కులు ఒక ప్రభావిత శక్తిగా ఉన్నారు. పంజాబ్ తరువాత ప్రపంచంలో సిక్కు సామాజిక తరగతి ఎక్కువగా ఉన్నది కెనడాలోనే, అక్కడ జనాభాలో 2.1శాతం ఉన్నారు. ముప్పై మందితో కూడిన జస్టిన్ ట్రుడేవ్ మంత్రివర్గంలో నలుగురు సిక్కులు మంత్రులుగా ఉన్నారు. ఈ కారణంగా నిజ్జర్ మరణానికి బాధ్యులను తేల్చాలన్న డిమాండ్ సహజంగానే అక్కడ ముందుకు వచ్చింది. అందువలన మరొకదారిలేని పరిస్థితిలో అంతర్జాతీయ కర్తవ్యం సంగతి తరువాత ముందు తన ప్రభుత్వం గురించి చూసుకోవాలని హత్య గురించి ట్రుడేవ్ బహిరంగంగా పార్లమెంటులో చెప్పాల్సి వచ్చింది. భారత్-కెనడా సంబంధాల్లో విబేధాలు జూన్‌లోనే కనిపించాయి. మొదటి వారంలో మన విదేశాంగ మంత్రి జై శంకర్ విలేకర్లతో మాట్లాడుతూ ఖలిస్తాన్ వేర్పాటువాదులకు కెనడా మద్దతు ఇవ్వటం రెండు దేశాల సంబంధాలకు మంచిది కాదని విమర్శించారు. ఆ తరువాత నిజ్జర్ హత్య జరిగింది. ఢిల్లీలో జరిగిన జి-20 కూటమి సమావేశాలకు జస్టిన్ ట్రుడేవ్ వచ్చినప్పటికీ ఇతర దేశాధినేతలతో మాదిరి ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేక చర్చలు జరపలేదు. అంటీ ముట్టనట్లుగా ఉన్నాడు. అంతే కాదు కెనడాలో ఉగ్రవాదులు భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఇటీవలి కాలంలో జరిగిన ఉదంతాల గురించి మోడీ కెనడా దృష్టికి తేగా, ప్రతిగా కెనడా కూడా మనదేశం మీద ఆరోపణలు చేసిందని వెల్లడైంది. తిరుగు ప్రయాణంలో ట్రుడేవ్ విమానంలో సాంకేతిక లోపం ఏర్పడగా ప్రత్యామ్నాయంగా విమానం ఏర్పాటు చేస్తామని మన దేశం ప్రతిపాదించినా రెండు రోజులు వేచి ఉండి తన విమానంలోనే వెళ్లిన సంగతి తెలిసిందే. ఏదో పెద్ద తేడా వచ్చిందని అప్పుడే అనేక మంది ఊహించారు.

చేసిన ఆరోపణను కెనడా వెనక్కు తీసుకోవాలని మనదేశం డిమాండ్ చేస్తోంది. మూడునెలల పరిశోధన తరువాత భారత హస్తం ఉందని నిర్ధారించుకున్నామని కెనడా అంటోంది. ఈ ఆరోపణను ఉపసంహరించుకుంటే తప్ప మనదేశం వెనక్కు తగ్గదు, అదే జరిగితే అభాసుపాలవుతుంది కనుక కెనడా వెనక్కు తగ్గే అవకాశాలు తక్కువ. ఇండో-పసిఫిక్ ప్రాంత వ్యూహంలో చైనాను నిలవరించేందుకు భారత్‌ను ముందుపీఠిన ఉంచాలన్న అమెరికా కూటమి దేశాల్లో కెనడా కూడా ఒకటి. అలాంటిది భారత్‌తో ఇప్పుడు తలపడటం మంచిది కాదని అమెరికా, ఐరోపాలోని చైనా వ్యతిరేక వ్యూహకర్తలు ఆందోళన వెల్లడిస్తున్నారు. అవసరమైతే కెనడాను పక్కన పెట్టి భారత్‌కు బాసటగా నిలవాలన్న సలహాలు కూడా ఇస్తున్నారు. తాజా పరిణామాలకు ముందు అంతర్గతంగా పెద్ద చర్చే జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల నిఘా సంస్థలతో రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఏర్పడిన "ఐదు కళ్ల" యంత్రాంగం భేటీలో ఖలిస్తానీ నేత హత్య గురించి భారత్‌ను దోషిగా చేయటం ఇండో-పసిఫిక్ ఎత్తుగడలకు నష్టదాయకం గనుక మౌనంగా ఉండాలని కెనడాకు సూచించగా తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. ఇది చినికి చినికి గాలివానగా మారితే సంభవించే పర్యవసానాల గురించి ఆందోళన చెందుతున్న జి-7 కూటమిలో పెద్దన్న అమెరికా, ఇతర దేశాలు జోక్యం చేసుకుంటే చైనా వ్యతిరేక శక్తులను సమీకరించటం ముఖ్యమని భావించి రాజీపడితే టీకప్పులో తుపానులా ముగియవచ్చు. అందుకు కెనడా సిద్ధపడుతుందా అన్నది ప్రశ్న.

# దేవుడున్నాడు - అజ్ఞానం కూడా ఉంది!



డాక్టర్ దేవరాజు మహారాజు

దేవుడున్నాడని నమ్మే భక్తులతో పాటు మనం కూడా ఉన్నాడనే నమ్ముదాం. ఎందుకంటే ప్రపంచంలో చీకటి ఉంది. అజ్ఞానం ఉంది. లేవని అనలేం కదా? అలాగే దేవుడు కూడా ఉన్నాడు. అజ్ఞానం ఉన్నచోట దేవుడుంటాడు. జ్ఞానం వెలుగులు ప్రసరించిన చోట మాయమైపోతాడు. ఇందులో మరోమాటకు తావులేదు. ఊరికే దైవభక్తుల విశ్వాసాలతో గొడవ ఎందుకూ? దేవుడున్నాడు. అజ్ఞానం కూడా ఉంది. ఆ రెండూ ఒకటే కాబట్టి - అజ్ఞానంలో దేవుడున్నాడు! దైవ భావనలో అజ్ఞానం ఉంది!! యదార్థాన్ని ఒప్పుకొని వారితో మనకు పేచీలేదు. ఈ రకంగా కూడా ఒకసారి ఆలోచించి చూడమని చెపుతున్నాం అంతే!!

పాలల్లో నెయ్యి కనబడదు. ఈ విశ్వంలో దేవుడు కనబడడు. పాలల్లో నెయ్యి కనబడనంత మాత్రాన నెయ్యి లేనట్టు కాదుగదా? అని ఆస్తికులు వితండవాదం చేస్తుంటారు. వాళ్ళు ఆలోచించాల్సిందేమంటే... పాలల్లో నెయ్యి తియ్యడానికి ఒక పద్ధతి ఉంది. ఆ పద్ధతి ప్రకారం ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా, ఎక్కడ చేసినా పాల నుండి నెయ్యి తియ్యొచ్చు. అలాగే విశ్వంలోని దేవుణ్ణి వెలికితీయడానికి శతాబ్దాలుగా యోగులు, భక్తులు ప్రయత్నిస్తున్నారు. అయినా బయటపడటం లేదు. అన్ని మతాల భక్తులూ ప్రయత్నిస్తునే ఉన్నారు. ఎవరేం చేసినా అంతా వృథా! ఏ దేవుడూ ఎక్కడా ఎప్పుడూ ఎవరికీ కనబడలేదు. సింబాలిక్‌గా వ్యాఖ్యానాలు చేయడం సులభమేమో గాని, నిజంగా వెతికి చూపడం సాధ్యం కాలేదు. ఇక ముందు కూడా కాదు. లేనిది చూపడం, శూన్యాన్ని ప్రదర్శించడం ఎవరివల్లా కాదు. అలా చూపిస్తామన్న వాళ్ళు మోసగాళ్ళవుతారు. అలాంటి వారికి చట్టప్రకారం శిక్షలు వేయాలే గానీ, స్వేచ్ఛగా సభ్య సమాజంలో తిరగనీయరాదు. మెదళ్ళులేని జనం అలాంటి వారి పాదాల మీద పడి దొర్లుతూ ఉంటే, బుద్ధిలేని ప్రభుత్వాలు వారికి వసతులు కల్పిస్తున్నాయి! చూసి ఆనందిస్తున్నాయి!!

"రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలన్నీ పుక్కిటి పురాణాలు కావు, ఇతిహాసాలు!!" అని గొప్పగా చెప్పకునేవారు ఒక ప్రశ్నకు సమాధానమివ్వాలి. ఇతిహాసం - అంటే చరిత్ర! మరి ఈ పురాణ గ్రంథాలలో చారిత్రక అంశాలేవీ? బుద్ధుడి గురించి గానీ, మౌర్యవంశం గురించి గానీ, గుప్తరాజుల గురించి గానీ, హర్షుడి గురించి గానీ ఎక్కడా ఏవీ లేవెందుకూ? ఏడు వందల యాభైయేండ్ల క్రితం బౌద్ధ విశ్వవిద్యాలయాలు తగులబెట్టి నాశనం చేసిన సంఘటనలు ఈ ఇతిహాసాల్లో లేవెందుకూ? ఈ వివరాలన్నీ ఆనాటి చీనీ యాత్రికుల నోట్స్ నుండి సంగ్రహించుకోవాల్సి వచ్చింది కదా? చివరకు సింధూ నాగరికత గురించి ఈ ఇతిహాసాల్లో ఏమైనా ఉందా? ఏదీ లేదే? మరి వీటిని 'ఇతిహాసాలని' ఎలా అంటారు? పుక్కిటి పురాణాలనే అనాలి!

సూర్యుడి కిరణాలు చర్మానికి స్పర్శ ద్వారా తెలుస్తున్నాయి. సూర్యుడు ఉన్నాడు అని అనడానికి ఆధారముంది. మరి దేవుడనేవాడు ఉంటే అతడి కిరణాలేవీ? అతడి దయకు, చల్లని చూపునకు ఆధారాలేవీ? ఆస్తికులు మేజిక్కులు రాసుకుని తృప్తి పడుతుంటారు. జనమంతా ఆ మేజిక్కులకు, గిమిక్కులకు పరవశించిపోవాలని ఆశిస్తుంటారు. దేవుడుంటే హత్యలు, అత్యాచారాలు ఎందుకు జరుగుతున్నాయో? నేరాలని ఆపలేని దేవుడు నీ కష్టాలని తీరుస్తాడని ఎలా నమ్ముతున్నావ్? దేవుడుంటే తప్పు చేసిన వారిని ఎందుకు చంపడం లేదూ? రాక్షసులు తప్పుచేస్తే దేవుడు వారిని శిక్షించాడని, శపించాడని, చంపాడని రకరకాలుగా కట్టుకథలు రాసుకుని శతాబ్దాలుగా ప్రచారం చేస్తున్నారు కదా? మరి ఇప్పుడు సమాజంలో కొందరు తప్పులు చేస్తున్నారు. నేరాలకు, ఘోరాలకూ పాల్పడుతున్నారు. "సంభవామి యుగే యుగే" అని చెప్పకున్న ఆ దేవుడు ఎందుకు రావడం లేదూ? తన విద్యుక్త ధర్మాన్ని మరిచిన వాడు దేవుడెలా అవుతాడు? ఏ పనీ చేతకానప్పుడు ఉన్నా, లేకున్నా ఒకటే కదా? అంటే అంతా అబద్ధమేనన్న మాట! కల్పించుకున్న కట్టుకథలతో ఎంత కాలమని స్వాంతన పొందుతారూ? వాస్తవాల నుండి ఎంతకాలమని పారిపోతారూ? దేవుడు ఉన్నాడని ఘంటాపథంగా ప్రచారం చేసే పురాణాల విషయానికొద్దాం!

"రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలన్నీ పుక్కిటి పురాణాలు కావు, ఇతిహాసాలు!!" అని గొప్పగా చెప్పకునేవారు ఒక ప్రశ్నకు సమాధానమివ్వాలి. ఇతిహాసం - అంటే చరిత్ర! మరి ఈ పురాణ గ్రంథాలలో చారిత్రక అంశాలేవీ? బుద్ధుడి గురించి గానీ, మౌర్యవంశం గురించి గానీ, గుప్తరాజుల గురించి గానీ, హర్షుడి గురించి గానీ ఎక్కడా ఏవీ లేవెందుకూ? ఏడు వందల యాభైయేండ్ల క్రితం బౌద్ధ విశ్వవిద్యాలయాలు తగులబెట్టి నాశనం చేసిన సంఘటనలు ఈ ఇతిహాసాల్లో లేవెందుకూ? ఈ వివరాలన్నీ ఆనాటి చీనీ యాత్రికుల నోట్స్ నుండి సంగ్రహించుకోవాల్సి వచ్చింది కదా? చివరకు సింధూ నాగరికత గురించి ఈ ఇతిహాసాల్లో ఏమైనా ఉందా? ఏదీ లేదే? మరి వీటిని 'ఇతిహాసాలని' ఎలా అంటారు? పుక్కిటి



పురాణాలనే అనాలి! పైగా బుద్ధుడి కాలంలో ఏ సంస్కృతి ఉంది? బుద్ధుడి తండ్రి ఏ ధర్మం పాటించేవాడూ? అని ప్రశ్నిస్తూ అతి తెలివి ప్రదర్శిస్తారు. ముందు విశ్వాసాల్ని, కట్టుకథల్ని, మహిమల్ని పక్కనపెట్టి యదార్థాల్ని అర్థం చేసుకోగలిగితే, అన్నీ అర్థమవుతాయి. బుద్ధుడి కాలంలో విలసిల్లింది శ్రమన సంస్కృతి. అశోకుడి స్తంభాల గురించి ఈ బ్రాహ్మణవాదులకు తెలియదు, తెలుసుకోరు. పైగా అశోక స్తంభాన్ని 'భీముడి గథ' అని ప్రచారం చేస్తారు. ఆ స్తంభాల మీద చెక్కి ఉన్న శాసనాలు కూడా అర్థం చేసుకోరు. రామాయణ, మహాభారతంలోని అంశాలు అందులో చెక్కి ఉన్నాయని భ్రమపడతారు. జనానికి కూడా అదే భ్రమ కల్పిస్తారు. ముందు కాస్త చరిత్ర, భూగోళం, సైన్సు చదువుకోండిరా బాబూ! రామాయణ, భారతాల్ని కావ్యాలనండి. సృజనాత్మక రచనలనండి. అందరూ ఒప్పుకుంటారు. ఇతిహాసాలంటారా? మీరు తప్పులో కాలేసినట్టే. చరిత్రకు ఆధారాలుంటాయి. కట్టుకథలకు ఆధారాలుండవు.

గత ఏడు, ఎనిమిది వందల ఏండ్ల క్రితం తీరిగ్గా కూర్చుని రాసుకున్న ఈ కల్పిత గాథల్ని - ఆ దేవదేవుడే దిగి వచ్చి మానవుడికి అందించి పోయాడని మరో కట్టుకథ అల్లి చెప్పకోండి - సాధారణ శకానికి ముందు (అంటే క్రీ.పూ) నాలుగైదు వేల యేండ్ల క్రితం నాటి చరిత్ర అంతా పరిశోధకులు వెలికి తీశారు కదా? మీ దేవ దేవుడు ఎక్కడా కానరాలేదు. ఆయన వేదాలు, పురాణాలు ఎక్కడ ఎప్పుడు ఇచ్చాడో తేదీ, సమయం గట్రా ఆధారాలు తీసి చూపండి. ఉట్టి విశ్వాసాలు ఇప్పుడు నడవ్వు. విశ్వాసాల యుగం అంతమైపోయింది. ఇది ప్రతిదీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి తెలుసుకునే యుగం ప్రారంభమైంది. ఇంకా చచ్చు పుచ్చు కథలు చెపుతామంటే జనం నమ్మరు. కాలం మారింది. తరం మారింది. వైజ్ఞానిక అవగాహన పెరిగింది. "విజ్ఞానం ద్వారా బలమైన తాత్త్వికత, నిజాయితీ, బుద్ధి కుశలత లభిస్తాయి. శ్రమ పట్ల గౌరవం ఏర్పడుతుంది. పెరుగుతుంది" అని అన్నారు ప్రసిద్ధ రష్యన్ రచయిత మాక్జిమ్ గోర్కీ.

అన్నం ఉడికిందా లేదా తెలుసుకోవడానికి ఒకటి రెండు మెతుకులు చూస్తే చాలునన్నట్లు - పురాణాల్ని అసంబద్ధమైన, తలాతోకాలేని కట్టుకథలని తేల్చడానికి ఒకటి రెండు విషయాలు విశ్లేషించుకుంటే చాలు! రాముడు హనుమంతుడి ఆరాధ్యదైవం. అలాంటి దేవుడి గుప్తాంగాల వివరాలు భక్తుడికి ఎలా తెలుస్తాయి? వాల్మీకి రామాయణం, సుందరకాండ, 35వ సర్గ, 17వ శ్లోకం చదివిన వారికి కరెంటు షాక్ తప్పదు. 1927 నాటి ప్రతి నుండి ఇటీవలి ముద్రణవరకు (గీతాప్రెస్ - గోరక్‌పూర్) విషయం అంతా ఒకటే. మార్పులేదు. రాముడి గుప్తాంగాల వర్ణన హనుమంతుడు చేయడం - అదీ సీతకు వినిపించడం ఏమిటో మనబోటి వారికి అర్థమే కాదు. "పురాణాల్లో బూతు పురాణాలు వేరయా అని కాదు, పురాణాలంటే బూతు పురాణాలేనయా" అని అనుకోవాల్సి వస్తోంది. విజ్ఞులు ఆలోచించాలి. ఎవరి దగ్గరైనా గీతాప్రెస్‌వారు ముద్రించిన మహాభారతం ఉంటే, అందులో అనుశాసన పర్వం తిరిగేయండి. 135వ అధ్యాయం 546వ పేజీ. ఏముంది అందులో అంటే...

**శూద్రాణా మధయో భుంక్తై సంభుక్తే పృథివీ మలమ్**
**మలం నృణాం సపి బతి బలం భుంక్తే జనస్య చ** 115
**శూద్రాణాం యస్తథా భుంక్తే సంభుంక్తే పృథివీ మలమ్**
**పృథివీ మల యశంతి యే ద్విజాః శూద్ర భోజినః** 116
**శూద్రుల ఇంట భుజించినవాడు సమస్త పృథివీ మలాన్ని,**
**మనుషుల మలాన్ని తిన్నట్టే - తాగినట్టే...**
**శూద్రుని అన్నం తిన్న బ్రాహ్మణులు కూడా పృథివీ మలాన్ని తిన్నట్టే -**

ఇలాంటి అసహ్యకరమైన అంశాలు ఎత్తి చూపడం బాధగా ఉంది. కానీ, గత్యంతరం లేదు. ఇవి నిజాలు! మాది గొప్ప సంస్కృతి మావి గొప్ప 'ఇతిహాసాలు' అని గొప్పలు పోయేవారి కండ్లు కొంచెమైనా తెరుచుకుంటాయేమోనని ఈ తాపత్రయం. వివక్ష పూరితమైన ఇలాంటి అంశాలు, ఈ తరానికి ఈ యుగానికి ఇంకా అవసరమా? వాటినే మళ్ళీ ప్రతిష్టించాలని అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్న మనువాద ప్రభుత్వ దుష్టబుద్ధిని ఖండిస్తూ కట్టడి చేయాల్సిన పనిలేదా? సమకాలీన సమాజంలో అనేక రకాల దౌర్జన్యాలు, విపక్షపూరితమైన దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయంటే ఇంకా కొందరి మెదళ్ళలో అదే పాత మనువాద సంస్కృతి తాలూకు మకిలి పట్టిన భావజాలం పనిచేస్తూ ఉందన్న మాట! దాన్ని జనం మెదళ్ళ నుంచి సత్వరం కడిగేస్తే గాని - మనుషులంతా ఒక్కటే అనే విశాల భావజాలంలోకి వస్తేగాని - ఈ ప్రపంచం ప్రగతి పథంలోకి నడవదు!

వాల్మీకి రామాయణంలో శూద్రులైన శంభుకుణ్ణి, అభీరుల్ని రాముడు హత్య చేసిన విషయం స్పష్టంగా ఉంది. వాల్మీకి బ్రాహ్మణుడు కాదని, బ్రాహ్మణేతరుడని కొందరికి తప్పుడు అభిప్రాయం ఉంది. నిజానికి వాల్మీకే స్వయంగా తను బ్రాహ్మణున్నని ప్రకటించుకున్నాడు. వాల్మికి రామాయణంలోని 7/96/19-7/93/17 అధ్యాయాలలో ఈ విషయం వివరంగా ఉంది. ఇకపోతే మనుస్మృతి 1, 34, 35 అధ్యాయాలు కూడా చూడండి. అందులో కూడా ఈ విషయం స్పష్టంగానే ఉంది. ప్రచేతనుడు, నారదుడు, అత్రి, వశిష్ఠుడు మొదలైన వారంతా వాల్మీకికి తోడబుట్టిన వారేనని... అందరూ బ్రహ్మపుత్రులేనని, బ్రాహ్మణులేననీ విపులంగా ఉంది.

"ఏవో ఇంగ్లీషు చదువులు చదివి, వేరు వేరు విషయాల్లో పరిజ్ఞానం సంపాదించిన వారికి పురాణేతిహాసాలు, సంస్కృతం అందులోని లోతుపాతులు ఎలా తెలుస్తాయండీ? ఆనాటి మహా జ్ఞానవంతుల స్థాయిని వీరు అందుకోగలరా?" అని పెదవి విరిచేవారు కొందరు ఉంటారు! తప్పదు - అలాంటి వారికి సమాధానం ఇవ్వడానికే ఇక్కడ ఒక పండితుని అభిప్రాయం నమోదు చేస్తున్నాను చూడండి! దైవజ్ఞ భూషణ ఆచార్య పాలడుగు శేషాచల వర్మ పుస్తకానికి ముందుమాట - వినతి - రాస్తూ పండిత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య ఈ విధంగా రాశారు. (ఘంటశాల 17 జనవరి 1967)

"పురాణములు వచ్చి మన పతనానికి కారణములయినవి. ఇవన్నీ పరస్పర విరుద్ధములు. పిట్ట కథలకు పుట్టినిండ్లు. బూతుల బుంగలు... మనకు ప్రమాణ బుద్ధేగాని, పరిశీలన బుద్ధిలేదు. ఇందువల్ల మనం ఆలోచించడం మానినాము... మానవుడు బుద్ధిజీవి గనుక, దేనినైనను ఆలోచించి చేయవలెను. ఈ గ్రంథాన్ని సాంతము చదివి తమ బుద్ధిని ఉపయోగించవలసినదని పాఠకలోకమును కోరుచున్నాను."

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

# అసోంలో అర'మరక'లా?

**నువ్వు, నేను వేర్వేరు అనే ఒక్క భావన చాలు**
**మానవత్వం మగం రూపుదాల్చడానికి**
**మంచీచెడు విచక్షణ తెలిపే సులోచనాలు కావాలి కాని**
**వివేచన పోగొట్టే మతం రంగుటద్దాలు కాదు.**
**మరి ఈశాన్య రాష్ట్రాల మణిహారమైన అసోం...**
**ఏ అద్దాలు పెట్టుకుని తమ సమస్యల్ని చూస్తోంది?**

అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ 'బహుభార్యత్వ' నిషేధ బిల్లును ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటిస్తున్నారు. అలాగే 'లవ్‌జీహాద్' అంశాన్ని కూడా ఈ బిల్లులో చేర్చి 2024కి అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. బహుభార్యత్వం చట్టరీత్యా నేరమని అందరికీ తెలిసిందే కదా. మరి ప్రత్యేకంగా అసోంలో ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణమేంటి?



శ్రీదేవి కవికొండల
6281380827

అక్కడ గిరిజనులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండటమే. మన దేశంలో స్పెషల్ మ్యారేజ్ యాక్టు 1954, హిందూ మ్యారేజ్ యాక్టు 1955 కింద కొన్ని గిరిజన కమ్యూనిటీలు, గోవా నివాసితులు మినహా హిందూ, బౌద్ధ, జైన, సిక్కులలో బహుభార్యత్వ నిషేధం ఉంది. ఈ చట్టాల కిందకి రాని గిరిజనుల సంఖ్య, 2011 జనాభా లెక్కల ప్రకారం అసోం రాష్ట్ర జనాభాలో 12.4శాతం. అలానే ముస్లింలు కూడా ఈ సాధారణ చట్టం కిందకు రారు. ముస్లిం వ్యక్తిగత చట్టం (షరియత్), 1937, ఒకేసారి నలుగురు మహిళలను భార్యలుగా చేసుకునే వీలు కలిగిస్తుంది. జమ్ముకశ్మీర్ తర్వాత అత్యధికంగా ముస్లింలు ఉన్న రాష్ట్రమైన అసోంలో 2022-23 డేటా ప్రకారం రాష్ట్ర జనాభాలో ముస్లింలు దాదాపు 34.22శాతం(1.07 కోట్లు). కాబట్టి గిరిజన, ముస్లిం వర్గాలలో బహు భార్యత్వం ఉన్నదని, దాన్ని అంతమొందించాలనే లక్ష్యంతో అసోం ప్రభుత్వం ముందుకు సాగడం విచారించదగ్గ అంశం. బహుభార్యత్వ వెసులుబాటు ఉన్నప్పటికీ కేవలం ముస్లిం కుటుంబాల్లోనే ఈ విధానం అవలంబిస్తారన్నది అవాస్తవం.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-20) ప్రకారం క్రిస్టియన్లు 2.1శాతం, ముస్లింలలో 1.9, హిందువులలో 1.6, మేఘాలయలో 6.1శాతం బహుభార్యత్వ విధానం ఉంది. ఈ లెక్కల ప్రకారం ఒకటి కంటే ఎక్కువ పెండ్లిళ్ల అత్యధికంగా ఈశాన్య గిరిజన జనాభాలోనే ఎక్కువ. దానికి కారణం, నాగరికతకు దూరంగా బతకడం, నిరక్షరాస్యత, పేదరికం, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన మహిళల దయనీయ స్థితి. ఎన్ని చట్టాలున్నా ముస్లిమేతర మతాలలో కూడా, ప్రత్యేకించి ఎక్కువైతే మహిళలకు ప్రశ్నించగలిగే గళం ఉండదో అక్కడ ఇటువంటి విధానాలు సాధారణమే. మహిళలు, తమ పట్ల జరిగే అన్యాయాలను ఎదురించి నిలవాలంటే వారిలో అక్షరాస్యత పెంపొందించాలి. వారిని స్వశక్తులను చేయడానికి ప్రయత్నాలు చేపట్టాలి. అయితే, 'బహుభార్యత్వ నిషేధచట్టం తీసుకు రావడంతో మతం, ధర్మంతో సంబంధం లేకుండా మహిళా సాధికారతకు ఇది దారితీస్తుంది' అని ఉటంకించడం కేవలం గిల్లి జోలపాడటం వంటిదే. ముఖ్యంగా 'లవ్ జీహాద్'ను పెద్ద బూచిగా చూపడం మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో ఆహ్వానించదగిన పరిణామం కాదు.

ఈశాన్యంలోని ఏడు సోదర రాష్ట్రాలలో అసోంకి ప్రత్యేకత ఉన్నది. ఇది విభిన్న సంస్కృతుల మేళవింపు. మంగోలియన్లు, ఇండో బర్మన్లు, ఇండో ఆర్యన్ల అంతర్ మిశ్రమమే ఈ రాష్ట్రం. అసోం రాష్ట్రంలోకి అడుగు పెట్టగానే కనిపించేవి, మబ్బులు పట్టిన ఆకాశం, చిత్తడి నేల, వెదురుతో కట్టిన అందమైన ఇండ్లు. మైఖెలా చాదోర్ (అక్కడి మహిళల ప్రత్యేక దుస్తులు) కట్టుకున్న మహిళలు. వారి భాష, సంస్కృతి పట్ల వారికి అత్యంత ప్రేమ, గౌరవం. బోడో, కచరి, కర్బీ, మిరి, మిషిమి, రభ, ఇలా 24 గిరిజన తెగలు అక్కడ ఉంటాయి. ప్రతి ట్రైబ్కి ప్రత్యేక వేష భాష లుంటాయి. అంతా ట్రైబ్స్ హిందువులే. ప్రధాన భాష అసోమీస్. ముఖ్యంగా బోడో, అసోమియా భాష మాట్లాడతారు. అసోమీలలో అత్యధికులు వైష్ణవులు. అసోంలో కూడా కుల వ్యవస్థ ఉంది కాని అది భారతదేశంలోని ఇతర ప్రాంతా లంతా ప్రాముఖ్యత ఉన్నది కాదు. బుద్ధిజం, క్రైస్తవం, ఇస్లాం వీటన్నిటి కలయిక రాష్ట్రం. ఇన్ని మతాలు, వైవిధ్యాలు ఉన్నా అక్కడ ఒకరి మతం పట్ల ఇంకొకరికి సానుకూల దృక్పథమే తప్ప వైరాలు తెలియవు. ముస్లింల పెండ్లి ఆచారాలలో కూడా హిందూతత్వం కనిపిస్తూ ఉంటుంది. ఏడాదికి మూడుసార్లు జరుపుకునే బిహు పండుగలు ఐక్యంగా చేసుకుంటారు. దేశంలో ఎప్పుడైతే కుల, మతాల ఆధారంగా పాలన ప్రారంభమైందో అక్కడ కూడా హిందూ, ముస్లింల మధ్య కొన్ని విద్వేషపు విషబీజాలు నాటుకున్నాయి.

అసోం ముస్లింలను నాలుగు ఉప వర్గాలుగా విభజించారు. దేశి, మారియా, గౌరియా, సయ్యేద్, వీరు మొఘల్ సైనికులు స్థానిక అసోమీలను పెండ్లి చేసుకుని అక్కడి భాష, సంస్కృతిని ఒంటబట్టించుకున్నవారు. వారి జనాభా దాదాపు 4 మిలియన్లు. సయ్యేట్లు ఇస్లామిక్ మతజ్ఞురువు మహమ్మద్ నాగసులు, దేశీలు ఇస్లాంలోకి మారిన వారు. వీరు ఎక్కువగా



గోవలపారియా కోక్రఝార్, ధుబ్రి, సౌత్ సల్మారా మన కవర్ మరియు రాజబన్నిలలో ఉంటారు. మారియలు, 1206లో బందీలయిన ముస్లిం సైనికుల వారసులు, మారియా అంటే లోహాలను కొట్టేవారని అర్థం. గౌరియాలు 1532లో అస్సాంను గెలిచిన తుర్బక్‌ఖాన్ వారసులు. వీరు బెంగాల్ గౌర్కు చెందినవారు. గౌరియా, మారియాలు మైనారిటీలు. వీరు ఎక్కువగా శివసాగ్నర్, జోర్హాట్, టిన్ సుకియా, గోలాఘాట్, కామరూప్ జిల్లాల్లో ఉంటారు. వీరి మాతృభాష అసోమీస్, బంగ్లాదేశ్ నుండి అసోంకు వలస వచ్చిన పెద్ద సంఖ్యలో ముస్లింలు, బెంగాలీ మాట్లాడే మియా ముస్లింలు బరాక్ వేలీ సిటీటి ముస్లింలకు ప్రసిద్ధి. వీరు ధుబ్రి, మారిగాంవ్, హోజాయ్, ఇలా మధ్య, కింది అసోం ప్రాంతాలలో ఉంటారు. అసోం జనాభాలో 40శాతం ముస్లింలు ఉంటే అందులో దాదాపు 30శాతం మియా ముస్లింలే. హిందీ బెల్ట్ నుండి వలస వచ్చిన ముస్లిం వలసకారులు రాష్ట్ర జనాభాలో దాదాపు 0.4శాతం. వీరు బ్రహ్మపుత్ర ప్రాంతంలో ఉంటారు.

1979 అసోం మూవ్మెంట్ నుండి మొదలుకుని ఇప్పటి వరకు అక్కడి స్థానికులకు, ఇంకా వలసదారులకు మధ్య భూవివాదాలు సాధారణమే తప్ప దానికి మతం రంగులేదు. ఒకవేళ అంతర్లీనంగా అటువంటి భావనలున్నా దానికి అంత ప్రాముఖ్యత ఉండేది కాదు. బెంగాలీ, బీహారీ వలసదారులు తమ భూములను, ఉద్యోగ అవకాశాలను కొట్టేస్తున్నారన్న ఆక్రోశం మాత్రమే వారిలో ఉండేది. కాని గత కొంతకాలంగా హిందూ, ముస్లిం వివాదాలు, 'లవ్ జీహాద్' వంటి కొత్త అంశాలు వెలుగులోకి తెస్తున్నారు. అసోం ముఖ్యమంత్రి, 'లవ్ జీహాద్' అనే అంశాన్ని లేవదీస్తూ, అధికారికంగా హిందూ, ముస్లిం జంటకు వివాహం జరపకూడదని, అబ్బాయి కాని అమ్మాయి కాని మతం మారకుండా, ప్రత్యేక మ్యారేజ్ యాక్టు కింద మాత్రమే పెండ్లి చేసుకోవాలని ప్రకటించారు. అసోంలో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతాయి. ఈమధ్య మైనర్ బాలికలను వివాహం చేసుకున్న వ్యక్తులను ప్రభుత్వం పోక్సో చట్టం కిందకి తీసుకొచ్చింది. బాల్యవివాహాలు జరగడానికి కారణం అవిద్య, పేదరికం, చట్టం పట్ల అవగాహన లేకపోవడం. ప్రభుత్వం వీటి మీద దృష్టి పెట్టకుండా, 14ఏండ్లలోపు పిల్లలపై జరిగే లైంగిక నేరాలను, బాల్య వివాహాలను ఒకే గాటిన కట్టి గత కొంతకాలంగా దాదాపు 8వేల మందిని అరెస్టు చేసి తమ క్రూరత్వాన్ని ప్రదర్శించింది! దీన్ని వ్యతిరేకిస్తూ మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పోరాటాలు చేస్తున్నాయి.

అంతకుముందు స్వదేశీ, విదేశీ భావనలు ప్రజల్లో స్వల్పంగా ఉండేవి. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 'వీరు మా

గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 'వీరు మా అసోమీ ముస్లింలు' అని కొన్ని ముస్లిం వర్గాలను ప్రత్యేకంగా స్వదేశీగా ప్రకటించడంతో, బంగ్లాదేశ్ నుండి వలసొచ్చిన బెంగాలీ ముస్లింలను ప్రత్యక్షంగా ప్రభుత్వం సాక్షిగా వెలివేసినట్టయింది. బెంగాలీ ముస్లింల పట్ల అప్పటికీ ప్రభుత్వం, స్థానికులు జరుపుతున్న హింసాకాండకు దీంతో మరింత ఆజ్యం పోసినట్టయింది. 1971, మార్చి 24 తర్వాత బంగ్లాదేశ్ నుంచి వలసొచ్చిన వారిని అక్రమ వలసదారులుగా లెక్కించడంతో దాడులు నిత్యకృత్యమయ్యాయి. అయితే స్థానికుల అభద్రతాభావానికి మతం రంగు కూడా తగిలింది.

అసోమీ ముస్లింలు' అని కొన్ని ముస్లిం వర్గాలను ప్రత్యేకంగా స్వదేశీగా ప్రకటించడంతో, బంగ్లాదేశ్ నుండి వలసొచ్చిన బెంగాలీ ముస్లింలను ప్రత్యక్షంగా ప్రభుత్వం సాక్షిగా వెలివేసినట్టయింది. బెంగాలీ ముస్లింల పట్ల అప్పటికీ ప్రభుత్వం, స్థానికులు జరుపుతున్న హింసాకాండకు దీంతో మరింత ఆజ్యం పోసినట్టయింది. 1971, మార్చి 24 తర్వాత బంగ్లాదేశ్ నుంచి వలసొచ్చిన వారిని అక్రమ వలసదారులుగా లెక్కించడంతో దాడులు నిత్యకృత్యమయ్యాయి. అయితే స్థానికుల అభద్రతాభావానికి మతం రంగు కూడా తగిలింది. బహుభార్యత్వ నిషేధాన్ని తీసుకువచ్చి ముస్లిం మహిళల సానుభూతి పొందవచ్చనే ఆశ ప్రభుత్వ అంతర్మథనం కావచ్చు. కాని వారి అంచనాలు ఎంతవరకు ఫలిస్తాయనేది సందేహమే. మహిళలకు మంచి చేస్తున్నామని చెప్పి ట్రిపుల్ తలాఖ్ రద్దు చేసినప్పుడు కూడా వివిధ కారణాల వలన ఫెమినిస్టులు, ముస్లిం మహిళలు వ్యతిరేకత ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పుడు తీసుకువచ్చే బహుభార్యత్వ నిషేధం, లవ్ జీహాద్‌ల నిర్ణయాలతో మహిళా సాధికారత సందేహాస్పదమే. సాంస్కృతికంగా ఇంత వైవిధ్య భరితమైన ఈశాన్య రాష్ట్రాల్లోనూ విభజన రాజకీయాలు వేళ్లూనుకుంటే పరిస్థితులు మరింత విషమంగా మారే ప్రమాదముంది. అందుకే యావత్ దేశం జాగ్రత్తపడాల్సిన సమయం ఆసన్నమైంది.



# 'గీత' కార్మికులంటే చిన్నచూపెందుకు?

తెలంగాణ రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గతంలో ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదు. అనేక సభల్లో, వేదికలపై వృత్తిదారుల సంక్షేమానికి పాటు పడుతున్నామని చెబుతున్న పాలకులు ప్రత్యేక రాష్ట్రంలో గీతన్నలకు ఇచ్చే గుర్తింపు ఇదేనా? గీత వృత్తిపై ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది చనిపోతున్నారు. కాళ్లు చేతులు విరుగుతున్నాయి. నడుములు పడిపోయి మంచాన పడుతున్నారు. రెండు రోజులకు ఒకరు చొప్పున చనిపోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సంవత్సరానికి సుమారు 550మంది చెట్టుపై నుంచి జారి పడుతున్నారు. 180మంది తనువు చాలిస్తున్నారు. ఇంత ప్రమాదం ఏ వృత్తిలో లేదు. వీరిని ఈ ప్రమాదాల నుండి కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందా... లేదా? మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ అధ్యక్షులు, మంత్రివర్యులు కేటీఆర్ ప్రమాదాలు నివారించే చర్యలు తీసుకుంటామని, గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలిస్తామని, లిక్కర్ షాపులలో గౌడలకు ఇచ్చే 15శాతం రిజర్వేషన్‌లు సొసైటీలకు ఇస్తామని, గీతన్న బీమా పథకం తదితర గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవి ఇంతవరకు నెరవేర్చలేదు. ఇటీవల జరిగిన లిక్కర్ షాప్ టెండర్లలో సొసైటీలకు రిజర్వేషన్స్ కల్పించకుండా పాత పద్ధతినే కొనసాగించారు. మోపెడ్‌లు ఇస్తారని గత రెండేండ్లుగా ఆశతో ఎదురుచూస్తున్న కల్లు గీత కార్మికులకు నిరాశే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి రూ.100కోట్లు కేటాయించామని చెప్పారు. బడ్జెట్ పత్రంలో మాత్రం రూ.30కోట్లు కుదించారు. ఆరు నెలలవుతున్నా ఇప్పటికి వాటిలో ఒక్క రూపాయికి కూడా ఖర్చు చేయలేదు. కల్లు గీత కార్పొరేషన్ పేరుకు మాత్రమే ఉన్నది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల తర్వాత కార్పొరేషన్‌కు చైర్మెన్‌ను నియమించింది. దీని వలన వారి రాజకీయ ప్రయోజనం నెరవేరింది తప్ప గీత కార్మికులకు అదనపు ప్రయోజనం ఒనకూరింది ఏమీలేదు. కార్పొరేషన్‌కు తగిన బడ్జెట్ కేటాయించకుండా, వృత్తిలో ఆధునిక పద్ధతులు అవలంబించకుండా ఏమి చెప్పినా ఒట్టి మాటలుగానే మిగిలిపోతాయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన గీతన్న బీమా అమలు కావడం లేదు. ఇటీవల బీసీ కుల వృత్తి దారులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహకారమందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటన రాగానే గీత కార్మికులు ఆనందపడ్డారు. రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ జీఓ విడుదల చేయడంతో అర్హులైనవారు 13వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. గడువు సమయం కొద్ది రోజులే ఉండటం వలన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలందక పోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేక పోయారు. వీరిలో ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఈ పథకం అమలు కాలేదు. గీత కార్మికులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే ఏ పథకం ఇప్పటి వరకు రాలేదు. మిగతా తోటి కుల వృత్తుల వారికి ఎంతో కొంత మేరకు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. వారికి అమలవడం మంచిదే. కానీ వీరికి కూడా పథకాలు వర్తిస్తే ఇంత నిరాశకు గురయ్యేవారు కాదు. మరోపక్క గౌడ సామాజిక వర్గానికి చట్ట సభలలో ప్రాధాన్యత తగ్గిస్తున్నారని ఆవేదన. ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం నేటికి అమలు కావడం లేదు. కొద్ది మంది ధనవంతుల చేతుల్లో సంపద కేంద్రీకృతమవుతుంది. వృత్తిదారులంటే సామాజికంగా చిన్నచూపు ఉంటోంది. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సీట్ల కేటాయింపులో డబ్బులున్నోళ్లు, అగ్ర కులాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతి సమస్య రాజకీయాలతో ముడిపడి ఉన్నందున చట్ట సభల్లోనూ వీరి సంఖ్య పెరగాల్సిన అవసరం ఉంది. వృత్తిలో ఉపాధి పెరగాలంటే సొసైటీలకు చెట్ల పెంపకానికి భూమినివ్వాలి, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి, నీరా లాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలి. అందుకు రూ.5వేల కోట్ల బడ్జెట్ అవసరం. దాన్ని ఆచరణకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి. అప్పుడే గీత వృత్తిదారులకు తగిన భరోసా కలుగుతుంది. ఇప్పటికే ఈ అంశాలపై అనేకసార్లు తెలంగాణ కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇచ్చి, ఉద్యమాలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వచ్చే ఎన్నికల నేపథ్యంలోనైనా గీతన్నల సమస్యలు పరిష్కరించాలి. అందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 22న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు అన్ని జిల్లాల నుంచి గీతకార్మికులు హాజరై విజయవంతం చేయాలి.

- ఎం.వి.రమణ, సెల్: 9490098485.

## మహిళా బిల్లుకు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

అమల్లోకి వస్తుందనే అనిశ్చితి నెలకొంది. బిల్లు ఆమోదం కోసం పరిశీలించిన రాజ్యసభలో జరిగిన చర్చలో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని గట్టిగా ఎంపీలు డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయో స్పష్టం చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదు. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌పై ప్రభుత్వం కూడా వెనుదిరిగింది. ఎన్నికల ముందు ఈ బిల్లు మోసం మాత్రమేనని, లేకుంటే త్వరలోనే అమలులోకి వచ్చేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. లోక్‌సభలో ఈ బిల్లు బుధవారం ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. గురువారం రాజ్యసభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై చర్చ జరిగింది.

**మహిళా బిల్లు ప్రధాని దయ కాదు**

ఈ బిల్లులోని నిబంధనలు మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రధాని దయ కాదని కాంగ్రెస్ ఎంపీ రంజీత్ రంజన్ మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం మహిళలను ఎంతగా గౌరవిస్తుందో అందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ ఎదుట రెజ్లర్లు చేపట్టిన ఆందోళన, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలను ఆమె ప్రస్తావించారు. మహిళలు హక్కులను కోరుకుంటున్నారని, జాలి కాదని స్పష్టం చేశారు.

**వెంటనే అమలు చేయాలి**

సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ, నటి జయా బచ్చన్ బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జయా బచ్చన్ ప్రసంగిస్తూ.. మహిళలను గౌరవించే ఈ సంప్రదాయం 'ఆడంబరం'గా ఉండదని తాను ఆశిస్తున్నానని, ఇది ఇంకా కొనసాగుతుందని అన్నారు. లేకపోతే.. సభలోని మహిళల్ని మిమ్మల్ని (రాజ్యసభ చైర్మెన్ జగ్‌దీప్ ధన్కర్) ప్లాస్టిక్ సర్జన్ అని పిలుస్తారని ఛలోక్తులు పేల్చారు. మీ (జగ్‌దీప్ ధన్కర్) కుర్చీ చాలా ఆసక్తికరంగా ఉందని, అదొక ఉయ్యాల తరహాలో అటూ ఇటూ కదులుతుంటుందని అన్నారు. అయినా.. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి తాము ఎవరని ప్రశ్నించారు. తమకు ధైర్యం ఉంది కాబట్టి తాము పార్లమెంట్‌లో అడుగుపెట్టామని, తమ నాయకుల్లో ధైర్యం ఉంది కాబట్టే వాళ్లు తమని ఇక్కడికి తీసుకొచ్చారని అన్నారు. కానీ.. మహిళల్ని తీసుకురావాల్సిన వారు ఏం చేస్తున్నారో తెలియడం లేదని.. బీజేపీకి చురకలంటించారు. ఎన్నికలు జరుగుతాయా, లేవా..? గెలిపిస్తారా, గెలిపించరా? అనేది తెలియదని చెప్పారు. ఎక్కడి నుంచైతే ఓడిపోతారో, అక్కడే మహిళలకు వాళ్లు (బీజేపీ) టికెట్లు ఇస్తారని కౌంటర్ వేశారు. ఇప్పుడు ఈ డ్రామాని ఆపాలని పార్లమెంట్‌లో ఉద్ఘాటించారు. ఇంతలో పార్లమెంట్‌లో ఉన్న బీజేపీ నేతలు అడ్డుకోవడంతో.. జయా బచ్చన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"మీరు బిల్లు సమర్పించేశారు. ఇప్పుడు మాకు మాట్లాడే అవకాశం ఇవ్వండి. ఒకవేళ మీరు అడ్డుకుంటే మాత్రం.. మీకు వ్యతిరేకంగా అభ్యంతరం తెలుపుతాను. మేం ఏం చెప్పాలనుకున్నామో అది చెప్పనివ్వండి" అంటూ ఫైర్ అయ్యారు. ఈ బీజేపీ వాళ్లు ప్రతీ చిన్న విషయంపై కామెంట్లు చేస్తారని, అదే తాము చేస్తే మాత్రం వీళ్లకు కోపం నషాళానికి ఎక్కుతుందంటూ సెటైర్లు వేశారు. అనంతరం.. ఈ బిల్లు గతంలో కూడా వచ్చిందని, ఆ సమయంలో సుష్మా స్వరాజ్‌తో పాటు బృందా కరత్ అద్భుతమైన ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు లోక్‌సభలో ఆమోదం పొంది బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, దీనికి మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అయితే.. ఈ బిల్లులో ఒక అంశం తనని కలచివేస్తోందని జయా బచ్చన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతం టిక్కెట్లు ఇవ్వాలని మీరు కోరుకుంటే.. ముస్లిం మహిళలకు ఎన్ని టిక్కెట్లు ఇస్తారని ఆమె ప్రశ్నించారు. మీకు ధైర్యం ఉంటే.. బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదం పొందిందని కేవలం డప్పు కొట్టుకుంటే సరిపోదని, బిల్లుని అమలు చేసి, అప్పుడు ప్రచారం చేసుకోండని ఛాలెంజ్ చేశారు. మీరు ప్రతి చిన్న విషయానికి అనవసరమైన ప్రచారం చేస్తుంటారని బీజేపీకి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

**బిల్లు మోసం కాదు**

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ బిల్లు మోసం కాదని పేర్కొన్నారు. చట్టం ప్రకారం, తదుపరి పునర్విభజన 2026 తర్వాత మాత్రమే సాధ్యమవుతుంది. అందుకని ముందు రిజర్వేషన్లు తీసుకు రాలేము. జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయిన వెంటనే నియోజక వర్గాల పునర్విభజన జరగనుంది. ఆ తర్వాత రిజర్వేషన్లు త్వరగా పూర్తవుతాయి. మహిళా రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడూ మద్దతిస్తోంది. కాబట్టి చిత్తశుద్ధిపై సందేహం లేదు. రాజ్యసభలో, దాని ఎన్నికల వ్యవస్థ కారణంగా, మహిళలకు రిజర్వేషన్ సాధ్యం కాదు. మహిళా రిజర్వేషన్ అమలు కోసం గతంలో చేసిన ప్రయత్నాలను వివరిస్తున్నప్పుడు ఎన్నో అందమైన క్షణాలు గుర్తుకు వస్తాయి. 2010లో రాజ్యసభ బిల్లును ఆమోదించిన తర్వాత పార్లమెంటు నుంచి బయటకు వచ్చిన బృందా కరత్‌ను సుష్మా స్వరాజ్ కౌగిలించుకుని అభినందించారు. గీతా ముఖర్జీ సహా పలువురు మహిళా నేతలు రిజర్వేషన్ల కోసం గట్టిగా నిలబడ్డారని నిర్మలా అన్నారు.

**ప్రభుత్వం స్పష్టం చేయాలి. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే**

ఏ సంవత్సరం..ఏ నెలలో అమలు చేస్తారో స్పష్టంగా ప్రభుత్వం చెప్పాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రభుత్వ వైఖరిని కూడా స్పష్టం చేయాలి. మహిళా రిజర్వేషన్‌ని జనాభా లెక్కలతో ముడిపెట్టాల్సిన అవసరం లేదు. ప్రస్తుత సీట్ల ఆధారంగా రిజర్వేషన్ చేసుకోవచ్చు. జనాభా లెక్కలు, పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య పెరిగినప్పుడు రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్యను పెంచవచ్చని ఖర్గే సూచించారు. దీనిపై న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పందిస్తూ.. రిజర్వేషన్ల అమలుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మోడీ పాలనలో ఏదైనా సాధ్యమేనని అన్నారు. రాజ్యాంగం ప్రకారం జనాభా గణన జరుగుతుందని, జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలు తదితరాలు ఉండాలని, అందుకే బిల్లులో భాగంగా చేశామని మంత్రి చెప్పారు. ఓటింగ్‌కు ముందు ప్రధాని నరేంద్ర మోడీ సభకు చేరుకున్నారు. అంతకుముందు లోక్‌సభలో మహిళా బిల్లుకు మద్దతు తెలిపిన ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని, బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి ఆదర్శంగా నిలవాలని ప్రధాని అన్నారు. ఉభయ సభల్లో బిల్లుపై 132 మంది ఎంపీలు మాట్లాడారని, బిల్లుపై ఏకాభిప్రాయం ప్రజల్లో విశ్వాసం నింపుతుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ 'నారీ శక్తి'కి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో మహిళలు మరింత ఆత్మవిశ్వాసంతో నాయకత్వం వహిస్తారని మోడీ అన్నారు. రిజర్వేషన్లు ఎప్పుడు అమలు చేస్తారో, ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ విషయంలో తన స్టాండ్ ఏమిటో మోడీ వివరించలేదు.

## ఎస్ఎఫ్ఐ నాయకులపై ఖాకీల కర్కశం

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బలకు ఆయన నోటి నుంచి రక్తం వచ్చినట్టు తెలిసింది. ప్రశాంత్‌తోపాటు జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, ఇతర నాయకులు, విద్యార్థుల సెల్‌ఫోన్‌లను పోలీసులు లాక్కున్నట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలసాని లెనిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్, నాయకులు నితిన్, అనిల్, ప్రతిమ ప్రత్యూష రజిత, స్టాలిన్, సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

**రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోంది**
**ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై మాట్లాడితే పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, స్టేషన్‌కు తరలించే మార్గంలోనే దుర్భాషలాడుతూ ఆటోలోనే ఎస్ఐ ఇష్టానుసారంగా దాడి చేశారని చెప్పాడు. తలపై, కడుపులో పిడిగుద్దులు గుద్దారని, స్టేషన్‌కు తీసుకెళ్లిన తరువాత కూడా దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

**గ్రంథాలయ నిర్మాణాన్ని వేరేచోటుకి మార్చాల్సిందే..**
**సీపెల్లి రవీందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

గ్రంథాలయ సంస్థ భవన నిర్మాణాన్ని మరోచోట నిర్మించాలి. ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల బిల్డింగ్ తొలగించి ఆ స్థలంలో గ్రంథాలయ నిర్మాణం చేపడతామని శంకుస్థాపన చేయడానికి వచ్చిన మినిస్టర్ కొప్పుల ఈశ్వర్‌కు విద్యార్థుల బాధలు చెప్పడానికి వెళ్తున్న సమయంలో పోలీసులు దుర్మార్గంగా దాడులు చేశారు. ఈ అప్రజాస్వామిక చర్యను భారత విద్యార్థి ఫెడరేషన్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తున్నాం. పదేండ్లుగా విద్యార్థులకు తరగతి గదులు లేక ల్యాబ్‌లు, స్టోర్ రూముల్లో కూర్చొని క్లాసులు వింటున్నారు. ఈ క్రమంలో అన్ని సౌకర్యాలతో కొత్త భవనం కట్టించాలని అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చాం. అవేమీ పట్టించుకోకుండా గ్రంథాలయం నిర్మాణం కోసం ఆ కళాశాల భవనాన్ని తొలగించడం సిగ్గుచేటు. ఇప్పటికైనా గ్రంథాలయ నిర్మాణాన్ని వేరేచోటికి మార్చి కళాశాలకు నూతన భవనం కట్టించాలి. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనా కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

# ఆదివాసీ హక్కులపై బీజేపీ దాడి

### అన్ని రంగాల్లో గిరిజనుల బలోపేతానికి చర్యలు చేపట్టాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మాజీ ఎంపీ బృందాకరత్ డిమాండ్
- ముగిసిన ఆదివాసీ జాతీయ మహాసభలు
- 67 మందితో నూతన కమిటీ ఎన్నిక
- చైర్మెన్‌గా జితేంద్ర చౌదరి, జాతీయ కన్వీనర్‌గా పులిన్‌బాస్కి




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని ఆదివాసీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకరత్ విమర్శించారు. తమిళనాడులోని నమ్మకల్ జిల్లా కేంద్రంలో ఈనెల 19న ప్రారంభమైన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ నాలుగో మహాసభలు గురువారం జయప్రదంగా ముగిశాయి. దేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ఎనిమిది తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ముగింపు ఉపన్యాసంలో బృందాకరత్ మాట్లాడుతూ

రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవి ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలను వనవాసీలుగా చిత్రీకరిస్తూ వారి హక్కులపై దాడి చేస్తున్నదని విమర్శించారు. ఆదివాసీ, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు వేరుగా ఉన్నందున వారిని మతంతో సంబంధం లేకుండా ప్రకృతి ఆరాధికులుగా గుర్తింపు ఇవ్వడం ద్వారానే వారి ఉనికిని కాపాడగలుగుతామని అన్నారు. గిరిజనులు సామాజిక, ఆర్థిక రంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) పేరుతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఆదివాసీ, గిరిజనులపై బలవంతంగా రుద్దుతున్నాయని విమర్శించారు. అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక మార్కెట్ సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం ద్వారానే గిరిజనులు, ఇతర రైతులు రక్షించబడతారని చెప్పారు. అందుకోసం గిరిజనులు, ఆదివాసీలు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### 17 మందితో ఈసీ ఎన్నిక

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ మహాసభలో 17 మందితో జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ)ని ప్రతినిధులు ఎన్నుకున్నారు. నూతన జాతీయ చైర్మెన్‌గా జితేంద్ర చౌదరి, జాతీయ కన్వీనర్‌గా పులిన్ బాస్కి, వైస్ చైర్మెన్లుగా బృందా కరత్, డాక్టర్ మిడియం బాబురావు, ఆర్ సర్వన్, జెపి గావిత్, డి హెమ్రాం, నరేష్ జమాతియ, బివి ఖని, కో కన్వీనర్లుగా దులిచంద్ మీనా, తిరుపతి రావ్, కోశాధికారిగా ఢిల్లీ బాబు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఆర్ శ్రీరాం నాయక్, రాజాచంద్రన్ దే బర్మా, ఎస్వై గావిత్, వికాస్ రావెల్ ఎన్నికైన వారిలో ఉన్నారు. 67 మందితో కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో తెలంగాణ నుంచి ఎం ధర్మానాయక్, డి రవి నాయక్, బండారు రవికుమార్, పూసం సచిన్‌లున్నారు.

### ఆదివాసీ గిరిజనుల భారీ ప్రదర్శన

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ మహాసభల సందర్భంగా నమక్కల్ జిల్లా కేంద్రంలో గురువారం వేలాదిమంది ఆదివాసీ గిరిజనులతో భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యురాలు ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ వైస్ చైర్మెన్ బృందా కరత్, జాతీయ చైర్మెన్ జితేంద్ర చౌదరి, జాతీయ కన్వీనర్ పులిన్ బాస్కి, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, తమిళనాడు ట్రైబల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఢిల్లీ బాబు, శరవణన్, నాయకులు పి షన్ముగం, ఏవీ షన్ముగం తదితరులు పాల్గొని ప్రసంగించారు.



# చేనేతపై కేంద్రం పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

కన్వెన్షన్‌ను హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్నారు. అఖిల భారత స్థాయిలో ఉద్యమాలు చేసేందుకు ఒక స్టీరింగ్ కమిటీని కూడా వేయబోతున్నారు.

**పథకాల్లో ఎత్తివేత..నిధుల్లో కోత**

ఎవరైనా చేనేత కార్మికుడు చనిపోతే మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన పథకం కింద లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందేది. మోడీ సర్కారు అది దక్కకుండా చేసింది. ఐసీఐసీఐ లాంబాడ్ హెల్త్ స్కీం ఆరోగ్య సమస్యలున్న చేనేత కార్మికులకు ఎంతో దోహదపడేది. దీన్నీ కేంద్రం ఎత్తేసింది. హౌస్ కమ్ వర్క్‌షెడ్ పథకం కింద చేనేత కార్మికునికి లక్షా 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందేది. మోడీ సర్కారు దీన్నీ కాలరాసింది. గతంలో 22 రకాల రిజర్వేషన్ ఉండేది. మోడీ సర్కారు వచ్చాక 11 రకాల చేనేత రిజర్వేషన్ మాత్రమే అమలు చేస్తున్నది. వాస్తవంలో ఐదారు రకాలకే వర్తిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం చేనేత రంగానికి ఏటేటా నిధులను తగ్గిస్తూ పోతున్నది. 2022-23 బడ్జెట్‌లో చేనేత రంగానికి కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించబడ్డాయి. అది కూడా చేనేత, టెక్స్‌టైల్ రంగాలకు రెండింటికీ కలిపి కేటాయిస్తున్నది. ఆ నిధుల్లోనూ టెక్స్‌టైల్ రంగానికి ఎక్కువ, చేనేతకు తక్కువ నిధులు దక్కుతున్నాయి.

**ముడిసరుకులపై ధరాభారం..ఆపై జీఎస్టీ బాగోతం**

ఒక చేనేత వస్త్రం తయారు కావాలంటే మానవ శ్రమతో పాటు పట్టు, నూలు, రంగులు, రసాయనాలు, తదితర ముడిసరుకులూ అవసరం పడుతాయి. మోడీ సర్కారు వచ్చిన తొమ్మిదేండ్ల కాలంలో వాటి ధరలు రెట్టింపు అయ్యాయి. దీనికితోడు పట్టుపై 12 శాతం, నూలుపై ఐదు శాతం, రంగులు, రసాయనాలపై ఐదు నుంచి 12 శాతం చొప్పున జీఎస్టీ వేస్తున్నది. వస్త్రం తయారైన తర్వాత అమ్మకానికి పెట్టే సమయంలోనూ ఐదు శాతం జీఎస్టీ భారం వేస్తున్నది. అంటే చేనేత పరిశ్రమపై పన్నుల మీద పన్నులు వేస్తూ కేంద్రం భారం మోపుతున్నది. ఈ భారంతో పవర్‌లూమ్, వస్త్ర మిల్లులను తట్టుకుని చేనేత కార్మికులు మార్కెట్‌లో నిలవలేకపోతున్నారు. దీంతో ప్రజలు చేనేత వస్త్రాలకు క్రమంగా దూరం అవుతున్నారు. దీనిని బట్టే కార్పొరేట్ వస్త్ర పరిశ్రమ వైపు కేంద్రం పక్షపాతం చూపిస్తూ చేనేతను నాశనం చేస్తున్నదని ఇట్టే అర్థమవుతున్నది.

**జాతీయ చేనేత బోర్డు రద్దు**

వివిధ రాష్ట్రాల్లో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు జాతీయ స్థాయిలో చేనేత బోర్డు గతంలో ఉండేది. ఆయా రాష్ట్రాల నుంచి ఆ బోర్డులో ప్రతినిధులు ఉండేవారు. వారు ఆయా రాష్ట్రాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి కేంద్రానికి సూచించేవారు. అందులో చాలా మేరకు సమస్యలకు పరిష్కారం లభించేది. మోడీ సర్కారు వచ్చాక ఆ బోర్డును రద్దు చేసి చేనేత కార్మికుల గొంతును నొక్కేసింది.

**సర్కారుకు బట్ట అవసరమున్నా..నేతన్నలపై పెద్ద చూపేది?**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవసరాలకు వస్త్రాల అవసరం ఉంటుంది. ఆస్పత్రుల్లో బెడ్‌షీట్లు, ఇతర అవసరాలకు బట్టలు అవసరం. కానీ, ప్రభుత్వాలు మాత్రం చేనేతకు ఆర్డర్లు ఇవ్వడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేసే ఆశాలు, అంగన్వాడీలకు, గ్రామ పంచాయతీ, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చే యూనిఫామ్‌ల ఆర్డర్లను చేనేత కార్మికులకు ఇస్తే ఎంతో మంది ఉపాధి కల్పించి వారి జీవనోపాధిని మెరుగు పర్చవచ్చు. పాలకులు ఈ దిశగా ఆలోచించడం లేదు.

**తెలంగాణలో సహకార వ్యవస్థ నిర్వీర్యం**

మన రాష్ట్రంలో 382 చేనేత సహకార సంఘాలున్నాయి. వాటికి ప్రతి ఐదేండ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలి. కానీ, ఈ ప్రక్రియ తొమ్మిదేండ్లుగా అటకెక్కింది. దీంతో సహకార వ్యవస్థ రాష్ట్రంలో కుంటుపడింది. చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలను సహకార సంఘాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. కానీ, బిల్లులను మాత్రం ఎప్పటికప్పుడు చెల్లించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఏడాది నుంచి ఏడాదిన్నర వరకు పెండింగ్‌లో ఉన్న ఘటనలున్నాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు రూ.25 కోట్ల దాకా ఉన్నట్టు సమాచారం. సహకార సంఘాలకు చెందిన రూ.72 కోట్ల రుణాల మాఫీ చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో వస్తున్నా సర్కారు ఆ వైపు దృష్టి సారించడం లేదు.

### చేనేత రంగంపై కేంద్రం తీరు కక్షపూరితం

కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. సంక్షేమ పథకాలను, బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తూ పోతున్నది. చేనేత బోర్డును ఎత్తేసింది. దీనిపై దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి పోరాడేందుకే చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికుల అఖిల భారత కన్వెన్షన్‌ను నిర్వహిస్తున్నాం. అందులో భవిష్యత్ పోరాట కార్యాచరణను రూపొందిస్తాం. వెంటనే చేనేత బోర్డును ఏర్పాటు చేయాలి. చేనేత, టెక్స్‌టైల్ రంగాలకు వేర్వేరుగా బడ్జెట్ కేటాయించాలి. పోచంపల్లి ఇక్కత్ పేటెంట్ హక్కును కాలరాస్తూ దొంగతనంగా ప్రింట్ వేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో 30 వేల వరకు మగ్గాలకు జియోట్యాగింగ్ చేశారు. ఇంకా ఏడెనిమిది వేల మగ్గాలకు చేయాల్సి ఉంది. సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. రుణాలను మాఫీ చేయాలి. చేనేత ముడిసరుకుల విక్రయ కేంద్రాలను ప్రభుత్వమే నిర్వహించాలి. వాటిని సబ్సిడీపై ఇస్తే నేత కార్మికులకు ఉపాధి పెరిగే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ, గ్రామ పంచాయతీ కార్మికులకు, ప్రభుత్వ పథకాల్లో పనిచేసే వారికి చేనేత వస్త్రాలను యూనిఫాంగా ఇవ్వాలి. చేనేత కార్మికులకు చేనేత బంధు కింద రూ.10 లక్షల పెట్టుబడి సహాయాన్ని అందించాలి. చేనేత కార్మికులకు మినిమం వేజ్ అమలు చేయాలి. 22 రకాల రిజర్వేషన్‌ను కేంద్రం కొనసాగించాలి.

**చెరుపల్లి సీతారాములు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు**



## సూర్యాపేట టిక్కెట్ ఎవరికో..

- కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్కంఠ
- ఢిల్లీలో దామోదర్‌రెడ్డి.. పేటలో రమేష్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితా కసరత్తు కొనసాగుతూనే ఉంది. కొన్ని రోజులు హైదరాబాదులో, మరికొన్ని రోజులు ఢిల్లీలో అభ్యర్థుల వడపోత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక వారికి కత్తి మీద సాములా మారింది. సూర్యాపేటలో టికెట్టు కోసం మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, బీసీ నేతలు తండు శ్రీనివాస్ యాదవ్, ఎలగందుల రాము, ముషం రవి కుమార్ టిక్కెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఎన్నికల స్టీరింగ్ కమిటీ అభ్యర్థుల వడపోత నిర్వహించింది. ఆ తర్వాత జాబితాను ఏఐసీసీకి పంపించారు. బుధవారం, గురువారం ఢిల్లీలో అభ్యర్థుల ఎంపికపై సీడబ్ల్యూసీ కసరత్తు చేపట్టింది. దామోదర్‌రెడ్డి హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. అక్కడ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక కమిటీ సభ్యులు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డిని దామన్న మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా మరికొందరు అగ్ర నేతలను కలిసి టిక్కెట్ సాధించేందుకు దామోదర్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. ఈనెల చివరిలో మొదటి జాబితా విడుదల అయ్యే అవకాశం ఉంది. మొదటి జాబితాలోనే తన పేరు ఉంటుందనే ఆశాభావంతో దామోదర్ ఉన్నారు.

ఇదిలా ఉండగా, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి రూ.20 లక్షలతో కొనుగోలు చేసిన ఎన్నికల ప్రచార రథానికి గురువారం సూర్యాపేటలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోటాలో వంద శాతం టిక్కెట్ తనదే అనే ధీమాతో ఆయన ఎన్నికల ప్రచారానికి సిద్ధపడుతున్నారు. ఒకవైపు దామోదర్‌రెడ్డి ఢిల్లీలో పూర్తి భరోసాతో ఉండగా.. ఇక్కడ రమేష్ రెడ్డి ఏకంగా ప్రచార రథాన్ని ప్రాంభించుకొని ఎన్నికల రణరంగానికి సిద్ధపడటం గమనార్హం. ఇరువురూ టిక్కెట్‌పై పూర్తి నమ్మకంతో ఉండటంతో జిల్లా కేంద్రంలో ఉత్కంఠ నెలకొంది.

టిక్కెట్ విషయంలో తగ్గేదేలే అన్నట్టు పోటీపడుతున్నారు. అభ్యర్థుల ఎంపిక, వడపోత సమయంలో సూర్యాపేట టిక్కెట్ ఫైనల్ చేయడం కమిటీ సభ్యులకు కత్తి మీద సాములా మారే అవకాశం ఉంది. ఈ కమిటీలో ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు రేవంత్ రెడ్డి, తాజాగా కోమటిరెడ్డి వెంకటిరెడ్డి కూడా ఉన్నారు. రాష్ట్ర అగ్ర నేతలు ఢిల్లీలో మకాం వేయడంతో టిక్కెట్ ఎవరికి దక్కుతుందా అనే ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలోనే సూర్యాపేట టికెట్ చర్చనీయాంశంగా మారింది. ఈ టికెట్ ప్రకటనతోనే సూర్యాపేటలో విజయావకాశాలు ఎవర్ని వరించనున్నాయో తేలే అవకాశం ఉంది. సీనియర్లు, జూనియర్ల వార్ నేపథ్యంలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో చూడాలి. దామోదర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తమ పట్టును ఏ మాత్రం సడలించకుండా టికెట్ కోసం పోరాడుతున్నారు.

## ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు

- ఒబీసీ సంక్షేమ సమితి అధ్యక్షులు జి.సుధాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదని ఒబీసీ సంక్షేమ సమితి అధ్యక్షులు జి.సుధాకర్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సుధాకర్ డిమాండ్ చేశారు. వారికి రిజర్వేషన్ కల్పించకపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చట్టసభల్లో బీసీల సంఖ్య తక్కువగా ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహిళ రిజర్వేషన్ల లో కూడా బీసీ మహిళలకు అవకాశం కల్పించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీంతో బీసీల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టమవుతున్నదని ఆయన విమర్శించారు. బీసీ మహిళలను విస్మరించిన బీజేపీ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అని చెప్పుకునే అర్హత కోల్పోయిందని విమర్శించారు. బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## నేటినుంచి ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్

- అందుబాటులో 10,762 సీట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం ఐసెట్ తుది కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

శనివారం ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల 24 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 28న సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఎంబీఏలో 9,945 సీట్లు, ఎంబీటీలో 83 సీట్లు, ఎంసీఏలో 729 సీట్లు, ఎంటీఎంలో ఐదు సీట్లు కలిపి మొత్తం 10,762 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు https://tsicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# కెనడాకు భారత్ షాక్..

(మొదటిపేజీ తరువాయి)

నిలిపేసింది. ఆపరేషనల్ కారణాల వల్ల వీసాలను సస్పెండ్ చేస్తున్నట్టు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. అయితే ఈ వార్తలపై విదేశాంగ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కెనడియన్ల వీసా దరఖాస్తులను ప్రాథమికంగా పరిశీలించేందుకు ఏర్పాటైన ప్రైవేటు ఏజెన్సీ మాత్రం తన వెబ్ సైట్ లో ఈ విషయాన్ని ప్రకటించింది. నిర్వహణ కారణాల వల్ల సెప్టెంబర్ 21 నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు భారత వీసాలను సస్పెండ్ చేస్తున్నట్టు పేర్కొంది. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ ని ఈ ఏడాది జూన్ నెలలో కెనడా సర్రే ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. అప్పటి నుంచి కెనడా, భారత్ పై గుర్రుగా ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ట్రూడో ప్రభుత్వం ఖలిస్తాన్ మద్దతుదారుల మద్దతుతో నడుస్తోంది. దీంతో ఓటు బ్యాంకు రాజకీయాలకు తలొగ్గిన ప్రభుత్వం భారత్ పై నిందలు వేస్తోంది. మరోవైపు బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలు కూడా ఈ విషయంలో భారత్ ని తప్పుపట్టాలని కెనడా కోరింది. అయితే వీరంతా భారత్ కి మద్దతు తెలుపుతున్నాయి. సరైన ఆధారాలతో ఆరోపణలు చేయాలని కోరాయి. మరోవైపు ఇరు దేశాలు కూడా తమ పౌరులకు ఎమర్జెన్సీ అడ్వైజరీ జారీ చేశాయి. జాగ్రత్తగా ఉండాలని సూచించాయి.

**అమెరికాలోని భారత కాన్సులేట్‌పై దాడి ఘటన**
**నిందితుల ఫొటోలు విడుదల**

న్యూఢిల్లీ: అమెరికా శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై గత మార్చిలో దాడి చేసిన ఖలిస్థానీ సానుభూతిపరులలో 10 మంది నిందితుల ఫొటోలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) గురువారం విడుదల చేసింది. దాడికి పాల్పడిన వారిపై అప్పట్లో 'చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యుఎపిఎ) సహా ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, ఎన్ఐఎ విచారణ ప్రారంభించింది. నిందితులను గుర్తించేందుకు సహకరించాలని, వారి గురించి ఏమైనా సమాచారం ఉంటే తమతో పంచుకోవాలని ప్రజలను కోరింది. ఈ క్రమంలోనే తాజాగా అక్కడి భారత దౌత్యకార్యాలయంపై దాడులకు పాల్పడినట్లు భావిస్తున్న నిందితుల ఫొటోలు విడుదల చేసింది. ఇదిలా ఉండగా.. శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై దాడి జరిగిన సమయంలోనే.. కెనడాలోని దౌత్య కార్యాలయం వద్ద కూడా ఖలిస్థానీ మద్దతుదారులు దుశ్చర్యలకు పాల్పడ్డారు. దీనిపై స్థానిక కెనడా హైకమిషనర్‌నుంచి భారత్ వివరణ కోరింది. తాజాగా ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

**కెనడాలో మరో ఖలిస్తానీ ఉగ్రవాది హత్య**

కెనడాలో మరో ఖలిస్తానీ ఉగ్రవాది సుఖా దున్‌కె హత్యకు గురయ్యాడు. విన్నిపెగ్‌లో బుధవారం ప్రత్యర్థి గ్యాంగ్ జరిపిన దాడిలో అతను మరణించినట్లు ఎన్ఐఎ వర్గాలు తెలిపాయి. తామే సుఖా దున్‌కెను హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ ముఠా ప్రకటించింది. దున్‌కె 2017లో నకిలీ పాస్‌పోర్ట్‌తో కెనడా పారిపోయినట్లు ఎన్ఐఎ తెలిపింది. గ్యాంగ్‌స్టర్ అర్షదీప్ దల్లా ముఠాలో దల్లాకు అత్యంత సన్నిహితుడని, ఖలిస్తానీ ఉద్యమంలోనూ సుఖా కీలకంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొంది. ఖలిస్తానీ టైగర్ ఫోర్స్ అధ్యక్షుడు హర్దీప్ సింగ్ నిజ్జర్ ఈ ఏడాది జూన్‌లో కెనడాలో హత్యకు గురయ్యాడు. అతని హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్లకు సంబంధం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో ఆరోపించిన సంగతి తెలిసిందే.

**కెనడా వేదికగా..ఖలిస్తానీ ఉగ్రసంస్థలతో పాక్ ఐఎస్ఐ రహస్య సమావేశం..**

ఒట్టావా(కెనడా): భారతదేశాన్ని చికాకు పెట్టేందుకు, అస్థిర పరిచేందుకు దాయాది దేశం పాకిస్తాన్ ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదలడం లేదు. తాజాగా ఇండియా-కెనడాల మధ్య తీవ్రస్థాయిలో దౌత్యవివాదం చెలరేగుతోంది. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆ దేశ పార్లమెంట్‌లో ప్రకటించడం వివాదాస్పదం అయింది. కెనడా, భారత సీనియర్ దౌత్యవేత్తను బహిష్కరించింది. ఇదే విధంగా భారత్ కూడా కెనడా దౌత్యవేత్తను దేశం వదిలి వెళ్లాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే తాజాగా పాకిస్తాన్ గూఢాచర సంస్థ 'ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)' కెనడా వేదికగా ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థలు, కీలక వ్యక్తులతో రహస్యంగా సమావేశమైనట్లు తెలుస్తోంది. కెనడాలోని వాంకోవర్ లో ఈ సమావేశం జరిగింది. భారతదేశానికి వ్యతిరేకంగా మరింత ప్రచారం చేసేలా ప్రోత్సహించినట్లు తెలుస్తోంది. ఖలిస్తానీ గ్రూపులకు ఎప్పటి నుంచో ఐఎస్ఐ ఫండింగ్ ఇస్తోంది. 5 రోజుల క్రితం జరిగిన ఈ సమావేశానికి సిక్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) చీఫ్, ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూతో సహా ఖలిస్తానీ సంస్థల అధినేతలు హాజరయ్యారని నిఘా వర్గాలు తెలిపాయి. 'ప్లాన్-కే' పేరుతో ఐఎస్ఐ ఖలిస్తాన్ ఉగ్రసంస్థలకు భారీగా నిధులను సమకూరుస్తోంది. భారత్ కి వ్యతిరేకంగా నిరసనలను నిర్వహించేలా ప్రజల్ని రెచ్చగొడుతోంది. భారత వ్యతిరేక ప్రచారానికి పోస్టర్లు, బ్యానర్లను వినియోగిస్తున్నారు. జూన్ నెలలో కెనడాలోని బ్రిటీష్ కొలంబియా సర్రే ప్రాంతంలో ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ ని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. అయితే ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని, దీనిపై కెనడా ఏజెన్సీలు విచారిస్తున్నాయని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. ఈ ఆరోపణలు రాజకీయ పూరితమైన అసంబద్ధ వ్యాఖ్యలుగా భారత్ కొట్టిపారేసింది. కెనడా ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందని భారత విదేశాంగ శాఖ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ప్రస్తుతం కెనడాలో 20 మంది ఖలిస్తానీ-గ్యాంగ్‌స్టర్లు తలదాచుకుంటున్నారని ఎన్ఐఏ ప్రకటించింది.

### ఖలిస్తానీ ఉగ్రవాది హత్యపై కెనడా ఎలాంటి ఆధారాలూ సమర్పించలేదు : భారత్

భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్న క్రమంలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యో దంతంలో ఎలాంటి ఆధారాలను కెనడా సమర్పించలేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గురువారం పేర్కొంది. నిజ్జర్‌ను కెనడా భూభాగంలో భారత్ హత్య చేసిందని కెనడా ప్రధాని ట్రూడో వ్యాఖ్యల అనంతరం ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమకు ఎలాంటి నిర్దిష్ట సమాచారం అందించినా పరిశీలించేందుకు సిద్ధమని చెప్పామని, ఇప్పటివరకూ కెనడా నుంచి నిర్దిష్ట సమాచారం, ఆధారాలు అందలేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందం బాగ్చి పేర్కొన్నారు. కెనడా భూభాగం నుంచి వ్యక్తుల నేర కార్యకలాపాలకు సంబంధించి తమవైపు నుంచి నిర్దిష్ట సమాచారాన్ని కెనడాతో పంచుకున్నామని చెప్పారు. ఈ సమాచారం ఆధారంగా కెనడా ఇప్పటివరకూ చర్యలు చేపట్టలేదని తెలిపారు. రాజకీయ కోణంలోనే కెనడా ఈ ఆరోపణలు చేసిందని బాగ్చి వ్యాఖ్యానించారు. హర్దీప్ నిజ్జర్ హత్య విషయంలో భారత్ ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ప్రధాని ఆరోపణల అనంతరం భారత్-కెనడాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇరు దేశాలు దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించగా, కెనడాలో వీసా సర్వీసులను భారత్ నిలిపివేసింది.



## జీవో 142 రద్దు చేయాలి

- రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసులు అందజేత : డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్, అసోసియేషన్స్ రాష్ట్ర కమిటీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వైద్యారోగ్యశాఖలోని జీవో 142 రద్దు చేయాలని డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్ అసోసియేషన్స్‌ల రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం కమిటీ నాయకులు ఆధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఇతర రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా జీవో 142 రద్దు పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ జీవో 142 వైద్యారోగ్యరంగానికే గొడ్డలిపెట్టులాంటిదని విమర్శించారు. మానవ వనరుల హేతుబద్ధీకరణ అనేది జనాభా ప్రాతిపదికన ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడం కోసం చేయాలని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సమాచారాన్ని,సలహాలు సూచనలు తీసుకోకుండా తమ ఇష్టానుసారంగా ఈ జీవోను విడుదల చేసిందని విమర్శించారు. ఈ జీవో రద్దయ్యేవరకు 142 జీవో రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన పోరాటాలు చేస్తామని తెలిపారు. అక్టోబర్ 5లోపు జీవో రద్దు కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో జీవో 142 రద్దు పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు కే.సాయిరెడ్డి, కె.యాదనాయక్, ఎన్ శ్యాంసుందర్, బి వెంకటేశ్వర్ రెడ్డి, రాబర్ట్ బ్రూస్, జి రాజశేఖర్, ఏ.అరుణ, ఆఫ్తాబ్ అహ్మద్ ఖాన్, జి.క్రిష్ణ, భూషణ్, గుండయ్య, విజయ భాస్కర్, చక్రధర్, శివానంద్, రామేశ్వరి, కవిత పాల్గొన్నారు.

## 'కావేరి'పై జోక్యానికి సుప్రీం నో

- ప్రతి 15 రోజులకు సీడబ్ల్యూఎంఏ, సీడబ్ల్యూఆర్‌సీల సమావేశం
- తమిళనాడు, కర్నాటకల జల వివాదంపై న్యాయస్థానం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో జోక్యానికి భారత అత్యున్నత న్యాయస్థానం నో చెప్పింది. కర్నాటక లేదా తమిళనాడుకు అనుకూలంగా జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. బదులుగా రెండు పొరుగు రాష్ట్రాలకు నీటి భాగస్వామ్యం విషయంలో కావేరీ నీటి నియంత్రణ కమిటీ (సీడబ్ల్యూఆర్‌సీ), కావేరీ నీటి నిర్వహణ అథారిటీ (సీడబ్ల్యూఎంఏ) ల మిశ్రమ నైపుణ్యంపై కోర్టు ఆధారపడింది. ఈ విషయంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కర్నాటక నుంచి తమిళనాడుకు రోజువారీ నీటి ప్రవాహాన్ని 5,000 క్యూసెక్కులుగా నిర్ణయించేటప్పుడు సీడబ్ల్యూఎంఏ, సీడబ్ల్యూఆర్‌సీ పరిశీలించిన కావేరీ బేసిన్‌లో నీటి కష్టాలతో సహా వివిధ అంశాలు అసంబద్ధమైనవని గవాయ్ చెప్పారు. రెండు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహాన్ని సమీక్షించేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి సీడబ్ల్యూఎంఏ, సీడబ్ల్యూఆర్‌సీ క్రమం తప్పకుండా సమావేశమవుతున్నాయని కోర్టు పేర్కొన్నది. తమిళనాడు రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, జి. ఉమాపతి వాదనలు వినిపించగా, కర్నాటక నుంచి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ హాజరయ్యారు.

## ఫాబ్రిక్, డిజైన్‌పై ఫిర్యాదులు

- పార్లమెంట్ భద్రతా సిబ్బంది కొత్త యూనిఫాంపై వెనక్కి : ప్రభుత్వం ఉత్తర్వు జారీ

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ భద్రతా సిబ్బంది కోసం ప్రవేశపెట్టిన కొత్త యూనిఫామ్‌ను ప్రభుత్వం ఉప సంహరించుకున్నది. కొత్త యూనిఫాంను సిబ్బంది ధరించడం ప్రారంభించిన ఒక రోజు తర్వాత బుధవారం నాడు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఉత్తర్వును జారీ చేసింది. యూనిఫాం కోసం ఉపయోగించిన బట్ట, కొత్త దుస్తుల రూపకల్పన కారణంగా తమకు చెమటలు పట్టాయని భద్రతా సిబ్బంది నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయి. 500 మంది పార్లమెంటు భద్రతా సిబ్బంది తమ సాధారణ నేవీ బ్లూ సఫారీ సూట్‌లతో బుధవారం విధులకు వచ్చారు. యూనిఫామ్‌ను ఉపసంహరించుకోవడానికి ఎలాంటి అధికారిక కారణం చెప్పనప్పటికీ, చాలా మంది సిబ్బంది కొత్త దుస్తులను ధరించడానికి నిరాకరించారనీ, దాని డిజైన్, ఫ్యాబ్రిక్‌తో తయారు చేయబడిన వాటిని ధరించడానికి విముఖత వ్యక్తం చేశారని సమాచారం. పార్లమెంట్‌ను కొత్త భవనానికి మార్చడంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం కొత్త యూనిఫామ్‌లను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వు ప్రకారం.. " భద్రతా సిబ్బంది కొత్త యూనిఫాం మాత్రమే ఉపసంహరించబడింది.

## ఫార్మసిస్టుల కౌన్సిలింగ్ షురూ...

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

వైద్యారోగ్య శాఖలో 310 ఫార్మసిస్టు పోస్టులకు కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో 105 పోస్టులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని 135 పోస్టులకు, డీఎంఈ పరిధిలోని 70 పోస్టులకు శుక్రవారం కౌన్సిలింగ్ జరుగనుంది. వీరికి త్వరలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 369 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి 2018 జనవరి 25న టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో డీపీహెచ్ పరిధిలో 125, డీఎంఈ 96, టీవీవీపీలో 148 పోస్టులు ఉన్నాయి. అయితే కోర్టు కేసుల కారణంగా ఫలితాల వెల్లడి ఆలస్యమైంది. ఇందులో 310 పోస్టుల భర్తీకి న్యాయస్థానం తాజాగా అనుమతిచ్చింది. దీంతో టీఎస్‌పీఎస్సీ ఈ నెల 12వ తేదీన 310 పోస్టులకు ఎంపిక కాబడిన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఇందులో డీపీహెచ్ పరిధిలో 105, డీఎంఈ పరిధిలో 70, టీవీవీపీ పరిధిలో 135 పోస్టులు ఉన్నాయి. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుంది. ఫార్మసిస్టులుగా నియమితులవుతున్న వారికి మంత్రి హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ మార్గ నిర్దేశనలో వైద్యారోగ్య రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని,మంచి సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని మంత్రి సూచించారు.

## ఎస్సీ, ఎస్టీల కోటా కొనసాగింపు అవసరమే

- సుప్రీంకు కేంద్రం నివేదన

**న్యూఢిల్లీ :** చట్టసభలలో ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం కల్పిస్తున్న రిజర్వేషన్లను విధిగా కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. రాజ్యాంగంలోని 104వ సవరణ చట్టం చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించనున్న ధర్మాసనం ఎదుట సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ వ్యాఖ్య చేశారు. 2019లో చేసిన ఈ సవరణ చట్టం ద్వారా చట్టసభలలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను పది సంవత్సరాలు పొడిగించారు. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. ఈ పిటిషన్లపై నవంబర్ 21న విచారణ ప్రారంభమవుతుంది.

ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో-ఇండియన్లకు తొలుత రాజ్యాంగంలోని ఆర్టికల్ 334 కింద రిజర్వేషన్లు కల్పించారు. పది సంవత్సరాల తర్వాత అంటే 1960లో ఆ కోటా కాలపరిమితి ముగియాల్సి ఉంది. అయితే అప్పటి నుండి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి రిజర్వేషన్లను పెంచుతూ రాజ్యాంగాన్ని సవరిస్తున్నారు. 104వ సవరణ చట్టం 2019లో ఆమోదం పొందింది. అయితే అప్పుడు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పది సంవత్సరాలు పొడిగించినప్పటికీ ఆంగ్లో-ఇండియన్ల రిజర్వేషన్లను పొడిగించలేదు. కాగా 2019లో ఇచ్చిన పొడిగింపును మాత్రమే పరిశీలిస్తానని, అంతకుముందు చేసిన సవరణలను పరిగణనలోకి తీసుకోబోనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# విద్యారంగ సమస్యలను ఎన్నికల ఎజెండాలో చేర్చాలి

### రాజకీయ పార్టీలకు తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ విజ్ఞప్తి

- విద్యపట్ల ఆసక్తి చూపని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు :రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు విద్యారంగ సమస్యలను తమ ఎన్నికల ఎజెండాలో చేర్చాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మినారాయణ అధ్యక్షతన హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.



రాష్ట్రంలో 2014-15 బడ్జెట్ లో 10.89 శాతం కేటాయిస్తే 2023-24లో 6.57 శాతానికి తగ్గించారని ఆ సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. మన ఊరు-మన బడి పథకం కోసం కేటాయించామన్న రూ.7,298 కోట్లలో రూ.440 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించింది. దేశంలో 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్రం 35వ స్థానానికి దిగజారిందని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాల్లో 18 నుంచి 24 ఏండ్ల వయస్సు కలిగిన వారిలో యువతీ, యువకులు 70 శాతముండగా, మన దేశంలో కేవలం 27 శాతం మందే ఉన్నారని తెలిపింది. దీన్ని కనీసం 50 శాతానికి పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఇందుకోసం ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను, కాలేజీలను ప్రోత్సహించాలని సూచించింది. ప్రయివేటు, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతించవద్దని కోరింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టడంతో పాటు పలు డిమాండ్లను రాజకీయ పార్టీల ముందుకు తెచ్చింది.

**సంపన్న దేశంలో చదువుకు ఇన్ని ఇబ్బందులా?**

భారతదేశం సంపన్న దేశంగా అవతరించిందని ప్రచారం చేసుకుంటున్న బీజేపీ చదువుల కష్టాలను మాత్రం తీర్చడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ప్రజలకు మేలు చేసే దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవ తరగతి చదివిన వారిలో 10 శాతం మంది సరిగ్గా ఇంగ్లీషు, తెలుగు రాయగలిగితే మహా ఎక్కువ అన్నట్టుగా పరిస్థితి తయారందని తెలిపారు. పిల్లల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయన్నారు. ఉచిత విద్యను తప్పనిసరి చేయాలని సూచించారు.

టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు, అక్షరాస్యత కొలమానాల్లో రాష్ట్రం అత్యంత వెనుకబడిందని తెలిపారు. సమాజాన్ని కాపాడటానికి విద్యారంగ సమస్యలను పరిష్కరించి బలోపేతం చేయాలని కోరారు. ఆ దిశగా విద్యాపరిరక్షణ కమిటీ చేస్తున్న ప్రయత్నంలో అండగా ఉంటామని తెలిపారు.

రాష్ట్రంలో టెక్నికల్ కౌన్సిల్ ఏర్పాటు, నియోజకవర్గానికి ఒక పాలిటెక్నిక్, మండలానికి ఒక ఐటీఐని ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. విద్యా పరిరక్షణకమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ సామాజిక మార్పుకు, నిర్మాణానికి విద్య అవసరమని తెలిపారు.

విద్యారంగం బలోపేతం అంశాన్ని ప్రజా ఉద్యమంగా మలచనున్నట్టు చెప్పారు. సమావేశంలో వేములపల్లి వెంకట్రామయ్య (సీపీఐ - ఎంఎల్ న్యూడెమోక్రసీ), కె.గోవర్ధన్ (సీపీఐ -ఎంఎల్ న్యూడెమోక్రసీ), ఎం.హన్మేష్ (ప్రజాపంథా పార్టీ) పాల్గొని విద్యాపరిరక్షణ కమిటీ డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో కమిటీ ఉద్యమ భాగస్వామ్య సంఘాల నుంచి అశోక్, నాగిరెడ్డి (టీపీటీఎఫ్), సోమయ్య (డీటీఎఫ్), కె.ఎస్.ప్రదీప్ (పీవైఎల్), పి.రామక్రిష్ణ, ఎస్.నాగేశ్వరరావు (పీడీఎస్ యూ), పి.మహేశ్, పరశురాం (పీడీఎస్ యూ) తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ఆర్టీసీ కార్మికుల సమస్యలపై స్పష్టతివ్వండి

### 26న మహాధర్నాకు కదలండి : టీఎస్ఆర్టీసీ జాక్ పిలుపు

- మహాధర్నా గోడపత్రిక ఆవిష్కరణ

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

టీఎస్ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొంది.. చట్ట రూపం దాల్చి 40 రోజులు గడుస్తున్నప్పటికీ పరిష్కరించాల్సిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వడం లేదని టీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. సత్వరమే ప్రభుత్వం ఈ అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న డిమాండ్స్ డే నిర్వహించినా సర్కారు నుంచి స్పందన లేకపోవడం తో 26న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఉంటే డ్యూటీలో- లేకపోతే మహాధర్నాలో ఉండాలని కార్మికులకు టీఎస్ ఆర్టీసీ జాక్ పిలుపునిచ్చింది. గురువారం వీఎస్టీ చౌరస్తాలోని ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీసులో జేఏసీ చైర్మెన్, ఈయూ ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి, జేఏసీ కన్వీనర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, జాక్ నాయకులు జక్రయ్య(ఈయూ), గంగాధర్(ఎస్‌డబ్ల్యూఎఫ్) కిషన్ గౌడ్, యూసఫ్ రెడ్డి, మల్లేష్, జంగయ్యతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం కె.రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన 2017, 2021 పేస్కేల్స్‌పై ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. 2017 నాటి డీఏ 31.1 శాతమని మెర్జ్ చేసి 30శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, 2021 పే స్కేలుపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రివైజ్డ్ పే స్కేలు 2013 అరియర్స్‌లో సగం డబ్బుల కోసం ఇచ్చిన బాండ్స్‌పై రావాల్సిన డబ్బులను నేటి వరకు 8.75శాతం వడ్డీతో లెక్కించి చెల్లించాలన్నారు. విలీనం చేస్తున్నామనే పేరుతో సమస్యలు పరిష్కరించకుంటే ప్రస్తుతం ఉన్న 43వేల మంది కుటుంబాలతో పాటు 2017 నుంచి రిటైరైన, చనిపోయిన కార్మిక కుటుంబాలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని చెప్పారు. ఆ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రిటైరైన వారికి బకాయిలు చెల్లించడం లేదని, ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, అందుకు యాజమాన్యం, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.



వి.ఎస్.రావు మాట్లాడుతూ.. 2023 జులై డీఏను వెంటనే అమలు చేయాలని, మొత్తం తొమ్మిది డీఏల అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. డీఏలు సకాలంలో అమలు చేయనందున 2021 నుంచి రిటైరైన వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాజాగా సంబంధిత శాఖ మంత్రి.. ప్రభుత్వం నియమించిన కమిటీపై నోటిఫికేషన్ ఇస్తామని, నెలలోపే మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తామని చేసిన వ్యాఖ్యలు అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. విలీనం విధి విధానాలు నిర్ణయం ఆదరాబాదరగా చేసేది కాదని, కార్మికులకు సంబంధించి 80అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని, అందుకని రిజిస్టర్డ్ కార్మిక సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలని అన్ని కార్మిక సంఘాలు కోరుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విలీనం కంటే ముందే పరిష్కరించాల్సిన సమస్యలపై స్పష్టతనివ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ ఆర్టీసీ యూనియన్ల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అనంతరం కార్మికులకు జరిగిన, జరుగుతున్న నష్టం ఇక్కడ జరగకుండా చూడాలని కోరారు.



## ఢిల్లీలో ఓబీసీ రిజర్వేషన్లపై భారతీయ ఓబీసీ సమాఖ్య వినతి

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నాడిక్కడ వివిధ పార్టీల ప్రతినిధులను కలిసి ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, చట్టసభలలో 27 శాతం రిజర్వేషన్లపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధికారత సామాజిక న్యాయశాఖ కేంద్రమంత్రి రాందాస్ అత్వాలేను ఓబీసీ సమస్యలపై మద్దతు కోరారు. స్పందించిన మంత్రి పార్లమెంట్లో ఓబీసీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం భారతీయ ఓబీసీ సమాఖ్య పోస్టర్ ఆవిష్కరించిన కేంద్రమంత్రి భారతీయ ఓబీసీ సమాఖ్య నిర్వహించే కార్యక్రమాలకు రిపబ్లిక్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, బీసీ జాతీయ కమిషన్ చైర్మెన్ హన్స్ రాజ్ గంగారామ్ అహిర్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు తారిఫ్ అన్వర్, ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ ఇంచార్జ్ మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో ఓబిసి నేతలు భేటీ అయ్యారు.

## బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాల్సిందే

### అప్పుడే సామాజిక న్యాయం సాధ్యం : ఎంపీ ఆర్.కష్ణయ్య

- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని జంతర్‌మంతర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాధర్నా

**నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో**

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే సామాజిక న్యాయం లభిస్తుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్ కష్ణయ్య అన్నారు. లేకపోతే సమాజంలో మార్పును తీసుకురాలేమన్నారు. బీసీ డిమాండ్ల పరిష్కారానికై గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కీలక నాయకులు గుజ్జ కష్ణ, డాక్టర్ ఎన్ మారేష్‌ల అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో ఎంపీ ఆర్.కష్ణయ్యతో పాటు ఎంపీలు బీద మస్తాన్ రావు, బడుగుల లింగయ్య యాదవ్‌లు పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కష్ణయ్య మాట్లాడుతూ.. మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం, దేశంలో 56 శాతం జనాభా గల బీసీల బతుకులు మార్చే బీసీ బిల్లును పార్లమెంట్‌లో పెట్టరా..? అని ప్రశ్నించారు. అలాగే కేంద్రం బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 52 శాతానికి పెంచాలని కోరారు. బీసీలు సుదీర్ఘ కాలంగా చేస్తోన్న డిమాండ్లను కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

మహిళ బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్ధకత ఉండద న్నారు. మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్యా, ఉద్యోగాలలోనూ 50 శాతం రిజర్వేషన్లను ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీలను బిచ్చగాళ్ళను చేశారని.. వారికి రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా గొర్రెలు, బర్రెలు, పందులు, పెన్షన్లు ఇచ్చి బీసీలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎంపీ బీద మస్తాన్ రావు విమర్శించారు. మండల్ కమిషన్ 40 సిఫార్సులు చేస్తే కేవలం రెండు సిఫార్సులు మాత్రమే కేంద్రం అమలు చేసిందని బీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ప్రపంచదేశాల నుండి తెచ్చే అప్పులకు బీసీలను బాధ్యులను చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ దేశ సంపదలో, అధికారంలో వాటా ఇవ్వరా? ఇదేమి ఆటవిక న్యాయం? అని ఫైర్ అయ్యారు.

## ఓబీసీ కోటా ప్రస్తావనే లేని రాజ్యాంగం

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ కోటా కోసం కొన్ని పార్టీలు పట్టుబడుతున్నప్పటికీ లోక్‌సభలో కానీ, రాష్ట్రాల శాసనసభలలో కానీ ఇతర వెనుకబడిన తరగతుల వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించే నిబంధన ఏదీ రాజ్యాంగంలో లేదు. అయితే ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7.5% రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగం అనుమతించింది. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ హయాంలో 1996 సెప్టెంబర్‌లో గీతా ముఖర్జీ నేతృత్వంలోని సంయుక్త పార్లమెంటరీ కమిటీ తన నివేదికను సభ ముందు ఉంచింది. ఓబీసీ కోటాను అనుమతిస్తూ రాజ్యాంగ సవరణ తీసుకొస్తే వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు రిజర్వేషన్లు కల్పించవచ్చునని ఈ కమిటీ సిఫారసు చేసింది. రాజ్యసభలోనూ, రాష్ట్రాల శాసనమండళ్లలోనూ మహిళలకు రిజర్వేషన్లను రాజ్యాంగం అనుమతించకపోయినప్పటికీ వాటిని ఇవ్వవచ్చని కూడా సిఫారసు చేసింది. అయితే తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వమూ ఓబీసీ రిజర్వేషన్లను పట్టించుకోలేదు. 1997లో 11వ లోక్‌సభ రద్దు కావడంతో మహిళా కోటా బిల్లుకు కాలదోషం పట్టింది. 2010 మార్చి 9న రాజ్యసభ దీనిని ఆమోదించినప్పటికీ అప్పటి యూపీఏ ప్రభుత్వం ఓబీసీ కోటా ఇవ్వలేదు. అందుకే యూపీఏ భాగస్వామ్య పక్షాలైన సమాజ్‌వాదీ, ఆర్జేడీ పార్టీలు బిల్లును వ్యతిరేకించాయి. 2010లో బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలపగా అదే సంవత్సరం మార్చి 12న లోక్‌సభకు వెళ్లింది. దీంతో అది లోక్‌సభ ఆస్తిగా మారింది. 15వ లోక్‌సభ 2014 మేలో రద్దు కావడంతో బిల్లుకు కాలదోషం పట్టింది.

## ఉత్తమ్‌పై పోటీ

### 500 మంది మాలలను బరిలో నిలుపుతాం: జీ. చెన్నయ్య

- ఎస్సీ వర్గీకరణ కు వ్యతిరేకంగా రెండో రోజు జంతర్ మంతర్‌లో మాలమహానాడు ధర్నా

**నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో**

ఎస్సీ వర్గీకరణ ఆందోళనకు మద్దతు తెలపడాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జీ. చెన్నయ్య తీవ్రంగా ఖండించారు. ఇందుకు నిరసనగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తమ్ కు వ్యతిరేకంగా 500 మంది మాలలను బరిలో నిలిపి ఓడిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ లో మాలమహానాడు ఆధ్వర్యంలో రెండో రోజు ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, తెలంగాణ అధ్యక్షుడు శ్రీధర్, ఏపీ అధ్యక్షుడు బిళ్ళా చెన్నయ్య ఇతర మాల మహానాడు నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకిస్తూ తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ విగ్రహానికి చెన్నయ్య మెమోరాండం ఇచ్చారు.

ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... వర్గీకరణకు ఏ పార్టీ అనుకూలంగా వ్యవహరించిన మాలల ఆగ్రహాన్ని రుచి చూస్తాయని హెచ్చరించారు. గతంలో మంద కష్ణతో కలిసి వర్గీకరణ కు అనుకూలంగా నిర్ణయం తీసుకున్న చంద్రబాబు ను, టీడీపీ ని భూ స్థాపితం చేసామన్నారు. రానున్న రోజుల్లో ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రాజకీయ పార్టీల మద్దతు కూడగడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా త్వరలోనే బీఎస్పీ అధినేత్రి మాయావతిని కలవబోతున్నట్లు వెల్లడించారు.

# రష్యాతో ప్రత్యక్షంగా తలపడే ధోరణి

### యూఎన్‌లో బైడెన్ ప్రసంగం

నెల్లూరు నరసింహారావు

ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ 78వ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మంగళవారం ప్రసంగించాడు. ఒక దేశం మరొక దేశంపైన యుద్ధాన్ని ప్రకటించేముందు చేసిన ప్రసంగంలా బైడెన్ ప్రసంగం సాగింది. అమెరికా ప్రపంచ వ్యాప్తంగా వున్న తన మిత్ర దేశాలతోను, భాగస్వాములతోను కలిసి తమ సార్వభౌమాధికారాన్ని, భౌగోళిక సమగ్రతను కాపాడు కునేందుకు పోరాడుతున్న సాహసులైన ఉక్రెయిన్ ప్రజలకు మద్దతు ఇస్తుం దని ఐక్యరాజ్య సమితిలో బైడెన్ ప్రకటించాడు. ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధానికి రష్యా మాత్రమే బాధ్యత వహించవలసి ఉంటుందని, ఈ యుద్ధాన్ని తక్షణమే ఆపగలిగే శక్తి రష్యాకు మాత్రమే ఉందని ఆయన అన్నాడు. శాంతికి అడ్డంకిగా రష్యా మాత్రమే ఉందని, శాంతిని నెలకొల్పాలంటే ఉక్రెయిన్ లొంగిపోవటం, ఉక్రెయిన్ భూభాగం రష్యాకు కావాలని బైడెన్ తన ప్రసంగంలో పేర్కొన్నాడు.

ఇది ఒక సాధారణ ప్రసంగం కాదు. యుద్ధాన్ని చర్చల ద్వారా పరిష్కరించటానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా రష్యాపైన ఎడతెగకుండా కొనసాగిన దాడిగా బైడెన్ ప్రసంగం సాగింది. షరతులు లేకుండా రష్యా లొంగిపోవాలని, రష్యన్ ప్రభుత్వం కూలిపోవాలని, రష్యా భౌగోళికంగా ముక్కముక్కలు కావాలని అమెరికన్ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. ఈ లక్ష్యం నెరవేరాలంటే అమెరికా ప్రత్యక్షంగా రష్యాతో తలపడాలి. ఉక్రెయిన్ లో వెనకవుండి నడిపిస్తున్న యుద్ధాన్ని అమెరికా, రష్యాల మధ్య ప్రత్యక్ష యుద్ధంగా మార్చాలి. ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధం ఇప్పటికే అది అమెరికా యుద్ధంగా మారింది. అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్ కు ఆయుధాలనే కాకుండా యుద్ధ నిపుణులను,గూఢచార సమాచారాన్ని, అన్నిరకాల రవాణాను అందిస్తున్నాయి. అయితే ఉక్రెయిన్ చేస్తున్న ప్రతిదాడి ఘోరంగా విఫలమైన నేపథ్యంలో తమ లక్ష్యాలు నెరవేరాలంటే అమెరికా, నాటో దేశాల సైన్యాలు రష్యాతో



పూర్తి స్థాయి యుద్ధం చేయటంతప్ప మరో మార్గంలేదనే నిర్ధారణకు బైడెన్ ప్రభుత్వం వచ్చింది.

మరోవైపు అమెరికాలో ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారుతుందని, నూతనంగా ఏర్పడే ప్రభుత్వ విధానంలో మార్పు ఉంటుందని రష్యా అధ్యక్షుడు వ్లాడిమీర్ పుతిన్ ఆశిస్తున్నాడని అమెరికన్ మీడియా అంచనావేస్తోంది. ఇదొక భ్రమ మాత్రమే. అటువంటిది జరగకుండా 2024లో అమెరికాలో జరగనున్న ఎన్నికలకు ముందే బైడెన్ రష్యాతో వెనక్కుతగ్గే వీలులేని స్థాయిలో సాయుధ ఘర్షణకు దిగాలనే ఆలోచనతో ఉన్నాడు. బైడెన్ ఆలోచనకు తగ్గట్టుగానే అణుయుద్ధమైనా తాను వెనకాడబోననే తరహా ప్రకటనలను విడుదల చేస్తున్నఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడీమీర్ జెనెస్కీ బైడెన్ వైఖరిని ప్రతిబింబిస్తున్నాడు.

అమెరికా, నాటో కూటమి దేశాలు ఉక్రెయిన్ లో ఇప్పటికే రష్యాపైన అప్రకటిత యుద్ధం చేస్తున్నాయి. అన్ని రకాల ఆయుధాలను, గూఢచార సమాచారాన్ని, సైనిక నైపుణ్యాలను అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి అందిస్తోంది. ఉక్రెయిన్ కేవలం సైన్యాన్ని మాత్రమే ఉపయోగిస్తోంది. ఇక మిగిలింది అమెరికా సైన్యం రష్యాతో ప్రత్యక్షంగా తలపడటమే. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఇంత లెక్కలేకుండా తీవ్రతరం చేయటం వెనుక అమెరికాను కుదిపివేస్తున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సంక్షోభం ఉంది. అమెరికన్ ద్రవ్యపెట్టుబడికి ప్రభుత్వం అప్పుచేసి అందించే ఉద్దీపనలపైన ఆధారపడక తప్పటంలేదు. దీనికి తోడు "డాలర్ ఆధిపత్యానికి" బీటలువారటంవల్ల పరిస్థితి మరింతగా క్షీణించింది. అలాగే అమెరికాలో కార్మికుల సమ్మెలు బాగా పెరిగాయి. దేశంలో ప్రతిపక్ష కార్యకలాపాలు ఎక్కువ అవటంకూడా అమెరికా యుద్ధ ప్రణాళికను మరింతగా ముందుకు తేవటానికి కారణంగా ఉంది.

ఏకధ్రువ ప్రపంచం అంతమై నిరంతరం మారుతున్న బహుళధ్రువ ప్రపంచంలో అమెరికా, పశ్చిమ ఐరోపా పలుకుబడి రోజురోజుకూ అడుగంటుతోంది. మరోవిధంగా చెప్పాలంటే అమెరికా సామ్రాజ్యం పతనం అవుతోంది. చరిత్రలో సామ్రాజ్యాలు ఆవిర్భవిస్తున్నప్పుడు, పతనమౌతున్నప్పుడు ప్రమాదకరంగా మారటాన్ని గమనించవచ్చు. వర్తమానంలో పతనావస్థలోవున్న అమెరికన్ సామ్రాజ్యానికి చైనా, రష్యాల అభివృద్ధిని ఆపాలంటే మానవాళి అస్థిత్వానికే ముప్పుగా పరిణమించే అణుయుద్ధం చేయటమో లేక మారిన వాస్తవ పరిస్థితికి సర్దుకుపోవటమోతప్ప మరోమార్గం లేదు.

## ఘనంగా అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలు




**నవతెలంగాణ - మీర్ పేట్**

మీర్ పేట్ నారాయణ ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్లో అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ పాఠశాల ఏజీఎం రవీంద్ర బాబు మాట్లాడుతూ విద్యార్థులు శాంతి, అహింస, సహనం ఉన్నపుడే ఏమైనా సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బాబ్జి, డీన్ రాజేంద్రప్రసాద్, ఏవో మాధవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలి



**నవతెలంగాణ - తుర్కయంజాల్**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కురుమ సంఘం నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు వస్పరి బాబయ్య, ప్రధాన కార్యదర్శి గుండా నర్సింహ, నాయకులు గుండా ధన్‌రాజ్, కొత్తకుర్మ కుమార్, బొడ్డు శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే ఇండ్ల పంపిణీ




- తిమ్మాయిగూడలో లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**నవతెలంగాణ - సిటీబ్యూరో**

అవినీతి, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ పద్ధతిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ జరుగుతుందని మేయర్ విజయలక్ష్మి అన్నారు. రెండో విడత డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో భాగంగా గురువారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తిమ్మాయిడలో నిర్మించిన 864 డబుల్ బెడ్ రూం ఇండ్లలో 500 ఇండ్లను యాకత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన లబ్దిదారులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తో కలిసి మేయర్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదవాళ్లు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో కేసీఆర్ సకల సౌకర్యాలతో నిర్మించిన ఇండ్లను ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. ఈ విడతలో డబుల్ బెడ్ రూం ఇల్లు రాని వారు నిరాశ చెందవద్దని, వారికి రాబోయే రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమలు, భవన నిర్మాణ రంగాల్లో హైదరాబాద్ నగరం పురోగతిలో ఉన్నదని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లతో పాటు గృహలక్ష్మి పథకం ద్వారా సొంతిల్లు లేని వారికి ప్రభుత్వం రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించనున్నదని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ రోజుల్లో ఇల్లు కట్టడం, పెండ్లి చేయడం పేదవాడికి ఆర్థిక భారంతో కూడుకుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచితంగా సకల సౌకర్యాలతో ఇండ్లను నిర్మించి ఇస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనా బేగం, ఎం.పి.పి బుర్ర రేఖ మహేందర్ గౌడ్, జెడ్.పి.టి.సి బింగి దేవదాసు గౌడ్, వై.ఎస్ ఎం.పి.పి కొలను శ్రీధర్ రెడ్డి, ఎం.పి.టి.సి బీమగొని భాస్కర్ గౌడ్, కుత్బుల్లాపూర్ గ్రామ సర్పంచ్ స్వరూప వీరస్వామి యాదవ్, ఉప సర్పంచ్ దేవుని మంగ, వార్డు మెంబర్లు పైట్ల నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలి



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**నవతెలంగాణ - బడంగ్ పేట్**

సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా ఉండాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కురుమలగూడలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గురువారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయన్నారు. మంచి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి..సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చలన్నారు. తర్వాత పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ అనునిత్యం ప్రజల మధ్యలో ఉండే సబితమ్మను మళ్ళీ గెలిపించుకొని, నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సీఎం సహాయ నిధి పథకం పేద ప్రజలకు ఓ వరం అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ జల్‌పల్లి గ్రామానికి చెందిన జీ.పాండు తండ్రి కుమరయ్యకు సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం ఆ చెక్కును మంత్రి లబ్దిదారుడికి అందజేశారు.

## వైశ్య గర్జనకు మంత్రి జగదీష్ రెడ్డికి ఆహ్వానం



**నవతెలంగాణ - చైతన్యపురి**

సరూర్ నగర్ స్టేడియంలో అక్టోబర్ 1న నిర్వహించనున్న వైశ్య గర్జనకు అతిథిగా రావాలని కోరుతూ విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డికి గురువారం వైశ్య వికాస వేదిక చైర్మన్, ఎల్బీనగర్ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కాచం సత్యనారాయణ గుప్త ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో లక్ష మందితో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ఈ సభ జరుగుతుందన్నారు. కాచం వెంట ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షులు ప్రేమ్ గాంధీ, వైశ్య వికాస వేదిక సభ్యులు నంగనూరి రమేష్, బుక్క ఈశ్వరయ్యా, కోడుమూరి దేవేందర్, వంగవీటి శ్రీనివాస్, వీరు దివ్వెల తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇండ్లు ఎంఐఎంకు ధారాదత్తం



**నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్**

సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇండ్లను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వకుండా ఎంఐఎంకు దారదత్తం చేశారని మాజీ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ నాయకులు బూర నర్సయ్య గౌడ్ గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్‌పేట మున్సిపల్ పరిధిలో తట్టిఅన్నారం, హత్తిగూడ తిమ్మాయిగూడ తదితర ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ ఇండ్లను స్థానికులకు ఇవ్వకుండా.. మలక్‌పేట, యాకుత్ పుర, చార్మినార్, చాంద్రాయణగుట్ట ప్రాంతాలకు చెందిన వారికి ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. స్థానికులకు 300 ఇండ్లు ఇచ్చి.. ఇతర ప్రాంతాలకు చెందిన వారికి 2000 ఇండ్లు ఇవ్వడం దారుణమన్నారు. కేవలం ఎంఐఎం ఇచ్చిన లిస్ట్ ప్రకారమే డబుల్ ఇండ్లు ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



- సినీ హీరో కార్తికేయ

**నవతెలంగాణ - హస్తినాపురం**

విద్యార్థులు బాల్యం నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని, వాటిని సాధించేందుకు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని సినీ హీరో కార్తికేయ గుమ్మకొండ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని శ్రీ కీర్తన అనాథాశ్రమంలో గురువారం కార్తికేయ తన పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే జీవితంలో విజయం సాధించగలమని అన్నారు. ఈ వేడుకలలో నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ జి రజనీ విఠల్ రెడ్డి, లోహిత కార్తికేయ, ఆశ్రమ నిర్వాహకులు అనిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 'వినియోగదారుల చెంతకే డీజిల్ సరఫరా'



**నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్**

వినియోగదారుల చెంతకే డీజిల్‌ను సరఫరా చేసేందుకు హైదరాబాద్ స్టార్టప్ కంపెనీ అయిన ఎనీ టైం డీజిల్ సంస్థ నూతన పద్ధతికి శ్రీకారం చుట్టింది. అందుకు గాను దేశంలోనే అతిపెద్ద డీజిల్ కంపెనీ అయిన రిలయన్స్ జియో బీపీతో ఒప్పందం కుదుర్చుకుని, రెండు సంస్థల సంయుక్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో డీజిల్ సరఫరా సేవలను ప్రారంభించాయి. నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం విజయవాడ జాతీయ రహదారికి పక్కన ఉన్న జియో బీపీ పెట్రోల్ బంకులో ఎనీ టైం డీజిల్ సదుపాయ సేవలను గురువారం ప్రారంభించారు. తర్వాత జియో బీపీ టీం సౌత్ రీజినల్ సేల్స్ మేనేజర్ నితిన్ ఘోర్పడే, ఆంధ్రా, తెలంగాణ హెడ్ శ్రీపాథ్, సీనియర్ మేనేజర్లు జితేందర్‌రెడ్డి, కార్తీక్ కుమార్‌లు..ఎనీ టైం డీజల్ ఫౌండర్, సీఈఓ కె. రాహుల్‌రెడ్డి, డైరెక్టర్ ప్రశాంత్‌రెడ్డిలతో కలిసి డీజిల్ ట్యాంకర్లను ప్రారంభించి, ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ డీజిల్ కన్నా జియో బీపీ డీజిల్ 4.3 శాతం మేలు జరగనుందని, దీని వలన వినియోగదారులకు మన్నికైన డీజిల్‌తో పాటు వాహనాలు అధిక మైలేజీని ఇచ్చే అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జియో బీపీ, ఎనీ టైం డీజిల్ సంస్థల ప్రతినిధులు, టీం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ తాగునీళ్లు ఇవ్వాలి

### డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**నవతెలంగాణ - మీర్ పేట్**

ప్రతి ఇంటికీ ప్రతి రోజూ తాగునీళ్లు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వాణికి గురువారం వినతి పత్రం అందజేశారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ పేరుకే మున్సిపల్ కార్పొరేషన్ కానీ కార్పొరేషన్‌లో ఉండాల్సిన సౌకర్యాలు ఒక్కటి కూడా కల్పించడం లేదని ఆరోపించారు. తాగునీరు 4, 5 రోజులకు ఒకసారి కూడా సరిగ్గా రావడం లేదని, దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకునే నాథుడే లేడు కానీ...పన్నులు మాత్రం ఎక్కడా లేని విధంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇంకా తాగునీరు వచ్చిన రోజు నీళ్లలో



పురుగులు వస్తున్నాయని, డ్రైనేజీ తదితర సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు సామిడి గోపాల్ రెడ్డి, నాయకులు దేవగొని కృష్ణ, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, పద్మ శ్రీ, సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్‌లో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం




**నవతెలంగాణ - ఎల్బీనగర్**

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ రింగ్ రోడ్డు ఆవరణలో గురువారం సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడీ కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే..కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగిన ముట్టడిని విచ్ఛిన్నం చేయడం కోసం సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ఎన్ని విధాలుగా వేధించినా ఆగకుండా ముట్టడిని జయప్రదం చేయడంతో సహించని కేసీఆర్ ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించిందిన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లినా సమస్యలను పరిష్కరించకపోవడంతోనే విధిలేని పరిస్థితిలో సమ్మెకు వెళ్లడం జరిగిందన్నారు. సమస్యలను పరిష్కారం చేయకపోగా అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసు యంత్రాంగం లాఠీ, బూట్లతో తొక్కి చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా వాటన్నింటినీ సహించి.. సాయంత్రం నాలుగు గంటల వరకు సమ్మె కొనసాగించారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తన నియంతృత్వ పోకడలను విరమించి..అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసర నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆలేటి ఎల్లయ్య, ఎం వీరయ్య, వృత్తిదారుల నాయకుడు సిహెచ్ వెంకన్న, కేవీపీఎస్ నాయకులు భీమనపల్లి కనకయ్య, వృత్తిదారుల సంఘం నాయకులు చెన్నారం మల్లేశం, ప్రజా నాట్యమండలి నాయకుడు గోపి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ సుకన్య కుమారి, గంగా, సరళ, రేణుక, గౌరీ, నీలమని, రబియా, సత్యమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపిక



**నవతెలంగాణ- బడంగ్ పేట్**

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు..ఖేల్ ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ ఎం. కోరని అర్జున్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న హన్మకొండలోని జే.ఎన్. స్టేడియంలో జరగబోయే ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్స్ కోసం ఈ నెల 18న సరూర్నగర్ అథ్లెటిక్స్ ప్రధాన మైదానంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలో ముగ్గురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని వెల్లడించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులు ఇవ్వడం జరిగిందన్నారు. 9వ తరగతికి చెందిన కేతావత్ ధనలక్ష్మి 100 మీటర్స్ పరుగు పందెంలో, పశులేటి నవ్య జావెలిన్‌త్రో లో, 100 మీటర్స్ పరుగు పందెంలో మన్నం పల్లవి( జావెలిన్ త్రో) లో ఎంపికైనట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లు ఆమోదం పట్ల హర్షం

**నవతెలంగాణ- బడంగ్ పేట్**

మూడు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన సందర్భంగా..బడంగ్‌పేట్ కార్పొరేషన్ మహిళా కార్పొరేటర్లు, మహిళా మోర్చా నాయకురాళ్ళు గురువారం ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా బిల్లు పార్లమెంటులో అనేక సందర్భాలలో ప్రవేశపెట్టినప్పటికీ మెజారిటీ లేక, ఏకాభిప్రాయం రాక బిల్లు మధ్యలోనే ఆగిపోయిందని గుర్తుచేశారు. చిత్తశుద్ధితో పనిచేసిన ప్రధాని మోడీ చాకచక్యంగా వ్యవహరించి బిల్లును ఆమోదింపజేశారని కొనియాడారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నట్టుగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితల పోరాటం వలన బిల్లు



పాస్ కాలేదని అన్నారు. తెలంగాణ ఆవిర్భావానికి పూర్వమే స్థానిక సంస్థల ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్ అమలులో ఉందని, తెలంగాణ వచ్చిన తర్వాత కల్వకుంట కవిత నిజామాబాద్ పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా అవ్వగలిగారు కానీ..తెలంగాణ రాష్ట్ర, తొలి క్యాబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి కూడా లేకుండా పరిపాలన చేసిన కేసీఆర్‌కు, కవితకు మహిళా సాధికారిత గురించి మాట్లాడే కనీస అర్హత కూడా లేదన్నారు. మహిళల బాగోగులు పట్టించుకోక పోగా..దిక్కుమాలిన లిక్కరు పాలసీ తెచ్చి, తాగుబోతులుగా మార్చి మహిళల బతుకులను ఆగంచేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు ఏనుగు రాంరెడ్డి, రేసు నరసింహారెడ్డి, జెనిగే ఐలయ్య యాదవ్, చిత్రం శీను, దేశపాక జగన్, జగదీశ్వర్ రాజు, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

## అభివృద్ధిలో అగ్రగామి మలక్ పేట్ : ఎమ్మెల్యే అబ్దుల్లా బలాల



**నవతెలంగాణ సంతోష్ నగర్**

అభివృద్ధిలో అగ్రగామిగా మలక్ పేట్ నియోజకవర్గం నిలిచిందని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ముసారంబాగ్ డివిజన్ కార్పొరేటర్, ఓల్డ్ మలక్‌పేట్ కార్పొరేటర్ ఎండి సైఫుద్దీన్ షఫీ, అధికారులతో కలిసి ఎమ్మెల్యే డివిజన్‌లో గురువారం విస్తృతంగా పర్యటించారు. తర్వాత సంబంధిత అధికారులు, నాయకులతో కలసి డివిజన్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోనే మలక్ పేట్ నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. షఫీర్ ఫంక్షన్ హాల్ సలీం నగర్, సంజీవ నగర్ హై స్కూల్ పక్కన బాప్టిస్ట్ చర్చి, మ్యాక్స్ విజన్ జంక్షన్, శాలివాహన నగర్ పార్క్ బ్యాక్ సైడ్, జి.పి హైట్స్ అపార్ట్మెంట్ సమీపంలోని శాలివాహన నగర్, తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేసినట్టు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో దళారులను నమ్మకూడదని సూచించారు. నియోజకవర్గం నుంచి రెండో విడుతలో లాటరీ ద్వారా ఎంపికైన 500 మందికి, నియోజకవర్గానికి చెందిన 500 మంది లబ్దిదారులకు తొలి విడుతలో డబుల్ ఇండ్లు కేటాయించామని, రెండో విడుతలో తాజాగా మరో 500 మందికి ఇండ్లు ఇస్తున్నట్లు వివరించారు. ఎవ్వరూ దళారులను ఆశ్రయించవద్దని, ప్రస్తుత విడుతలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని వారికి మున్ముందు వచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## గణనాథుడికి ఘనమైన పూజలు

**వినాయకుడికి 108 రకాల ప్రసాదాలు..**




**నవతెలంగాణ - హయత్ నగర్**

ఎక్సల్ కాలేజ్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ చైర్మన్ దుగుంట్ల నరేష్ ఆధ్వర్యంలో గురువారం 108 రకాల ప్రసాదాలతో సిద్ధి వినాయక స్వామికి ఆరగింపు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**బడంగ్‌పేట్ :**

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా.. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ పరిధిలోని అల్మాస్ గూడలో ఉన్న మధుర నగర్ కాలనీలో గురువారం వాగ్దేవి అకాడమీ వారిచే అర్ధనారీశ్వర, పేరణి నృత్య ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదిత్య శర్మ వైస్ ప్రెసిడెంట్ చందర్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ గిరిప్రసాద్, నిర్వహణ కమిటీ సభ్యులు కాలనీవాసులు, శంకర్ యాదవ్, శ్రీనివాస్, వెంకటేష్, శ్రీనివాస్, భరత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





రోడ్డుభద్రతపై బంజారా హిల్స్‌లోని ఐసీఐసీఐ ప్రొడెన్షియల్ లైఫ్ ఇన్స్యూరెన్స్‌లో అవగాహన కల్పించిన ఏసీపీ జీ.శంకర్ రాజు. సెల్‌ఫోన్, రాంగ్‌రూట్, త్రిబుల్ రైడింగ్‌పై వెళ్లడంతో వచ్చే ప్రమాదాలపై వివరించారు. అంతేకాకుం డా రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ ఎలా చేస్తారో తెలిపారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షులు సాబు, ఆర్ఎం విక్రమ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఈ ఫలితాలలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన భరత్



**నవతెలంగాణ - సంతోష్ నగర్**

తెలంగాణ ప్రభుత్వం టీఎస్పీఎస్సీ ఫలితాల్లో మూడవత్ భరత్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. మూడవత్ భరత్ నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం నల్లమల్ల ప్రాంతమైన అక్కారం గ్రామానికి చెందినవాడు. అతని తల్లీదండ్రులు మూడవత్ కౌసల్య, లోక్యలు జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. భరత్ తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భరత్ పదో తరగతి నిర్మల విద్యాలయంలో చదివి, 10/10 సాధించాడు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, శ్రీ హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ లో సివిల్ ఇంజనీరింగ్, గౌహతిలో ఐఐటీ ఎంటెక్ పూర్తిచేశాడు. తన కొడుకు చదువు, భవిష్యత్ కోసం చాలా కష్టపడ్డామని..దానికి ఫలితం దక్కిందని భరత్ తల్లీదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తల్లీదండ్రులు తనపై పెట్టుకున్న నమ్మకం, వాళ్లు నా చదువు కోసం పడ్డ కష్టానికి, నా శ్రమకి ఫలితంగా ఈ ఉద్యోగం వచ్చిందని భరత్ సంతోషం వ్యక్తం చేశాడు.

## పేకాట స్థావరంపై దాడి

నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి మండలం కేశ్వాపూర్ గ్రామ పరిధిలో లోటస్ రిసార్ట్‌లో బుధవారం రాత్రి కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న శామీర్ పేట పోలీసులు ఉన్నతాధికారుల ఆదేశాలతో లోటస్ రిసార్ట్ యందు రైడ్ చేశారు. అక్కడ కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. వారు పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించగా వెంటనే పోలీస్ సిబ్బంది ఆ వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి లక్షా అరవై వేల రూపాయల నగదు, 12 మొబైల్ ఫోన్స్,4 జతల షే కార్డులు స్వాధీనం చేసుకున్నారు.వాటిని సీజ్ చేసి పంచనామా నిర్వహించారు. పట్టుబడ్డవారిని, స్వాధీనం చేసుకున్న వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడ్డ వారిలో వి. జీవన్, ఎన్. సాహెబ్, జి. ఆంజనేయులు, డి. భాస్కర్ , కె. చంద్రారెడ్డి, ఎం. చంద్రయ్య, వి. నరేందర్, ఎస్. మాధవ రెడ్డి, ఎ. యాదగిరి, జి. నగేష్, ఎ శేఖర్ బి. సతీష్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు

## వినాయక నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

కాప్రా, చర్లపల్లి చెరువుల వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మున్సిపల్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిలాల్, డి.ఈ. రూప, ఏ.ఈ లు అభిషేక్, స్వరూప, లింగారావు, కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ , కార్పొరేటర్లు స్వర్ణ రాజు, బొంతు శ్రీదేవి, పన్నల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, నగిళ్ళ బాల్ రెడ్డి, గిల్బర్ట్, కుమార స్వామి, నాగేశ్వర్ రెడ్డి, రెడ్డి నాయక్, హరినాథ్, కార్యకర్తలు, భక్తులు , తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం గొప్ప వరం



- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- 1000 మంది లబ్దిదారులకు పట్టాలు పంపిణీ చేసిన మంత్రి
- ప్రతాప్ సింగారంలో పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్

నవతెలంగాణ-జవహర్ నగర్

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందించాలనే ఆలోచన దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాలేదని, సీఎం కేసీఆర్ దార్శనికతతో తెలంగాణ మాడల్‌గా మారిందని అన్నారు. గురువారం జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలో ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలకు వెయ్యి డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు జవహర్ నగర్‌లో నిర్మించి ఇవ్వడం సంతోషకరమన్నారు. జవహర్ నగర్‌లో వాసనలేదని... కలుషిత నీరు అసలే లేదని... మరో బంజారాహిల్స్‌గా మారబోతోందని అన్నారు. రూ. 200 కోట్లతో కార్పొరేషన్‌ను కాంతులీలేలా అభివద్ధి చేశామని, ప్రతీ ఇంటికి మిషన్ భగీరథతో మంచి నీరు అందించామని, సీఎం కేసీఆర్ పేదల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన మహాత్ముడని కొనియాడారు. దేశంలో ఇలాంటి ఇండ్లు ఎక్కడా ఏ పార్టీ ఇవ్వలేదని, పారదర్శకతతో ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్దిదారులకు ఇండ్లు కేటాయిస్తున్నామన్నారు. ఇండ్లు రానివారు ఆందోళన చెందవద్దని, దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి మూడు, నాలుగో విడతల్లో వస్తాయన్నారు. సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకుంటానంటే గహలక్ష్మి పథకం ద్వారా రూ. 3లక్షలు అందజేస్తామని తెలిపారు. గురుకుల విద్యాలయాలు నెలకొల్పి ఆంగ్ల మాధ్యమ చదువులు నేర్పిస్తున్నారని, దేశ, విదేశాల్లో ఉన్నత చదువుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా వేలాది మంది చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్రెడ్డి, జవహర్ నగర్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, దమ్మాయిగూడ చైర్మెన్ ప్రణీత, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారి కష్టారెడ్డి, ఆర్డీవో రాజేశ్ కుమార్, జవహర్ నగర్ కమిషనర్ రామలింగం,తహశీల్దార్ మతిన్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ స్థానిక అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నది ఒక్క తెలంగాణ ప్రభుత్వమే : డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు**

ఘట్కేసర్ : పేదలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నది తెలంగాణ ప్రభుత్వమేనని డిప్యూటీ స్పీకర్ టి. పద్మారావు అన్నారు. ఘట్కేసర్ మండలం ప్రతాప్ సింగారంలో గురువారం అంబర్‌పేట్, ఎల్.బీ నగర్ నియోజకవర్గాల వెయ్యిమంది లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి అభివద్ధికి సీఎం కేసీఆర్ నిరంతరం కషిచేస్తున్నట్టు గుర్తు చేశారు. అద్దె ఇల్లు పేదవారికి భారంగా మారిందనే ఉద్దేశంతో వారికి శాశ్వతంగా సొంతింటి కలను నెరవేర్చిన మహనీయుడు ముఖ్య మంత్రి కేసీఆర్ అన్నారు. ప్రజల ఆశీస్సులతో మూడవసారి సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఇదిలా ఉండగా డబుల్ బెడ్ రూంల ఇండ్లు స్థానికులకు ఇవ్వాలని స్థానిక సర్పంచ్ వంగూరి శివశంకర్ పద్మారావు దష్టికి తీసుకెళ్ళారు. 2208 ఇండ్లల్లో అంబర్పేట్, ఎల్బీ నగర్ నియోజకవర్గాల లబ్దిదారులకు రెండువేల ఇండ్లు పంపిణీ చేయగా మిగిలిన ఇండ్లు స్థానికులకే ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ సైదులు, హౌసింగ్ డీఈ సిద్దార్థ, స్థానిక తహసీల్దారు జీ. కష్ణ, జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ఉరసర్పంచ్ అబేదాబేగం, ఎంపీవో నందకిశోర్, మండల కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, కవిత, నరేష్, శ్రీనివాస్, నాగేశ్వరరావు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీ భూస్థాపితమే



- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ

నవతెలంగాణ-జవహర్‌నగర్

ఎస్సీ వర్గీకరణ చేయకుంటే బీజేపీ భూస్థాపిత మౌతుందని, తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని లేకుంటే తెలంగాణ తరహాలో పెద్ద ఉద్యమమే చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్‌లోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గొప్పలకు పోతూ... పేద ప్రజలకు చేసిందేమీ లేదని, కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం ఎస్సీ వర్గీకరణ కోసం30 ఏండ్ల నుంచి పోరాటం చేస్తున్నా ఎందుకు పెట్టడంలేదని, బీజేపీకి మాదిగలపై వివక్షత ఉన్నట్టు కండ్లకు కట్టినట్టు కనిపిస్తుందని అన్నారు.. అగ్రకులాలు పోరాటం చేయ కున్నా 10శాతం రిజర్వేషన్లు పెంచిందని, మాదిగలను దూరం చేసుకుంటే ఒక్క పార్లమెంట్ సీటు కూడా గెలవదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇంఛార్జీ రామచందర్, నాయకులు ప్రణయ్కుమార్, కొయ్యడ వెంకటేష్, యాకస్వామి, ఆనంద్, యాదగిరి, ప్రభాకర్, సురేందర్, అంజన్న, లక్ష్మయ్య, నర్సింహా, మల్లేష్, రవి, మహేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి అభ్యుదయ వాది గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో ఆయనకు నివాళ్లి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్ష వహించారు. ముందుగా గురజాడ వెంకట అప్పారావు చిత్రపటానికి ప్రముఖ రచయిత పి.బి చారి, సామాజిక ఉద్యమ నాయకులు జయరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ అప్పారావు తెలుగు భాషకు ఎనలేని కృషి చేశారని వాడుక భాషలో జనరం జకమైన రచనలు చేశారని చెప్పారు. పి.బి చారి మాట్లా డుతూ చందస్సు అలంకారాలతో ఆకాశ మార్గాన ఎటో వెళ్లిపోతున్న తెలుగును వాడుక భాషలోకి తీసుకువచ్చి ఎన్నో గొప్ప గొప్ప రచనలు చేశారని చెప్పారు. అందులో పుత్తడి బొమ్మ పూర్ణమ్మ రచన ఆనాటి సనాతన ధర్మం పేరిట జరుగుతున్న దుర్మార్గాలను ఎత్తిచూపిందని తెలి పారు. అంతేకాకుండా బ్రాహ్మణ కుటుంబాలలో అతివలపై జరుగుతున్న దాష్టికాలను ముఖ్యంగా చిన్నపిల్లలను పండు ముసలి వాళ్లకిచ్చి పెండ్లి చేసి, ముసలి వాళ్లు చనిపోయిన తర్వాత ఆడపిల్లలకు తలనీలాలు తీసివేసి తెల్ల వస్త్రాలు ధరించేటట్టు, ఎటువంటి రుచులేని భోజనాలు చేసే విధంగాను ఎంతో దుర్మార్గంగా అణచివేశారని తెలియ జేస్తూ కన్యాశుల్కం నాటకాన్ని గొప్పగా రచించి ఎన్నో ప్రదేశాలలో ప్రదర్శింప చేశారన్నారు.మ తన జీవితకా లంలో సంఘసంస్కరణకు గట్టిగా నిలబడ్డారని అంతేకా కుండా దేశభక్తి అంటే ఏమిటో దేశం అంటే మట్టి కాదు దేశమంటే మనుషులే అంటూ గొప్ప రచన చేశారని చెప్పా రు. ఆయన చేసిన కృషిని సభికులందరూ వేనోళ్ల పొగి డారు. అనంతరం సభికులు గురజాడ అప్పారావు చిత్రప టానికి పూలు వేసి నివాళులర్పించారు. కోమటి రవి, నర్సింగరావు, శ్రీనివాసరావు, శ్రీనివాసు, ఉనికిష్టన్, గౌసియా, అంజలి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇండ్లు ఇవ్వాలంటే హౌజ్ అరెస్ట్‌లా?



- సీపీఐ(ఎం), సీపీఐ మండల కార్యదర్శులు ఎన్ సబిత,ఎల్ ఈశ్వర్

నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్ కేసర్ మండల పరిధిలోని అన్ని గ్రామాలలోని అర్హులైన నిరుపేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావుకు మెమోరాండం ఇద్దామని భావిస్తే తెల్లవారు జామునే పోలీసులు హౌజ్ అరెస్టులు చేశారని సీపీఐ(ఎం), సీపీఐ మండల కార్యదర్శులు ఎన్ సబిత,ఎల్ ఈశ్వర్ అన్నారు. తాము మహిళలం, తమ ఆరోగ్యాలు బాగులేవని చెప్పినా వినిపించుకోకుండా హౌజ్ అరెస్ట్ చేయడమే కాకుండా పోచారం పోలీసు స్టేషన్ కు తరలించారని తెలిపారు. గురువారం సీపీఐ(ఎం) మండల నాయకులు కె అలివేలు, జి నాగమణి, బీఆర్ సునీత లతో పాటు సీపీఐ(ఎం), సీపీఐ మండల కార్యదర్శులు ఎన్ సబిత,ఎల్ ఈశ్వర్‌లను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘట్కేసర్ మండల పరిధిలో ప్రతాప్ సింగారం లో నూతనంగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో స్థానికులైన మండల నిరుపేదలకు 50 శాతం ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు స్థానికులకు ఇవ్వకుండా జిల్లా కానీ వ్యక్తులకు ఇక్కడ ఇస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు ఇవ్వకపోతే ఐక్యంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ మంత్రి నియోజకవర్గంలోని నిరుపేదలకు ఇవ్వకుండా బయట జిల్లాల వారికి ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. రెక్కల కష్టమే జీవనాధారంగా జీవిస్తున్న అత్యంత నిరుపేదలే నూటికి ఎనభై శాతం ఉన్నారని చెప్పారు. కూలీలుగా, దినసరి కూలీలుగా, కార్మికులుగా, ఆటో కార్మికులుగా అత్యంత దుర్భర జీవితాన్ని గడుపుతున్న స్థానిక పేదలను ఎందుకు విస్మరిస్తున్నారో మంత్రి వివరణ ఇవ్వాలన్నారు. ఇండ్ల ఎంపికలో రాజకీయ వివక్ష చూపవద్దన్నారు. రాజకీయాలకతీతంగా పారదర్శకంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రాబోయే రోజులలో మండల పేదలకు ఇండ్లు దక్కేవరకు కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా ఉద్యమిస్తాయని పేర్కొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి

- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్టు నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం పురపాలక సంఘ కార్యాలయంలో సాధారణ సమావేశం చైర్మెన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం పురపాలక సంఘ పరిధిలో అన్ని వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. సాధారణ నిధుల నుంచి వివిధ వార్డులలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీలు, సిమెంటు రోడ్లు, గేటు



వాల్వులకు రూ. 37.50 లక్షలు, గ్రీన్ బడ్జెట్ నిధుల నుంచి పెద్దకాపు వద్ద నాలా బ్యూటిఫికేషన్ కోసం రూ. 7.50 లక్షలు, 18 వ వార్డులో మున్సిపల్ ఓపెన్ ప్లేస్ కాంపౌండ్ నిర్మాణం కోసం రూ. 9.60 లక్షలు, 16వ వార్డులో మున్సిపల్ ఓపెన్ ప్లేస్ కాంపౌండ్ నిర్మాణానికి రూ. 2.40 లక్షలు, పట్టణ ప్రగతి నిధులతో రాంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం 31.50 లక్షలు, రాంపల్లి లో అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ. 21.50 లక్షలు, నాగారంలో అంగన్వాడి భవన నిర్మాణానికి రూ. 21.50 లక్షలు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. మొత్తం కోటి ముప్పై ఒక్కలక్షల యాభై వేల రూపాయల పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి రాజేందర్ కుమార్ , వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్ , కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది

- అక్షర విద్యాసంస్థల చైర్మెన్ అరిషనపల్లి జగన్మోహన్ రావు
- ఉపాధ్యాయులకు బంగారం ప్రదానం



నవతెలంగాణ-కాప్రా

గురుపూజోత్సవ దినోత్సవం సందర్భంగా అక్షర విద్యా సంస్థల్లో పదేండ్లు పూర్తి చేసుకున్న తొమ్మిది మంది ఉపాధ్యా యులకు ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారాన్ని యాజ మాన్యం ప్రదానం చేసింది. అలాగే పాఠశాలల్లో పనిచేస్తున్న 600 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించింది. సిద్దిపేట జిల్లా మతపాక గ్రామ పరిధిలోని 'ది హిడెన్ క్యాసె ల్' నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించింది. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నిర్వహించిన సాంస్కతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

అక్షర విద్యాసంస్థల చైర్మెన్ అరిషనపల్లి జగన్మోహన్ రావు మాట్లాడుతూ సమాజానికి అవసరమైన, చైతన్యవం తమైన భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యా యుల పాత్ర వెలకట్టలేనిదని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో నడుస్తూ, ప్రతిభావంతులైన విద్యా ర్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని, వారు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. సమ సమాజ స్థాపనలో అహర్నిశలు శ్రమిస్తున్న తమ ఉపాధ్యాయ బృందంలో పదేండ్లు పూర్తి చేసుకున్న తొమ్మిది మందికి ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారంతో సత్కరిం చడం తమ గురుతర బాధ్యతగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ వేడుకల్లో అక్షర విద్యాసంస్థల సీఈవో మదన్ మోహన్ రావు, ఫైనాన్స్ డైరెక్టర్ రామారావు, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ సరిత రావు, ఏడు బ్రాంచుల ప్రధానోపాధ్యాయులు, ఉప ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

## కిరణ్ కుమార్ రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలి



- బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-బోడుప్పల్

బీఆర్ఎస్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు మంద సంజీవరెడ్డిపై బీజేపి కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు స్థానికంగా పెద్దఎత్తున దుమారం రేపాయి. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం బోడుప్పల్ ఆర్ఎస్ఎస్ కాలనీలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి కిరణ్ కుమార్ రెడ్డి తమ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో తగిన బుద్ధిచెబుతామని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో ఉంటూ బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంద సంజీవ రెడ్డిని విమర్శించే స్థాయి కిరణ్ కుమార్‌రెడ్డికి లేదన్నారు. కార్పొరేటర్‌గా కిరణ్ కుమార్ రెడ్డి చేస్తున్న అవి నీతి,అక్రమాలు అందరికి తెలుసన్నారు. ఎన్నడూ లేని వక్ఫ్ బోర్డు సమస్యను సృష్టించి స్థానికులను భయ పెట్టి తక్కువ ధరకు ప్లాట్లను కొనుగోలు చె స్తున్నారని మండిపడ్డారు.

సీనియర్ నాయకులు కాటపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షులు ఎ మంద సంజీవరెడ్డిని ఏక వచనంతో సంభోదిస్తూ కిరణ్ కండ్లు నెత్తికెక్కినట్టు మాట్లాడటం తగదన్నారు. కార్పొరేటర్‌గా ఆయన డివిజన్‌లో చేస్తున్న అవినీతి, అక్రమాలు అందరికి తెలుసన్నారు. తాము కన్నెర్ర చేస్తే ఊర్లో కూడా ఉండలేవని హెచ్చరించారు. ఇప్పటికైనా కిరణ్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని బేషరతుగా అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో త్వరలో ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మాజీ వైస్ ఎంపీపీ కొత్త చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ.. 'పెద్ద నాయకుడి మీద మాట్లాడితే లీడర్ అయిపోతావేమోనను కుంటున్నావ్... చాలా మంది బీజేపి నాయకులు చేస్తున్న మిస్టేక్... నీవు లాగు వేసుకోక ముందు నుంచే మా పార్టీ అధ్యక్షులు సంజీవ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారు, మా హయాంలోనే ఆర్ఎస్ఎస్ కాలనీలో పలు అభివృద్ధిపనులను చేపట్టాం. వ్యక్తి గత ప్రయోజనాల కోసం మా పార్టీ అధ్యక్షులుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతాం. నోటిని అదుపులో పెట్టుకుని స్థాయి మరిచిపోకుండా మాట్లాడాలి' అని హితవు పలికారు. అనంతరం మరో సీనియర్ నేత, సహకార బ్యాంకు డైరెక్టర్ జడిగి రమేశ్ యాదవ్ మాట్లాడుతూ.. కిరణ్ కుమార్ రెడ్డి తన డివిజన్‌లో బంధనలను ఉల్లంఘించి ఇరవై ఇండ్లు కడుతూ లేని సమస్యను సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఆత్మీయ సమ్మేళనానికి కరీంనగర్ నుంచి ఎలా వచ్చావో అలా పంపించడానికి స్థానికులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సంజీవ రెడ్డి గురించి మరో మాట మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. సంజీవరెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కార్పొరేటర్ చీరాల నర్సింహ, సీనియర్ నాయకులు జక్కల రాములు. దానగల్లు యాదగిరి, మైస గల్ల మల్లేశ్, బొమ్మకు విశ్వనాథ్, తాల్క శత్రుఘ్న, ధర్మ నాయక్. పుల్లూరి విష్ణువర్ధన్ రావు, ఎల్లగోని శ్రీహరిగౌడ్. చంటి శ్రీనివాస్, ఉప్పరి విజయ్. పులకండ్ల కీర్తన్ రెడ్డి.. చిన్నింగల సంతోష్, శ్రీనివాస్ గుప్తా, నర్సింగ్ నాయక్ లతో పాటు వివిధ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా అఫ్జల్ ఖాన్



నవతెలంగాణ-శామీర్‌పేట

తెలంగాణ భవన్ లో గురువారం కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కార్యదర్శి గా మరో మారు మహమ్మద్ అఫ్జల్ ఖాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సేవాదళం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అమీర్ కేసీఆర్ సేవాదళం రాష్ట్ర కమిటీని బుధవారం ప్రకటించినట్టు తెలిపారు. అయితే ఈ సారి రాష్ట్ర కమిటీని కుదించి తక్కువ చేసి చురుకుగా పని చేసే కార్యకర్తలకు మాత్రమే రాష్ట్ర స్థాయి కమిటీలో స్థానం కల్పించారని అన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ లో తనకు చోటు దక్కటం పట్ల అఫ్జల్ ఖాన్ సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో తనను మరోసారి రాష్ట్ర కార్యదర్శి గా నియమించిన మహ్మద్ అమీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అమీర్, తెలంగాణ భవన్ ఇన్‌చార్జీ శ్రీనివాస్ రెడ్డి, ఉపెందర్ రెడ్డి ,జావీద్ పటేల్, మహ్మద్ గౌస్, చిటుకుల మహిపాల్ రెడ్డి, అస్లం , బానాపూరం వెంకట్, అంజి,మహ్మద్ కలీం,బషీర్ ,సబీహ ,ఆసియా బేగం, వివిధ జిల్లాల కార్యకర్తలు పాల్గొన్నారు.



**కాప్రా డివిజన్‌లో గాంధీనగర్, వంపుగుడ, ఎల్లారెడ్డి గూడ, సాయి నగర్, సాయిబాబా నగర్, జై జవాన్ కాలనీ, భరత్ నగర్ కాలనీ, పీజేఆర్ కాలనీ, జమ్మిగడ్డ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ పత్తి కుమార్, సందీప్ గౌడ్ ఆహ్వానం మేరకు డివిజన్‌లో ఏర్పాటుచేసిన పలు వినాయక మండపాలలో ప్రత్యేక పూజ కార్యక్రమాలలో కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు అంజి రెడ్డి ఆహ్వానం మేరకు భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం భవాని నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు రాగిడి లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరించారు.సుధాకర్ చారి, రాజమోహన్ రెడ్డి, చందు యాదవ్,ఎండీ రిజ్వాన్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు మల్లేష్ కురుమ, ఉప్పల్ డివిజన్ మైనారిటీస్ చైర్మెన్ గజ్జల రాజు కరిపే మల్లికార్జున్, గంటా జితేందర్ రెడ్డి, శ్రీకాంత్ నాయక్, కార్తీక్ రెడ్డి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.** నవతెలంగాణ-కాప్రా

## 'బండారి లక్ష్మారెడ్డికే మా మద్దతు'



- ఏకగ్రీవ తీర్మానం చేసిన రాష్ట్ర వంశ రాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర సంఘం కమిటీ

నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కే తమ మద్దతు అని రాష్ట్ర వంశ రాజుల సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర వంశ రాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర సంఘం కమిటీ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బం డారి లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామా జిక కార్యక్రమాలు చేపడుతున్న బీఎల్ఆర్‌కే తమ పూర్తి మద్దతు అని తెలిపారు. అందరూ కారు గుర్తుకు ఓటు వేసి ఆయనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వంశీ రాజు మల్లేశ్, అఖిల భారత వంశ రాజ్ అన్నదాన సత్రం చైర్మెన్ వంశ రాజు, అఖిల భారత వంశ రాజ సంఘం అధ్య క్షుడు పల్లె సత్యం,రాష్ట్ర అధ్యక్షుడు మురళీ కష్ణ ,ప్రధాన కార్యదర్శి పాండు, గోపాల్, శ్రీ రాములు, యాదగిరి, పోశ య్య, మల్లేశ్, ముత్తు,సుమతి,రాము ,స్వామి పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి




నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో గురువారం కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎం. రాజేందర్, కార్యదర్శి మారం జగదీశ్వర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్), విక్రమ్, మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, రాజు ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటాన్ని.. ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజలందరూ ఆయన ఆశయాలను కొనసాగించాల్సిందిగా, బంగారు తెలంగాణ కోసం అందరు పాటుపడాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బాలరాజ్, సహాధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు కుర్రాడి శ్రీనివాస్, కేంద్ర సంఘ సభ్యులు నజీర్ అహ్మద్, మహిళా ఉద్యోగులు అరుణ జ్యోతి, తేజస్విని నాయకులు సుధాకర్, ఇమ్రాన్, జమీర్ వెంకటేష్, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్ ఏపీఆర్వో మొహ మ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వట్టే జానయ్యకు రక్షణ కల్పించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

వట్టే జానయ్య యాదవ్‌కు రక్షణ కల్పించాలని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మెన్ హన్సరాజ్ గంగారాం ఆహిర్‌ను భారత యాదవ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్ యాదవ్ కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి జగదీశ్వర్ రెడ్డి బీసీ నాయకుడైన ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ వట్టె జానయ్య యాదవ్ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక మంత్రి తన అనుచరులతో అక్రమంగా ఒకే రోజు జానయ్య యాదవ్ పై 70 కేసులు బనాయించారని తెలిపారు. జానయ్య యాదవ్ అనుచరులను, బంధువులను పోలీస్‌లు మంత్రి జగదీశ్వర్ రెడ్డి ప్రోత్బలంతో వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. జానయ్యకు, అతని కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని హన్సరాజ్ గంగారాం ఆహిర్‌ను కోరారు.

## అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న వెంగళ్‌రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్ డివిజన్, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు గణేష్ మండపాలను సందర్శించి అన్నదాన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు గొట్టిముకల వెంగళ్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యూత్ కాంగ్రెస్ నాయకులు సునీల్ కుమార్ యాదవ్, కూకట్‌పల్లి ప్రెసిడెంట్ మేకల రమేష్, మహిళా ప్రెసిడెంట్ కృష్ణవేణి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ అనిల్, ఎన్యూఎస్‌యుఐ కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రెసిడెంట్ గణేష్, బండారు ప్రవీణ్ గౌడ్,గురుమూర్తి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ రాష్ట్రం

- పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- దుండిగల్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలుపంపిణీ
- రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-దుండిగల్

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దేశంలోనే ముందు స్థానంలో ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుకు నిదర్శనమని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు సంబంధించి 1,800 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, ఐటీ శాఖ మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్నామన్నారు. గతంలో ఇండ్లు కట్టి చూడు... పెళ్ళి చేసి చూడు అనే సామెత ఉండేదని... దానిని తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు కట్టించి ఇస్తున్నాడని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ ద్వారా పెండ్లి చేయిస్తూ, ఆడబిడ్డలకు మేనమామలా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి తొమ్మిదేండ్ల పాలనలో చేపట్టిన కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులు ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగాయని తెలిపారు. ఈ విషయంలో కంప్యూటర్‌తో రూపొందించిన ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఎంపిక విధానం రూపొందించిన జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్‌లు అమోయ్ కుమార్, అనుదీప్, హౌసింగ్ సీఈ సురేష్‌లను మంత్రి కేటీఆం సభలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ విధానం ద్వారా ఎలాంటి రాజకీయాలు లేకుండా నిరుపేదలైన అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులు జరగడం ఎంతో మంచి పరిణామమని తెలిపారు. అలాగే ప్రస్తుతం ఇండ్లు రాని వారు ఏమాత్రం ఆందోళన చెందవద్దని... పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ఎలాంటి పక్షపాతంలేకుండా రాబోయే నెల నెలన్నర రోజుల్లో మరికొన్ని ఇండ్లను కేటాయిస్తామని ఈ సమావేశంలో మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు సంబంధించి వికలాంగులకు గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌లలో కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన ఇండ్లకు సంబంధించి ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా నిష్పక్షపాతంగా అర్హులకు ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా అందరూ మనవారే అనే ఉద్దేశ్యంతో ఆశ్రిత పక్షపాతం లేకుండా ఇండ్ల కేటాయింపులు చేయించినట్లు మంత్రి సమావేశంలో వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన డబుల్? బెడ్‌రూమ్? ఇండ్లు దేశంలో మరెక్కడైనా నిర్మించారా అని ప్రశ్నించారు? రాష్ట్రంలో పలు చోట్ల నుంచి పెట్టుబడి పెట్టి అనేక పరిశ్రమలు వస్తున్నాయని శరవేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందచేస్తామని ఈ విషయంలో ఎలాంటి బేషజాలు లేవని... రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్కరి జీవితాలు బాగుపడుతున్నాయని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో మరింత ఉత్సాహంగా పని చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం యాజమాన్య పట్టాల పంపిణీ పత్రాలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ నవీన్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## అధికారులు అంగన్ వాడి స్కూల్ తాళాలు పగలగొట్టడం మానుకోవాలి




- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్ని కృష్ణన్

నవతెలంగాన-సీటీ బ్యూరో

అధికారులు అంగన్ వాడి స్కూల్ తాళాలు పగుల గొట్టడం మానుకోవాలి అని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె. ఉన్ని కృష్ణన్ అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అంగన్వాడి సమ్మె 11 రోజుకి చేరింది. ఈ సందర్భంగా అల్వాల్ ప్రాజెక్ట్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు యూనియన్ కార్యదర్శి శోభారాణి అధ్యక్షత వహిస్తూ ప్రభుత్వం సమ్మెను విఫలం చేయడానికి అంగన్వాడి స్కూల్ తాళాలు పగలగొడుతున్నారన్నారు. ఇది నీచమైన చర్య అని, అధికారులు వెంటనే మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్రస్థాయిలో సమ్మెను ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ అంగనవాడి టీచర్లు 11వ తారీకు నుంచి సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. 15 రోజుల ముందు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, అయిన ప్పటికీ ప్రభుత్వం చర్చలకు పిలిచి పరిష్కారానికి ఎలాంటి కృషి చేయలేదని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం అంగన్వాడి ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేయడం కోసం నానా కుట్ర లు పన్నుతుంది అన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్వాడి సమ్మెలో ఉన్న నాయకత్వాన్ని పిలిచి చర్చలు చేయాలని, సమస్య పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మల్కాజిగిరి నాయకుడు బి.నర్సింగ్ రావు, అంగన్వాడి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శివరాణి, భాగ్యరేగ రమాదేవి, రమా, రమాదేవి, అంజమ్మ శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తా

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శిరీష బాబురావుతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 39వ రోజు గురువారం ప్రజా సమస్యలపై పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నేటితో 8 డివిజన్‌లో పాదయాత్ర పూర్తి చేసుకున్నామని వాటిలో ముఖ్యంగా డ్రయినేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని రూ.50 కోట్ల డ్రయినేజీ వ్యవస్థకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో వేలకోట్ల రూపాయలతో నియోజకవర్గంలో మంచినీళ్లు, రోడ్లు, డ్రయినేజీ, ట్రాఫిక్ సమస్యలను నిర్మూలించామన్నారు. భారీ వర్షాలు సంభవించినప్పుడు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పలు కాలనీలో ఇండ్లలోకి నీరు చేరడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందులో భాగంగానే జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌తో కలిసి బుధవారం ఫతేనగర్ అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలను, నాలాలను పరిశీలించామన్నారు. 125 కోట్ల రూపాయలతో నాలా వ్యవస్థ పునర్నిర్మాణ పనులు చేపట్టబోతున్నామన్నారు. అందులో భాగంగానే రెండో విడతగా 500 మంది లబ్దిదారులకు నేడు డబుల్ బెడ్ రూమ్‌లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో

## ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్



- ఇంటెన్సివ్ కేర్ వైద్యులు డాక్టర్ సుబ్బారెడ్డి

నవతెలంగాన-సిటిబ్యూరో

సీజన్లు మారుతున్న కొద్దీ ఇన్ఫెక్షన్ల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, సాధారణ జలుబు, జ్వరానికి కూడా యాంటీబయాటిక్స్ తీసుకోవడం రోగులకు అత్యంత సాధారణ అలవాట్లలో ఒకటిగా మారింది. అయితే, ఈ తరహా చర్యలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని నగరంలోని ప్రఖ్యాత ఇంటెన్సివ్ కేర్ వైద్యుడు డాక్టర్ సుబ్బారెడ్డి హెచ్చరించారు. యాంటీ-మైక్రోబయల్ రెసిస్టెన్స్ (AMR) ప్రాబల్యం మన సమాజంలో చాలా ఆందోళనకర స్థాయికి చేరుతుందని డాక్టర్ రెడ్డి వెల్లడించారు. బ్యాక్టీరియా, వైరస్లు, శిలీంధ్రాలు, పరాన్నజీవులు కాలక్రమేణా రూపు మార్చుకున్నప్పుడు, రోగి మందులకు ప్రతిస్పందించడంలో విఫలమైనప్పుడు యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (AMR) ఏర్పడుతుంది. దీనితో ఇన్ఫెక్షన్లను చికిత్స చేయడం కష్టతరమవుతుంది, చివరికి మరణానికి కారణమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 700,000 మంది ఏ ఎమ్ ఆర్ తో యుద్ధంలో ఓడిపోతుంటే 2050 నాటికి మరో 10 మిలియన్ల మంది దీని వల్ల చనిపోతారని అంచనా వేయబడింది. 2050 నాటికి ఏఎమ్ఆర్ కారణంగా భారతదేశంలో 2 మిలియన్ల మరణాలు సంభవిస్తాయని అంచనా వేయబడింది. జలుబు, జ్వరానికి యాంటీబయాటిక్స్ తీసుకోవడం లేదా డాక్టర్ సూచించిన యాంటీబయాటిక్స్ తీసుకోకపోవడం వల్ల ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉండడం, వైద్య ఖర్చులు పెరగడం, తీవ్రమైన లేదా సంక్లిష్టమైన అనారోగ్యం లేదా బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా మరణాలు సంభవించటం జరగవచ్చు. యాంటీమైక్రోబయాల్స్ మితిమీరిన వినియోగం, స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేకపోవడం, పరిశుభ్రత లేకపోవటం, ఇన్ఫెక్షన్ నియంత్రణ సరిగా లేకపోవటం, తగిన అవగాహన, జ్ఞానం లేకపోవడం వల్ల ఏ ఎమ్ ఆర్ సంభవించవచ్చు లేదా వ్యాప్తి చెందవచ్చు. ఏ ఎమ్ ఆర్ ప్రభావంపై డాక్టర్ రెడ్డి మాట్లాడుతూ "జీవితంలో ఏ దశలోనైనా యాంటీ మైక్రోబయల్ నిరోధకత ప్రజలను ప్రభావితం చేస్తుంది. మెజారిటీ ప్రజలు ఓవర్-ది-కౌంటర్ మందులను కొనుగోలు చేయటం మందులు ఎలా పని చేస్తాయనే దానిపై అవగాహన లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలా కాకూడనుకుంటే వైద్యునితో చర్చించి, ఆ తర్వాత మాత్రమే మందులు తీసుకోవడం మంచిదన్నారు. డాక్టర్ రెడ్డి మాట్లాడుతూ యాంటీమైక్రోబయాల్స్ యొక్క హేతుబద్ధ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుగా నర్సులు, ఇతర ఆరోగ్య సంరక్షణ ప్రదాతలలో అవగాహన పెంచే ప్రయత్నం చేయాలన్నారు.

## ఘనంగా పూజలందుకుంటున్న గణనాథుడు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ మిథిలా నగర్, ఆర్.కే.లేఅవుట్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా గురువారం సాయంత్రం గణపయ్య ఘనమైన పూజలు అందుకుంటున్నాడు. స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్ నాయకులు మురళి కృష్ణ, సురేష్ , కాలనీవాసులు తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘముల నాయకులతోపాటు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





కేపీహెచ్‌బీలో గణనాథుడికి పూజాలు చేస్తున్న బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు...

## వినాయక నిమజ్జనం సజావుగా జరిగేలా ఏర్పాట్లు



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వినాయక నిమజ్జనం సజావుగా, సంప్రదాయబద్ధంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన బేబీ పాండ్ ఆయన పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వినాయక నిమజ్జనాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగ కుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలను కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం తో నిమజ్జనం ఏర్పాట్లు చేయాలనీ నిమజ్జనం పాయింట్ల వద్ద పకడ్బందీ బార్ కేడింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఒక్కొక్క పాయింట్ వద్ద రెండు పెద్ద క్రేన్లు, ఒక చిన్న క్రేన్ ఏర్పాటు చేయాలని సూచించారు. పాండ్‌లో తగినంత నీరు ఉండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం స్థలాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను (స్విమ్మర్లను) మూడు షిఫ్టులలో నియమించాలన్నారు. గణేష్ నిమజ్జనం ప్రదేశాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, బ్లీచింగ్ పౌడర్ అందుబా టులో ఉంచాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులకు సూచించారు.హైదర్ నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ధైర్యం లేకే ప్రతిపక్షాల అరెస్టులు

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బీఆర్ఎస్ ప్రభుత్వానికి ,పాలకులకు ధైర్యం లేకనే ప్రతిపక్షాల నేతలను అరెస్టు చేయడం పిరికిపందల చర్య అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమామహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గండిమైసమ్మలో డబుల్ బెడ్ రూమ్‌ల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటారనే నెపంతో ఉదయం 6 గంటలకే సీపీఐ నాయకులను ఎస్సై.శంకర్ నేతృత్వంలో అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు డబుల్ బెడ్ రూమ్‌లను ఇచ్చి మంచి పని చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వానికి భయం ఎందుకని ప్రశ్నించారు. అందరి దరఖాస్తులను పరిశీలంచకపోవడం,అందరికీ ఇస్తామని చెప్పి 25 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం లక్ష మందికే ఇవ్వడం ఎంత వరకు సమాంజసం అన్నారు. అసలైన కార్మిక వర్గంగా చెప్పుకునే భవన నిర్మాణ కార్మికులకు, హమాలి కార్మికులకు, ఆటో డ్రైవర్లకు, జీహెచ్ఎంసీ కార్మికులకు, వికలాంగులకు, వితంతువులకు రాకపోవడం లాంటి తప్పుల వల్లే నేడు ప్రభుత్వం కమ్యూనిస్టులను, కాంగ్రెస్ వారిని ముందస్తుగా అరెస్టు చెయ్యడం అప్రజస్వామిక విధానమని హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అన్నారు. అరెస్టుల వల్ల భయపడే పార్టీలు కాదని, అర్హులకు డబుల్ బెడ్‌రూమ్‌లైన లేక, 60 గజాల ఖాళీ స్థలమైన ఇచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ ఇంటెలిజెన్స్ ద్వారా నిజమైన రిపోర్టు తెపించుకొని ప్రజలకు అందరికి డబల్ బెడు రుమ్‌లను ఇవ్వలేమని క్షమాపణలు చెప్పి 60 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయ్యినవారిలో సీపీఐ నాయకులు ప్రభాకర్, వంగాల శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ చారి తదితరులు ఉన్నారు.

## ఎన్‌సీడీ అప్లికేషన్స్ పై జిల్లా స్థాయి సమావేశం



నవతెలంగాన-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఎన్సిడీ అప్లికేషన్‌పై అన్ని ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, డీఈఓలకు జిల్లా స్థాయి వర్క్‌షాప్ +OI- నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్ (NCD) అప్లికేషన్ గురించి ప్రయోగాత్మక శిక్షణ అందించారు. డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్, హెల్త్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్, స్టేట్ లెవల్ ట్రైనర్, డిడిఎం, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మీటింగ్ హాల్‌లో జరిగిన మెడికల్ ఆఫీసర్లు, డియోలకు సంక్షిప్త సమాచారం, శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ హైపర్‌టెన్షన్, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ కోసం 30 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులందరినీ లెక్కించడం, ఎన్సిడి నమోదు, స్క్రీనింగ్‌పై డేటాను అప్‌లోడ్ చేయడానికి ట్యాబ్ వినియోగంలో అప్లికేషన్ సహాయం అందించడం ఈ శిక్షణ లక్ష్యం అ న్నారు. క్యాన్సర్, మధుమేహం, కార్డియోవాస్కులర్ డీసీజ్, స్ట్రోక్ నివారణ, నియంత్రణ కోసం జాతీయ కార్యక్రమం రూపొందొంచారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు, డీప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కీసర డివిజన్, డాక్టర్ రఘునాథస్వామి, పీఓ ఎన్సిడీ, రాష్ట్ర డీడీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలలో "ఒంటరి గులాబి" సీరియల్ నటులు



నవతెలంగాన-సిటిబ్యూరో

హైదరాబాద్ మహానగరంలో ప్రతియేటా ప్రతిష్టాత్మకంగా జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ఈ సారి మరో ప్రత్యేకతను కూడా చోటు చేసుకోనుంది. తెలుగు ప్రేక్షకుల అభిమాన టివి ఛానల్.. జెమిని కుటుంబం నుండి.. జెమిని నటించే ప్రేక్షకుల అభిమాన నటినటులు.. నగరం నలు మూలలా ఉండే గణేష్ మండపాలను స్వయంగా సందర్శించి.. గణేష్ పూజలో పాల్గొని.. అక్కడ నిర్వాహకులను.. భక్తులను స్వయంగా కలిసి వారితో ముచటిస్తారు. ప్రేక్షక అభిమాన నటినటులు మీ వీధి, మీ కాలనీ, మీ గల్లికీ రాబోతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దిల్?సుఖ్?నగర్ వివేకానంద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్, సరూర్ నగర్ నవీజీవన్ యూత్ అసోసియేషన్ గణేష్ మండపాలని మీ అభిమాన సీరియల్ "ఒంటరి గులాబి" రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా సీరియల్లో హీరో, హీరోయిన్ గా నటిస్తున్న బాలు (రాహుల్ రవి) రోజా (సుప్రిత) సాయంత్రం నేరుగా గణేష్ మండపానికి వచ్చి సందడి చేశారు.

## బీఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో మహిళలే బుద్ధి చెపుతారు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహిళా రిజర్వేషన్ నా వల్లే ఆమోదం పొందిందని ఎమ్మెల్సీ కవిత అనడం విడ్డూరంగా ఉందని సురభి రవీందర్ రావు అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ , ప్రగతి నగర్ నుండి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు ఆధ్వర్యంలో, మార్పు కోసం అనే నినాదంతో ప్రారంభించిన పాదయాత్ర ,డివిజన్ అధ్యక్షులు భూపాల్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. వివిధ బస్తీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలలో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ పార్టీ పైన తీవ్ర వ్యతిరేకత కనబడుతుందని అన్నారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర అసహనంతో ఉన్నారని, బీఆర్ఎస్ పార్టీ కేవలం మాటలకే పరిమితమైంది తప్ప చేతలకు కాదని మహిళలు మాట్లాడుకోవడం గమనార్హం అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ పట్ల దేశ ప్రజలందరూ నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు కూడిన ధన్యవాదాలు తెలపడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ మహిళలందరూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పి గెలిపించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు భోపాల్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు శ్రీలత, వైస్ ప్రెసిడెంట్ ఇంద్ర రెడ్డి, శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ మాధురి, దుర్గ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలి



- టీ-ఆక్టా కన్వీనర్ రాజేష్ ఖన్నా

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయకుండా ప్రభుత్వం తాస్సారం చేస్తుందని టీ-ఆక్టా కన్వీనర్ రాజేష్ ఖన్నా అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1445 మంది, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీలో పనిచేస్తున్న 224 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని గురువారం 13వ రోజు జేఎన్‌టీయూహెచ్ హెడ్ క్వార్టర్స్ , అనుబంధ కళాశాలల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్పందన బ్లాక్ దగ్గరకు చేరిన అధ్యాపకులు మానవహారంగా ఏర్పడి తమను రెగ్యులరైజేషన్ చేయాలని నినాదాలును చేస్తూ పెద్ద ఎత్తున నిరసన చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు జేఎన్టీయూహెచ్ ఏపీ (సీ) అధ్యక్షులు డా. శ్రీనివాస్ రెడ్డి, టీ-ఆక్టా డా. రమేష్, డా.బాలరాజులు పాల్గొని మాట్లాడుతూ అన్ని రకాల అర్హతలతో కూడి ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యూలరైజ్ చేయాలన్నారు. ఈ కాంట్రాక్ట్ జాబ్‌తో ఎన్నో బాధలు పడుతున్నామని, వివక్షకు గురవుతున్నామన్నారు. ఇకనైనా అధికారులు కండ్లు తెరిచి మా బాధలను గుర్తించి, మా హార్డ్ వర్క్‌ని గమనించి, మా జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఇక మా రెగ్యులరైజేషన్ విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశాలు మృగ్యమై పోతాయన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందు ఒక అనౌన్స్మెంట్ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి పుణ్యం కట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమరేందర్, దేవేందర్, రంజిత్, నరేష్, రాజేష్, నరేష్ యాదవ్, అశోక్, మానస, దశరథం,నరేందర్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని, కుత్బుల్లాపూర్ గ్రామంలో, రాజీవ్ యూత్ అసోసియేషన్ వారు గార్డెన్ బస్తీ వెల్ఫేర్ కమిటీ వారు ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద, వారి యొక్క ఆహ్వానం మేరకు, ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం. ప్రతాప్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నక్క ప్రకాష్, గార్డెన్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉప్పల హరి వేణుగోపాల్, గన్నబోయిన నర్సింగ్ రావు ముదిరాజ్, సత్యనారాయణ, బోనాల అనిల్ కుమార్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | సెప్టెంబర్ 22, 2023 | www.navatelangana.com



## గణపతి మండపాలలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

మోండా డివిజన్ కార్పొరేటర కొంతం దీపిక గణపతి నవరాత్రుల్లో భాగంగా డివిజన్‌లోని మారేడపల్లి ప్రాంతాల్లో పలు మండపాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు అపార్టుమెంట్ కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న అన్నదాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అన్న ప్రసాద కార్యక్రమాలను ప్రారంభించారు



వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని రాజీనగర్ (ఖైరతాబాద్ డివిజన్)కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి,స్థానికంగా వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలలో పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులతో పాటు ప్రజా ఆశీస్సులు అందించాలని ఆమె తెలిపారు.

- నవతెలంగాణ-బంజారాహిల్స్

## బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో ప్రభుత్వంలో వణుకు పుడుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. రామ్‌గోపాల్‌పేట డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు యువకులు డాక్టర్ కోట నీలిమ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన రెహమాన్ షరీఫ్ ఆధ్వర్యంలోని యువకులు మహిళలు కాంగ్రెస్ కండువాను స్వీకరించి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇబ్రహీం పటేల్, ఫసి నాయకత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటా నీలిమ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారెంటీ లను అమలు చేసి తీరుతామని అన్నారు. ప్రభుత్వం పని తీరుతో విసిగిపోయిన యువత కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రకటించారు. రెహమాన్ షరీఫ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి డాక్టర్ కోటా నీలిమ గారిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో మజర్, సోయాబ్, మహమ్మద్ రియాజ్, లోకేష్ తదితరులు ఉన్నారు.

## బీసీ ద్రోహిగా చరిత్రలో మిగలనున్న మోడీ

**మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్**



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వకపోతే ప్రధాని నరేంద్ర మోడీ బీసీ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ అన్నారు. బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం దోమలగూడ లోని బీసీ భవన్ లో బీసీల నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్ష కు మద్దతుగా మాజీ మంత్రి కాంగ్రెస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య, మధుసూదనా చారి, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టిన రోజును చారిత్రాత్మక రోజుగా జరుపుకుంటున్నారు కానీ ఈ దినం బీసీల కు దేశంలోనే పీడ దినం చీకటి రోజుగా మిగిలిపోతుంది అన్నారు. మహిళా బిల్లులో బీసీ సబ్ కోట ప్రవేశపెట్టాలని దాదాపు 26 రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళలకు సబ్ కోటా పెట్టకపోతే దొరలు పోయి దొరసానులు వస్తారన్నారు. బీసీ మహిళలు అసెంబ్లీలో అడుగు పెట్టొద్దా అని ప్రశ్నించారు. ఒక్క శాతం లేని వారు రాజ్యాలు వేలుతున్నారని బహుజనుల రాజ్యాధికారం ఏలే హక్కు లేదా అని ప్రశ్నించారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. బీసీలను నమ్మించి మోసం చేసిన ప్రధాని మోడీ కి వ్యతిరేకంగా లక్ష మందితో ఎర్రకోట ను ముట్టడిస్తామ న్నారు. ఈ కారక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు సిహెచ్ ఉపేంద్ర, బీసీ కులకు సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశాచారి, విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్, జాజుల లింగం, సిద్ధాంతం శ్యామల, మాధవి, సదానందం, శ్రీనివాస్ గౌడ్ బాలగోని బాలరాజు గౌడ్, శైలజ, రజనీ ,విజయ, వరికుప్పల మధు, నాగరాజు, ఇంద్రం రజక, మహేష్ పాల్గొన్నారు.



నగర బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ వై అమృత, సీనియర్ నాయకులు మధుసూదన్ యాదవ్, గోపి, బాబు, కిషోర్ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్ పేట



సికింద్రాబాద్ గణపతి ఆలయంలో గణపతి పూజ వేడుకల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మెన్ సత్యనారాయణ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్ పేట

## 33శాతం బీసీ ఎస్సీ ఎస్టీ ఓసి మహిళలకు సీట్లు కేటాయించాలి

- ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్

నవతెలంగాణ-ఓయూ

పార్లమెంటు ఉభయ సభల్లో 33శాతం మహిళలకు రిజర్వేషన్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని అయితే ఓబీసీ ఎస్సీ ఎస్టీ మహిళలకు 33 శాతంలో సబ్ కోటా కేటాయించకుండా ఆ బిల్లుకు అర్థం లేదని బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మెన్ ఉస్మానియా కాకతీయ విశ్వవిద్యాలయాల మాజీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ విమర్శించారు గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓబీసీ ఎస్సీ ఎస్టీ మహిళలకు సబ్ కోటా లేని చట్టం రావడానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీ అయితే రెండవ ముద్దాయి బీజేపీ అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు సబ్ కోటా ఆధారంగా బీసీ ఎస్సీ ఎస్టీ మహిళలకు సీట్లు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించాలని అప్పుడే మహిళా రాజకీయ సాధికారత సాధ్యమవుతుందని ఆ దిశగా అన్ని పార్టీలు స్వచ్ఛందంగా అమలు చేయాలని ఆయన కోరారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ అమృతవాణి నిలయంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ లోని పదిహేడు పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులతో సమావేశం జరిగింది. దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు అవుతున్నప్పటికి దళిత క్రైస్తవులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తెలంగాణలో రాబోవు సార్వత్రిక ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు క్రైస్తవులకు మూడు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులకు రాజకీయ అవకాశాలు కల్పించిన పార్టీలకే ఈసారి ఎన్నికలలో క్రైస్తవులు మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. త్వరలోనే అన్ని పార్లమెంటు నియోజకవర్గాలలో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లు నిర్వహించబోతున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసిఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయ రాజు, తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్లు టీడీఎస్‌మణి, వనితాఅలెగ్జాండర్, నియోజకవర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ నియోజకవర్గంలో 300 ఇండ్లు అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 300 మంది లబ్ధిదారులకు గురువారం మంత్రి కేటీఆర్ చేతుల మీదగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన పత్రాలను అందజేశారు. దుండిగల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. అంతకుముందు నందిత మంత్రి కేటీఆర్‌కు పుష పుష్పగుచ్ఛాలు అందజేసి మంత్రి కేటీఆర్ ఆశీర్వాదాలు తీసుకున్నారు ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పనిచేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని మాటల ప్రభుత్వం కాదన్నారు. అలాగే రానున్న ఎన్నికలలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో నుండి లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా లబ్ధిదారులను కేటీఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి. లాస్యనందిత, తదితరులు పాల్గొన్నారు. దుండిగల్ వేదికగా ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్ బోర్డు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, లోకనాథం, సీనియర్ నాయకులతో పాటు లబ్ధిదారులు తదితరులు తరలివచ్చారు.

## విప్లవాత్మక మార్పులకూ స్టార్ ఆస్పత్రి శ్రీకారం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఒక సంచలనాత్మక అభివృద్ధిలో, స్టార్ ఆస్పత్రిలోని వైద్యులు కాలేయ క్యాన్సర్‌కు చికిత్స చేయడానికి ఒక వినూత్న విధానాన్ని రూపొం దించారు. ప్రస్తుతం జరుగుతున్న మనుగడ రేటును కేవలం 0శాతం నుండి మెరుగైన వైద్య విధానానికి అనుగుణంగా 60-80శాతానికి పెంచారు. ఈ అద్భుతమైన విజయం ఈ కనికరంలేని అనారోగ్యంతో పోరాడుతున్న రోగులకు, ముఖ్యంగా క్యాన్సర్ సిరోటిక్ లివర్‌తో బాధపడేవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సిర్రోటిక్ లివర్‌లో క్యాన్సర్‌తో బాధపడుతున్న 55 ఏండ్ల రోగికి హైదరా బాద్‌లోని స్టార్ ఆస్పత్రిలోని వైద్యులు విజయవంతంగా ప్రక్రియ నిర్వహించారు. వినూత్న చికిత్సల ప్రక్రియ ద్వారా రోగి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధానంలో మార్పులు తీసుకురావడానికి సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యక్తులకు కొత్త ఆశను ఇచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు వారు తెలిపారు. హెపటైటిస్ సి వల్ల కలిగే లివర్ సిర్రోసిస్‌తో చాలా కాలం పాటు పోరాడుతున్న రోగికి దురదృష్టవశాత్తూ కాలేయ క్యాన్సర్ కూడా ఉన్నట్లు నిర్ధారణ అయిందనీ కణితి పరిమాణంలో బాగా పెరిగి పోర్టల్ సిరలోకి విస్తరించడం వల్ల తరచుగా అధిగమించలేని అడ్డంకిని ప్రదర్శిస్తుందన్ని చీఫ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ అండ్ హెపటోబిలియరీ సర్జన్ డాక్టర్ రాఘవేంద్ర బాబు మాట్లాడుతూ వివరించారు. కన్సల్టా మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ సాంప్రదాయిక కాలేయ మార్పిడి కోసం రోగి కాలేయ పరిస్థితికి సంక్లిష్టమైన కాలేయ మార్పిడిని ఏర్పాటు చేస్తారని, ఇమ్యునోథెరపీ పై చికిత్స అందించే ప్రక్రియ ఆరు చక్రాల తర్వాత,కణితి గణనీయంగా తగ్గి రోగి కాలేయ మార్పిడికి సానుకూలంగా ఉంటుందన్నారు. క్యాన్సర్ మహమ్మారి ఎంత తొందరగా పూర్తిగా నయమైనట్టే ఉంటుంది కానీ అంతకు పది రేట్లు స్ప్రెడ్ అవుతుందని రోగులు, వారి సహాయకులు కుటుంభకులు కచ్చితంగా గుర్తించుకోవాలని సూచించారు.

## ఎల్వీపీఇఐలో ఫాల్స్ ప్రివెన్షన్ ఎక్సీపీరియన్స్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఎల్వి ప్రసాద్ నేత్ర విద్య వైజ్ఞానిక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 18 నుంచి 22 ఫాల్స్ ప్రివెన్షన్ వారంగా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ అసోసియేట్ డైరెక్టర్ పేషెంట్ కేర్ డా"బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఇంట్లో వృద్ధులు పడిపోయే ప్రమాదాన్ని తగ్గించడానికి తీసుకోవలసిన భద్రతా చర్యలపట్ల అవగాహన పెంపొందించడానికి ఈ సదస్సు ఏర్పాటు చేయడంతో పాటు ఈ సెంటర్లను ప్రారంభించామని ఆయన తెలిపారు. 60 ఏండ్ల వయస్సు ఆపై వయస్సు ఉన్నవారికి ప్రాణహాని కలిగే విధంగా పడిపోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందనీ, తరచుగా తీవ్రమైన గాయాలవడం శరీరంలోని శక్తి సామర్థ్యాలు తగ్గిపోయి ఆరోగ్యం క్షీణించే పరిస్థితి ఏర్పడుతుందని, వారిని ఇబ్బందులకు గురి చేయకుండా సరైన విధానంలో ఎటువంటి ఒత్తిడి లేకుండా సమయానికి భోజన వసతి సదుపాయాలు కల్పించి ఉల్లాసవంతంగా చూసుకునే బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందని తెలియజేశారు. ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) వృద్ధుల ప్రత్యేక కంటి సంరక్షణ అవసరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఒక సమగ్ర నేత్ర సంరక్షణా సేవలను అందిస్తు హైదరాబాదులోని బంజారాహిల్స్ లోనీ ఎల్విపిఇఐ కల్లం అంజిరెడ్డి ప్రాంగణంలో ఒక ప్రత్యేక నేత్ర సంరక్షణా సౌకర్యం గ్లాండ్ ఫార్మా వారి ఆధ్వర్యంలో 'సెంటర్ ఫర్ ఎల్డర్లీ ఐ కేర్,'ఫాల్స్ ప్రివెన్షన్ ఎక్సీపీరియన్స్ సెంటర్' స్థాపించి ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రమాదాన్ని తగ్గించడానికి తీసుకోవలసిన భద్రతా చర్యలపట్ల అవగాహన పెంచడానికి ఈ సెంటర్లు ఉపయోగపడతాయన్నారు.

## నకిలీ అలోపతి వైద్యులు అరెస్ట్

నవతెలంగాణ-కంటోన్మెంట్

అలోపతి నకిలీ వైద్యు డిని అరెస్ట్ చేసిన ఘటన మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అనంతరం టాస్ ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మణ్‌రాజు ఆరు నెలల క్రితం కరీంనగర్ నుండి వచ్చి మారేడ్‌పల్లి గాంధీనగర్ ప్రాంతంలో రోగులకు మందులు ఇవ్వటమే కాకుండా వైద్యం కూడా చేస్తున్నాడు. అయితే అనుమానం వచ్చిన స్థానికులు ఫిర్యాదు చేయడంతో టాస్కఫోర్స్ పోలీసులు గురువారం నకిలీ వైద్యుడిని అదుపులో తీసుకొని మారేడ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. అతని వద్ద నుండి మందులు వైద్య పరికరాలు, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రారంభం

**1100 లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించిన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ**



నవతెలంగాణ-ఓయూ

మేడ్చల్ జిల్లా ప్రతాప సింగారంలో నిర్మించిన డబు ల్ బెడ్‌రూమ్‌ల సముదా యంలో 1100 మంది లబ్ది దారులకు ఇండ్లు మంజూరు ప్రక్రియలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎల్‌బీనగర్, అంబర్‌పెట్ నియోజకవర్గాలకు చెందిన వెయ్యి మందికి, స్థానిక కోటాలో వంద మందికి ఇండ్ల ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు చేపనట్లు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తో పాటు అంబర్ పెట్ ఎం ఎల్ ఏ కాలేరు వెంకటేష్, అధికారులు, నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్ లను పొందిన లబ్ధిదారులు సభా వేదిక ద్వారా ఆనందం వ్యక్తం చేసి,తమ కృతజ్ఞతలు తెలిపారు.

## ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి వెళ్తూ ఇద్దరు యువకుల మృతి



నవతెలంగాణ-ఓయూ

ఖైరతాబాద్ మహాగణపతి దర్శనం కోసం బయలుదేరిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన డివిజన్ పరిధిలో చో టు చేసుకుంది ఓ యూ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్‌కు చెందిన యశ్వంత్ (22) డిగ్రీ చదువుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన సాయిరామ్ (31) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరూ స్నేహితులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఖైరతాబాద్ గణపతిని దర్శించుకోవాలనే ఉద్దేశంతో యశ్వంత్, సాయిరామ్ స్పోర్ట్స్ బైక్‌పై బోడుప్పల్ నుంచి బయలుదేరారు. ఆడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై అతివేగంగా బైక్ నడిపి డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన యశ్వంత్ అక్కడికక్కడే మృ తిచెందగా, సాయి రామ్‌గాయాలతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్య లో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఉస్మానియా వర్సిటీ పోలీసులు దర్యాప్తుచేపట్టారు. మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## 'మాక్స్‌హెల్త్‌కేర్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్న ఐఐఎం కాశీపూర్'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రముఖ భారతీయ మేనేజ్ మెంట్ ఇన్స్టిట్యూట్ అయిన ఐఐ ఎం కాశీపూర్, ప్రముఖ హెల్త్‌కేర్ ఆర్గనైజేషన్ మ్యాక్స్ హెల్త్‌కేర్ లిమిటెడ్ తో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుందని ఐఐఎం కాశీపూర్ డైరెక్టర్ కుల భూషణ్ బలూనీ, మాక్స్ హెల్త్ కేర్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ హెచ్‌ఆర్ ఉమేష్ గుప్తా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో శిక్షణ పొందిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఆస్పత్రిలో మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌ను ఈఎంఓయులో భాగంగా ప్రారంభించనున్నారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో తొమ్మిది నెలల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ప్రత్యేకంగా ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజర్‌లకు ఆసుపత్రి కార్యకలాపాలలో వారి నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి, మెరుగుపరచడానికి అందిస్తుందన్నారు .రెండు సంస్థలు సంయుక్త పరిశోధనలు, సెమినార్లు, ఇతర విద్యా సంబంధ సహకారాలను చేయాలని నిర్ణయించుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం కాశీపూర్ డీన్, ప్రొఫెసర్ కునాల్ గంగూలీ పాల్గొన్నారు.

## అందరికి సొంతిండ్లు అందించడమే సీఎం కేసీఆర్ కల

**డిప్యూటీ మేయర్**



నవతెలంగాణ-ఓయూ

రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో భాగంగా గురువారం లాలాపేట్‌లో లబ్ధిదారులకు ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తార్నాక డివిజన్ లబ్ధిదారులను గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు సొంతింటి కలలను సాకారం చేసుకుంటూ పండుగ వాతావరణం లో పట్టాలు అందుకుంటున్నారని ఇండ్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లను జిహెచ్‌ఎంసి సిద్ధం చేసిందని అన్నారు. రెండో విడతలో భాగంగా గురువారం 13,300 లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తామని తెలిపారు.

### మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి

**డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి**

పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అమలులో కాలయాపన సరికాదని అన్నారు. దేశంలో ఏదైన చట్టం రూపొందించినపుడు దానిని అమలు చేయబోయే తేదీని స్పష్టంగా ప్రకటిస్తారని, కానీ మహిళా బిల్లులో ఆ తేదీని పేర్కొనకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ వైఖరి గమనిస్తే రానున్న జనాభా లెక్కల అనంతరం డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయ్యాకే రిజర్వేషన్ల అమలు చేసే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్లలో సామాజిక న్యాయం కూడా ఉండాలని, అప్పుడే అన్ని వర్గాల మహిళలకు రిజర్వేషన్ల ఫలితాలు అందుతాయని అన్నారు.

## బకాయిలు వెంటనే చెల్లించాలని హైకోర్టు తీర్పు




**విలేకరుల సమావేశంలో నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ వెల్లడి**

నవ తెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం టీపీటీకి ఉన్న బకాయిని వెంటనే చెల్లించాలి అని హైకోర్టు తీర్పు ఇచ్చిందని గురువారం కంటోన్మెంట్ బోర్డ్ నామినేట్ సభ్యుడు రామకృష్ణ వెల్లడించారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమయంలో మాట్లాడుతూ గతంలో 46కోట్లు బకాయి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే హైకోర్టు ద్వారా తెచ్చుకున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు ఉన్న 33 కోట్లు టీపీటీ బకాయిని వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఫర్ అనఉ 12శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది హైకోర్టు తీర్పు తీర్పులో ఉందని అన్నారు. బీఆర్ఎస్ మంత్రులు తలసాని, హరీష్‌రావు ఇద్దరు ప్రతినెల 10 కోట్లు చెల్లిస్తామని చెప్పి అప్పట్లో అగ్రిమెంట చేసుకున్నారని మంత్రులు ఇప్పటివరకు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుద్ధి తెచ్చుకొని కంటోన్మెంట్ బోర్డ్‌కు రావాల్సిన బకాయిలు ఇవ్వాలని కోరారు. అన్ని నియోజకవర్గాలకు 500 డబుల్ బెడ్రూంలో వస్తే కంటోన్మెంట్ మాత్రం కనీసం అందులో సగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కంటోన్మెంట్ కూడా జీహెచ్‌ఎంసీ కంటోన్మెంట్ ఒక్కటే మాత్రమే ఉందని, దీనిపై ఎందుకు వివక్షత అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ మహంకాళి జిల్లా స్పోక్స్‌మాన్ బిఎన్ శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

## నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌కు ఆసియావన్ డిప్లొమాటిక్ ఎక్సలెన్స్ అవార్డు

- తెలంగాణ, ఏపీలో రిపబ్లిక్ ఆఫ్ కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ కార్యక్రమం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆసియావన్ డిప్లొమాటిక్ ఎక్సలెన్స్ అవార్డు 2023' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరానికి భారత్, కజకిస్తాన్ మధ్య దౌత్య సంబంధాలను బలోపేతం చేయడానికి అలాగే సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించడంలోనూ ఎనలేని కృషి చేస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్‌గా ఉన్న హెచ్‌ఈ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌ను 'ఆసియావన్ డిప్లొమాటిక్ ఎక్సలెన్స్ అవార్డు 2023' అందుకున్నారు. కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి, ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బాఘేల్ చేతుల మీదగా న్యూ ఢిల్లీలోని వసంత్ కుంజ్, ది గ్రాండ్ హెూటల్ లో ఏషియన్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్ ను గురువారం అందజేసి ఈ కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి జీ, సామాజిక న్యాయం, సాధికారత రాష్ట్ర మంత్రి డాక్టర్ రాందాస్ అథవాలే, రక్షణ, పర్యాటక శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా, పనామా రాయబారి యాసియెల్ అలీన్స్ బురిల్లో రివెరా, తదితరులు హాజరయ్యారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

నాటి నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడటమే కాకుండా ఏడవనిజం పైన బాంబు దాడి చేసి పోరాట ఉధృత స్వభావాన్ని వ్యక్తపరిచిన తెలంగాణ దీశాలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణా ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని గోల్నాకలోని సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు తరాలను ముద్దాడిన మహెూన్నత వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు ఎనుగంటి నరేందర్, ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, కుందెన సత్యనారాయణ, గంగిశెట్టి సత్తయ్య, కోశాధికారి భీమనపల్లి అశోక్, కార్యదర్శి గందమల్ల శ్రీనివాస్, వనం రమణ, సలహాదారు నక్క రమేష్, ఆవుల రాములు, డివిజన్ అధ్యక్షులు పెద్ద బొమ్మ దామోదర్, గుర్రం శ్రీనివాస్, చంద్రశేఖర్, సురేందర్ ,చేనేత వర్గాల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్క దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లిలో ఇండ్లు పంపిణీ చేసిన మంత్రి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. డివిజన్‌లో రూ. 31 కోట్ల వ్యయంతో 360 యూనిట్ల ఇండ్లను బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బోంతు శ్రీదేవీ యాదవ్, జోనల్ కమిషనర్ పంకజ ,డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి , జీహెచ్ఎంసీ అధికారులు,సిబ్బంది,ఏజెన్సీ క్రైజన్ హెూమ్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు,డివిజన్ నాయకులు,ప్రజలు పాల్గొన్నారు..

# తెలంగాణ అమ్మాయి కావ్యకు ఫెలినా అవార్డ్



నవతెలంగాణ-కల్చరల్

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగిన నేషనల్ ఫెలీనా ఫ్యాషన్ బ్యూటీ ప్రజెంట్‌లో తెలంగాణ అమ్మాయి కావ్య తన శాస్త్రీయ నృత్యం, రాంప్ వాక్‌లతో పాటు న్యాయ నిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు తెలివిగా సమాధానాలు చెప్పి నేషనల్ మిస్ తెలంగాణగా విజేతగా నిలిచారు. సత్య కూచిపూడి కళా నిలయం డైరెక్టర్ లక్ష్మి వద్ద పదునెనిమిది సంవత్సరాలు నృత్యం లో శిక్షణ పొంది గురువులు పల్లవి, సమత, డాక్టర్ రాజ రాజేశ్వరి ల ప్రోత్సాహంతో కావ్య ఈ విజయం సాధించిందని ఆమె తల్లిదండ్రులు తెలిపారు

# గ్రేటర్‌లో 'డబుల్' ఇండ్ల పంపిణీ

- దుండిగల్‌లో 'డబుల్' ఇండ్ల పంపిణీ
- గ్రేటర్‌లో మొత్తం 13,300 'డబుల్' ఇండ్ల పంపిణీ
- పలు ప్రాంతాల్లో పాల్గొన్న మంత్రులు
- భారీ బందోబస్తు, ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు
- లబ్ధిదారులకు కార్డుల జారీ, క్షుణ్ణంగా తనిఖీ అనంతరం అనుమతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రస్తుతం ఇండ్లు రాని వారు ఏమాత్రం ఆందోళన చెందవద్దని... పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ఎలాంటి పక్షపాతంలేకుండా రాబోయే నెల నెలన్నర రోజుల్లో మరికొన్ని ఇండ్లను కేటాయిస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. గ్రేటర్ పరిధిలో తొమ్మిది ప్రాంతాలల్లో లబ్దిదారులకు గురువారం డబుల్‌బెడ్ రూం ఇండ్ల పట్టాలను అందించారు. పలు ప్రాంతాల్లో మంత్రులు పాల్గొని లబ్దిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని దుండిగల?లో కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్, కంటోన్మెంట్? నియోజకవర్గాలకు సంబంధించి 1,800 మందికి యాజమాన్య పత్రాలను మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు సంబంధించి దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్‌లలో కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన ఇండ్లకు సంబంధించి ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా నిష్పక్షపాతంగా అర్హులకు ఇండ్ల కేటాయింపు జరిగిందని తెలిపారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా అందరూ మనవారే అనే ఉద్దేశంతో ఆశ్రిత పక్షపాతం లేకుండా

గ్రేటర్ పరిధిలో మొత్తం తొమ్మిది ప్రాంతాలల్లో లబ్దిదారులకు గురువారం డబుల్‌బెడ్ రూం ఇండ్ల పట్టాలను అందించారు. తొలి విడతలో 11,700 ఇండ్ల పట్టాల పంపిణీ పూర్తి కాగా, రెండో విడతలో 13,300 లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. మొదటి విడతలో ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో ఇండ్లు దక్కని వారు కొందరు, స్థానికులకు ఇండ్లు ఇవ్వడం లేదని మరికొందరు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. పెద్దఎత్తు నిరసనలు, ఆందోళన మధ్య ఇండ్ల పంపిణీ చేయాల్సి వచ్చింది. దాంతో అప్రమత్తమైన అధికారులు రెండో విడతలో ఇండ్లను పంపిణి చేసే ప్రాంతాలల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా మూడు దశల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఆందోళన కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు చర్యలో భాగంగా లబ్ధిదారులకు ఐడీ కార్డులను అందజేశారు. మీడియాను సైతం పూర్తిగా చెక్‌చేసిన అనంతరం లోనికి అనుమతించారు. ఇదిలావుండగా రంగారెడ్డిజిల్లా మహేశ్వరం మండలం మన్సాన్ పల్లిలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించేందుకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెళ్తున్న సమయంలో కొందరు రోడ్డుపై బైఠాయించి మంత్రిని అడ్డుకున్నారు. స్థానికులకే డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలంటూ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు ఆందోళనకు దిగారు. మన్సాన్‌పల్లి చౌరస్తాలో ఆందోళనకు దిగడంతో పెద్దఎత్తున ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన పోలీసులు ఆందోళన చేస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో సభాస్థలికి దూరంలో రోడ్లపై నిరసనలు చేపట్టారు.

**నెల, నెలన్నరలో మిగితా ఇండ్ల పంపిణీ....**

గ్రేటర్ పరిధిలో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీకి బల్దియా ఏర్పాట్లు చేయగా, పలు ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇండ్ల పట్టాలను లబ్దిదారులకు అందజేశారు. రెండో విడతలో ఇండ్ల పంపిణీ చేసేందుకు మంత్రి కేటీఆర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లిలో తలసాని శ్రీనివాస్ యాదవ్, జవహర్‌నగర్‌లో చామకూర మల్లారెడ్డి, ప్రతాప్ సింగారంలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, సంగారెడ్డి జిల్లా కొల్లూరు 2లో మంత్రి హరీశ్ రావు, రంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లిలో సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం హతీగూడలో పట్నం మహేందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం తట్టి అన్నారంలో మహమూద్ అలీ, ఇబ్రహీంపట్నం తిమ్మాయిగూడలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పాల్గొని లబ్దిదారులకు ఇండ్ల పట్టాలు అందజేశారు. హైదరాబాద్‌లో కట్టిన లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లలో 30 వేల ఇండ్ల పంపిణీ నేటితో పూర్తవుతుందని మంత్రులు తెలిపారు. మిగిలిన 70 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా అత్యంత పారదర్శకంగా రాబోయే నెల, నెలన్నర కాలంలో పేదల చేతిలో పెడతామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇండ్లను కేటాయిస్తున్నామని మంత్రులు తెలిపారు.




# అంగన్‌వాడీ ఉద్యోగుల అక్రమ అరెస్టులను ఖండించండి

- సీఐటీయూ నగర సహాయ కార్యదర్శి మహేందర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా హైదరాబాద్‌లో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ ఉద్యోగులు ధర్నా చేపట్టగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. దీనిని నిరసిస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గోల్కొండ క్రాస్ రోడ్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) హైదరాబాద్ నగర సహాయ కార్యదర్శి టి.మహేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు సామరస్యంగా కలెక్టరేట్ ఆఫీస్ దగ్గర తమ డిమాండ్ల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తుంటే పోలీసులు అతి ఉత్సాహంతో అరెస్టు చేశారని తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీ టీచర్లు మహిళలనీ చూడకుండా అతి దారుణంగా ఈడ్చుకెళ్లడంతో వారికి గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఐసీడీఎస్ ప్రారంభించి 48ఏండ్లు అవుతున్న అంగన్ వాడీలను పర్మినెంట్ చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా ట్రేడ్ యూనియన్ యాక్ట్ 1962 చట్టం ప్రకారం 14 రోజుల ముందు సమ్మెలోకి వెళ్తున్నామని చెప్పినా.. అధికారులు మూర్ఖంగా ప్రవర్తించటం దుర్మార్గమన్నారు. రోజురోజుకు ధరలు పెరుగుతున్న అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్స్ సౌకర్యం ఉద్యోగ భద్రత చట్టబద్ధ సౌకర్యాలు ఏవి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఈశ్వరి, అనురాధ, జీవనేశ్వరి,లలిత, విజయ, స్వప్న, శారద, ధనమ్మ, సంధ్య, రాధిక, పుష్ప, సంధ్యతదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 22, 2023 | www.navatelangana.com

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లో ఉద్యమ నాయకుడు,మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్, యువ నాయకులు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ డివిజన్ ఓంశివా గంగా భవాని అసోసియేషన్ చైర్మన్ కాడబోయిన బాబురావు ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి మండపం వద్ద గురువారం శ్రీను ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వినాయకుడి విగ్రహానికి పూజలు చేశారు. ఎమ్మెల్యేను బాబురావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శంకర్, సాయి, కృష్ణ, రాజు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ కొండా శ్రీధర్‌రెడ్డి, ముచ్చుకుర్తి ప్రభాకర్, పరుశురామ్ యాదవ్, సుదీంద్ర, శ్రీనివాస్, శంకర్ తదితరులున్నారు.

## మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం

- బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అర్జున అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అర్జున అవార్డు గ్రహీత పుల్లెల గోపీచంద్ అన్నారు. గురువారం ఉస్మానియా వైద్య కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టులు, బాస్కెట్ బాల్ కోర్టు, వాలీబాల్ కోర్టు లను ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల ద్వారా విద్యార్థులు మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం కూడా మెరుగవుతుందన్నారు. 2023-24 సంవత్సరానికి చెందిన నూతన విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ శశికళ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఎంతో చరిత్ర కలిగిన ఉస్మానియా వైద్య కళాశాలలో సీటు సాధించినందుకు ఆమె విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయ, డాక్టర్ కిరణ్మయి, డిపార్ట్‌మెంట్ హెచ్ ఓ డి లు జానకి, పద్మిని, అభిజీత్ సుబేదార్, భవాని, పద్మావతి, అనిత, ఎంపిహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్, ఉపేందర్ రెడ్డి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## 'సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



- అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు జె.బి.రాజు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

మహాత్మా జ్యోతిరావుపూలే, అమ్మ సావిత్రిబాయి పూలే దంపతులు ప్రారంభించిన సత్యశోధక్ సమాజ్ 150వ ఆవిర్భావ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించటానికి ఈ నెల 23న బాగ్ లింగంపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు జె.బి.రాజు, సత్యశోధక్ సమాజ్ (ఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు బట్టి చెన్నయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆవిర్భవ మహోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులే దంపతులు 1848 నుండి 1873 వరకు 25 సంవత్సరాలు ఈ దేశంలో మొట్టమొదట ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీలకు విద్యను అందించడానికి విద్యా ఉద్యమం నడిపారని గుర్తు చేశారు. ఈ విద్యా ఉద్యమ చైతన్యాన్ని సంస్థాగత నిర్మాణంలోకి తేవడానికి సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను ప్రారంభించి, ఈ దేశ బహుజనుల సత్యవంతమైన స్వాతంత్ర ఉద్యమాన్ని నడిపారన్నారు. ఈ కార్యక్రమంలో బాంసెఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ కుమార్, సత్యశోధక్ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ బట్టు, బిబిఎం రాష్ట్ర అధ్యక్షులు వళిగి ప్రభాకర్, ఆర్ఎంఎం రాష్ట్ర అధ్యక్షులు ఖదీర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్, ఎవైఎస్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ సీఎఫ్ ఆర్డీ ఆధ్వర్యంలో ఎన్ఎ రీసెర్చ్ బేస్డ్ పెడగోగికల్ వర్క్‌షాప్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ సీఎఫ్ ఆర్డీ మంచి విద్య ఒక విద్యార్థి మంచి పౌరుడిగా ఎదగడానికి, సమాజాభివృద్ధికి దోహదపడేలా దిశానిర్దేశం చేసి బాటలు వేసే వెలుగు ఈ అంశం గురువారం ఉస్మానియా యూనివర్సిటీలో సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో "లైఫ్ సైన్స్ టీచర్స్ కోసం రీసెర్చ్ బేస్డ్ పెడగోగికల్ టూల్స్" అనే విష యం పై మూడు రోజుల వర్క్‌షాప్ ను ప్రారంభిం చారు.ఈ సందర్భంగా సెషన్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్, ఐటీ ఈ అండ్ సీ డైరెక్టర్, ప్రొ. ఈ. విద్యాసాగర్ పాల్గొని మాట్లా డుతూ. ఉపాధ్యాయులు పరిశోధన ఆధారిత బోధనా వ్యూ హాలు అమలు చేయడం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. యూట్యూబ్, కోర్సురా, మొదలైన బహుళ అభ్యాస వనరుల ఈ యుగంలో, ఉపాధ్యాయుని పని సృజనాత్మకత మరియు వనరులను పెంపొందించడానికి విద్యార్థికి బోధనా వ్యూహాలను ఆవిష్కరించడం కోసం ఉపయోగపడుతుంది అన్నారు. సెషన్‌కు గౌరవ అతిథి, ఓయూలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్, ప్రొ. సి వి రంజని, విద్యార్థి కెరీర్ లక్ష్యాల పట్ల లోతు మరియు అంకితభావం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడంలో ఇటువంటి వర్క్‌షాప్‌ల ప్రాముఖ్యతను ఉదహరించారు. కన్వీనర్ మరియు సి ఎఫ్ ఆర్డీ డైరెక్టర్, ప్రొ. సందీప్త బూర్గుల మా ట్లాడుతూ తమ బోధనా నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సాంకేతిక పరిణామాలను నిరంతరం నవీకరిం చాలని వారి బోధనా పద్ధతుల్లో వాటిని పొందుపరచాలని పిలుపునిచ్చారు. కెరీర్‌లో భాగంగా సైన్స్ రంగాన్ని ఎంచుకునేలా విద్యార్థులను ప్రేరేపించేందుకు ఇది చాలా కీలకమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని కళాశాలల నుండి పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## పేదలకు శాశ్వత ఆస్తిని అందిస్తున్న సీఎం కేసీఆర్



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

పేదలకు శాశ్వత ఇల్లును అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురువారం అంబర్ పేట మున్సిపల్ గ్రౌండ్‌లోని పలువురు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం రెండవ దశలో భాగంగా 500 మంది లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో పేదల పాలిట అత్యంత పెద్ద పెన్నిధిలాగా కేసీఆర్ మారారని, ఒక పక్కన ప్రజల సంక్షేమంతో పాటుగా ఇండ్లు లేని పేద వారికి సమాజంలో గౌరవం లభించేలా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా అందిస్తున్నారని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ద్వారా పేదలకు శాశ్వత ఆస్తిని అందిస్తున్న సీఎం కేసీఆర్ ఎప్పటికీ వారి గుండెల్లో నిలిచి ఉంటారని అన్నారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ, సీఎం కేసీఆర్ , ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.లబ్ధిదారులు మాట్లాడుతూ నిరుపేదల ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మించి ఇవ్వడం సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహకారం మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మొర శ్రీరాములు ముదిరాజ్, అడ్వకేట్ మధు, డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, ప్రవీణ్ ముదిరాజ్, అప్రోచ్ పటేల్, రంగు సతీష్ గౌడ్, శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి



- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ - ముషీరాబాద్

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి అని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, డాక్టర్ ఎన్ మారేష్ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, హాజరై మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం గత 76సంవత్సరాలుగా బి.సి లకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు కల్పించకుండా అన్యా యం చేస్తున్నారని తెలిపారు. పార్లమెంటు ప్రత్యేక సమా వేశాలలో మహిళా బిల్లు పెట్టాలని ప్రతిపాదించారు. మహిళా బిల్లులోబిసి/ఎస్‌సి/ఎస్‌టి మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్ధకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరా రు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిం చారు. బి.సి. మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు.ఈ ధర్నాలో జాతీయ కన్వీనర్ గుజకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు జబ్బుల శ్రీనివాస్, దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు బత్తుల వెంకటరమణ, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మలత, నీల వెంకటేష్, భూపేష్ సాగర్, రాజ్ కుమార్ వేముల రామకృష్ణ, బొల్లం మాధవి పాల్గొన్నారు.

## వయోభారాన్ని లెక్కచేయని నవ యువకుడు ఎమ్మెల్యే ముఠా గోపాల్

- అలుపనేదే లేకుండా కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు
- ప్రజల మనిషిగా చెరగని ముద్ర ఎమ్మెల్యే గోపాల్‌ది



నవతెలంగాణ - ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గాన్ని మును పెన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి కారణం తన వయోభారాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ నవ యువకుడి వలె నిత్యం ప్రజల్లో ఉంటూ కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్న నాయకుడు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దాదాపు 75 సంవత్సరాల వయసులో యువకులకు ఏ మాత్రం తీసిపోని రీతిలో నిత్యం ప్రజల మధ్య ఉంటూ స్వయంగా వారి సమస్యలను తెలుసుకుంటూ దాని పరిష్కారానికి ముందుండే నాయకుడు ప్రతిరోజు ఉదయాన్నే నియోజకవర్గంలో ఏదో ఒక బస్తీలో పర్యటిస్తూనే ఉంటారు. ప్రతి ఒక్కరినీ చిన్న పెద్ద తేడా లేకుండా అన్నా అని సంబోధిస్తూ ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని వారి గోసాలను వింటుంటారు. అందుకే తీవ్ర ఒత్తిడి పోటీ ఉన్న ముషీరాబాద్ టికెట్టు మరల ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేస్తున్న ముఠాగోపాల్నే వరించింది

### ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి

ముషీరాబాద్ నియోజకవర్గం గతంలో తీవ్ర సమస్యల తో దర్శనమిచ్చేది ప్రజా సమస్యలు తీవ్రస్థాయిలో ఉండేవి ముఠా గోపాల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి అభివృద్ధి అంటే ఏంటో స్పష్టంగా ప్రజలకు తెలుస్తుంది నియోజకవర్గంలో ప్రతి వీధిలో బస్తీలో సైతం వీడీసీసీ రోడ్లు, పెరుగుతున్న జనాభాకు అను గుణంగా నూతన డ్రైనేజీ పైపులైన్ పనులను ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ వేయిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా లోతట్టు ప్రాంతాలైన పద్మ కాలనీ నాగమయ్య కుంట అరుంధతి నగర్ కవాడిగూడ ప్రాంతాలలోని బస్తీలలో తేలికపాటి వర్షం వస్తేనే పూర్తిస్థాయిలో మోకాళ్ళ లోతు నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు ఈ సమస్యను శాశ్వత పరిష్కారం చేయడానికి కబ్జా కోరలో ఉన్న నాళాలను పూర్తిస్థాయిలో విస్తరణ గావించి ఎప్పటికప్పుడు నాలా పూడికతీత పనులు చేపడుతూ మురుగునీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు ఎమ్మెల్యే గోపాల్ అదే విధంగా హుస్సేన్ సాగర్ నాలా ప్రహరీ గోడ పనులు పటిష్టంగా చేపట్టి వరద ప్రవాహాన్ని అరికట్టడంలో విజయం సాధించారు. నియోజకవర్గంలో అత్యాధునిక హంగులతో ప్రభుత్వ ఆసుపత్రి విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ పాఠశాల ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు అందిస్తూ ప్రజా ప్రతినిధిగా వెలుగొందుతున్నారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ ముషీరాబాద్ లో పేదింటి పెద్దన్నగా నిలిచారు.

### స్టీల్ బిర్జి నిర్మాణంలో కీలక పాత్ర

దేశంలో ఎక్కడా లేనివిధంగా కనీవినీ ఎరుగని రీతిలో 450 కోట్ల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వి ఎస్ టి చౌరస్తా నుంచి ఇంద్ర పార్క్ వైపు నిర్మించిన స్టీల్ బ్రిడ్జి నిర్మాణంలో ఎమ్మెల్యే ముటాగోపాల్ కీలక పాత్ర వహించారు బ్రిడ్జి నిర్మాణంలో ఉన్న దాదాపు రెండున్నర సంవత్సరాలలో నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. విఎస్‌టీఆర్‌టీసీ క్రాస్‌రోడ్‌లో సినిమా థియేటర్లు ఉండడం వలన నిత్యం రద్దీగా ఉండి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడేది ఈ సమస్యను మంత్రి కేటీఆర్ గమనించి ట్రాఫిక్ కష్టాలను తొలగించడానికి ఎమ్మెల్యే ముటాగోపాల్ తో చర్చించి ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఒప్పించి 450 కోట్ల వ్యయంతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం దిగ్విజయంగా పూర్తి చేసి ప్రారంభించారు. కేవలం రెండున్నర సంవత్సరాలలోనే స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించి యావత్ దేశం హర్షించే విధంగా చేశారు. తన తోటి ఆప్తమిత్రుడు మాజీ కార్మిక శాఖ మంత్రి అయినటువంటి నాయిని నరసింహారెడ్డి పేరును స్టీల్ బ్రిడ్జి కి నామకరణం చేయడంలో ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించి తన ఆప్త మిత్రునికి ఘన నివాళులర్పించారు.

### ముఠాగోపాల్ కృషి ఎనలేనిది



ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆదర్శవంతమైన నియోజక వర్గంగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే ముటాగోపాల్ కృషి ఎన లేనిది అనునిత్యం ప్రజలతో ఉంటూ ప్రజల మనిషిగా వారి సమస్య లు పరిష్కరిస్తూ యువతకు మార్గదర్శకంగా నిలిచారు ఎమ్మెల్యే గోపాలనుమరోమారుగెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

**బల్లా శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షులు**

### గతంలో ఏ రాజకీయ పార్టీ నాయకుడు చేయలేని విధంగా అభివృద్ధి చేశారు

ముషీరాబాద్ బిఆర్ఎస్ కం చుకోట గతంలో ఏ రాజ కీయ పార్టీ నాయకుడు చేయ లేని విధంగా నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠా గోపాల్ హ యాంలో అభివృద్ధి చెందింది ప్రతి బస్తీలో వీడి సిసి రోడ్లు నిర్మించారు.నూతన హాస్పటల్, పాఠశాల నిర్మాణ దశలో ఉన్నాయని, అవి పూర్తయి ప్రతి పేద వారికివిద్య అందుతుంది.



**మోజెస్ : బిఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు**

### లోతట్టు ప్రాంతాలను అత్యధిక నిధులతో నాలా ప్రహరీ నిర్మాణం



నియోజకవర్గంలో గతంలో లోతట్టు ప్రాం తాలు వర్షాలు సంభవిస్తే ప్రజల ఇబ్బందులు వర్ణ నానిహితం ముషీరాబాద్ డివి జన్ లోతట్టు ప్రాం తాలను అత్యధిక నిధులతో నాలా ప్రహరీ గోడ నిర్మించి వరద నీరు ఇండ్లలోకి చేరకుండా చేశారు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందుకు స్థానిక ప్రజలు కృతజ్ఞతగా ఉన్నారు.

**నర్సింగ్ ప్రసాద్ , బిఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు**

### నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దారు



ఎమ్మెల్యే ముఠా గోపాల్ నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజక వర్గంగా తీర్చి దిద్దారు యువతకు పదవులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తున్నారు ఎమ్మెల్యే గోపాల్ వెంట నియోజకవర్గం లోని యువత ఉంటూ చురుగ్గా రాజకీయాల్లోకి వస్తున్నారు రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ముషీరాబాద్ ను మరల కైవసం చేసుకుంటాం.


**రాకేష్ కుమార్ : బిఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు**

### కవాడి గూడ డివిజన్‌లో సమస్యలకు పరిష్కారం



ముటాగోపాల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి కవాడిగూడ డివిజన్‌లో సమస్యలు కరువయ్యాయి. హుస్సేన్ సాగర్ నాలా ప్రహరీ గోడ నిర్మాణ దశలో ఉంది అది పూర్తయితే ఎంతటి భారీ వర్షం వచ్చినా వరద నీరు ఇండ్లలోకి ప్రవేశించలేదు.

**వల్లాల శ్యామ్ యాదవ్, బిఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షులు**



గోల్నాక డివిజన్ పరిధిలోని తిరుమల నగర్‌లో వెంకటాద్రి హైట్స్‌లో ఏర్పాటుచేసిన గణపతి పూజా వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలినేని రామ్మోహన్ రావు, రాజ్ కుమార్ దంపతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

## జనసేన తీర్థం పుచ్చుకోనున్న చిన్నయ్య దొర



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిలర్స్ ఛాంబర్స్ మాజీ అధ్యక్షులు, జై భారత్ నేషనల్ పార్టీ జాతీయ అధ్యక్షులు గోరకపూడి చిన్నయ్య దొర త్వరలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరనున్నారు.గురువారం బషీర్ బాగ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిన్నయ్య దొర మట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనలకు, ఆశయాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరబోతున్నట్లు ఆయన చెప్పారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిని పక్కన బెట్టి కేవలం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదన్నారు. అరచేతిని అడ్డుపెట్టుకొని సూర్యకాంతిని ఎవరు ఆపలేరని హితవు పలికారు. అలాగే ఏపిలో ఎంత మంది వైసీపీ నాయకులు అడ్డు వచ్చిన పవన్ విజయాన్ని ఎవరు ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. జనసేన పార్టీలో పవన్ కళ్యాణ్ తనకు ఇచ్చిన బాధ్యతలను ఉభయ తెలుగు రాష్ట్రాలలో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి చిత్తశుద్ధితో పని చేస్తానని చిన్నయ్య దొర ఈ సందర్భంగా తెలిపారు.

## 'తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ కారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి గురువారం ట్యాంక్ బండ్ వద్ద గల జలదృశ్యంలోని ఆయన విగ్రహం ఎదుట ఘనంగా నిర్వహించారు.బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాను సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్ రావు, సభ్యుడు కిషోర్ గౌడ్, గల్ఫ్ తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రుద్ర శంకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తదితరులు పాల్గొని, ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళలు అర్పించారు. కృష్ణమోహన్‌రావు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం బాపూజీ సేవలను గుర్తించి ప్రతి ఏడాది జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికార పూర్వకంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు.అనంతరం విమలక్క, పాశం యాదగిరిలు మాట్లాడుతూ తెలంగాణ కోసం, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు.

## నేటి యువత గురజాడ అప్పారావు అడుగుజాడల్లో నడవాలి

- 100 పాఠశాలల్లో ఘనంగా గురజాడ జయంతి ఉత్సవాలు
- తెలంగాణ బాలోత్సవం అధ్యక్ష కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు ఎన్ సోమయ్య



నవతెలంగాణ - ముషీరాబాద్

నేటి యువత గురజాడ అప్పారావు అడుగుజాడల్లో నడవాలి అని తెలంగాణ బాలోత్సవం అధ్యక్ష కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్ సోమయ్య అన్నారు. గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు 100 పాఠశాలలో ఘనంగా జరిగాయి అందులో భాగంగా రామ్ నగర్ లోని మాతృశ్రీ పాఠశాలలో విద్యార్థులచే గీతాలాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి భూపతి వెంకటేశ్వర్లు, ఎస్ సోమయ్య హాజరై గురజాడ అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ ఆనాటి సమాజాన్ని గురజాడ అప్పారావు ఉన్నదు న్నట్లుగా చూసాడని చూసిందాన్ని చూసినట్లు చెప్పాడు. అని అసలు దేశమంటే ఏంది. ప్రశ్న వేసుకుని "దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు" అని ఏమాత్రం తడబడకుండా తిండి కలిగితే కండకలదోయ్ కండకలవాడేను మనిషోయ్ అని ఒక జీవశాస్త్రవేత్త చెప్పినట్లు చెబుతాడని తెలిపారు. మన గురుజాడ అడుగుజాడల్లో నడవాలని తెలంగాణ బాలోత్సవం విజ్ఞప్తి చేసింది. ప్రతి విద్యాలయాల్లో ఉదయమే ప్రార్థన సమయంలో గురజాడ రాసిన దేశమున ప్రేమించుమన్నా గేయం సామూహికంగా విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి పాడుదాం దేశ సమైక్యత చాటుకుందాం మహనీయులను మననం చేద్దామని పిలుపునిచ్చారు.

## యువత సమాజాభివృద్ధికి నడుం బిగించాలి

- నేరపూరిత చర్యల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
- సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మాదకద్రవ్యాలను విడనాడి సమాజాభివృద్ధికి యువత నడుం బిగించాలని సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు యువతకు సూచించారు. భగత్ సింగ్ 116వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం 'మాధక ద్రవ్యాలను నిర్మూలిద్దాం' పేరిట రూపొందించిన వాల్ పోస్టర్ ను డీసీపీ సమక్షంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. సామాజిక అంశాలపై విద్యార్థులు, యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచిం చారు. తద్వారా నేరపూరిత అలవాట్లకు దూరం కావచ్చు న్నారు. గంజాయి, కొకైన్ తదితర నిషేధిత డ్రగ్స్ కు 15 నుండి 25 సంవత్సరాలలోపు విద్యార్థులు ఆకర్షితులు అవుతున్నారని, ఈ విధానాలు రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కల్గిస్తాయన్నారు.సమాజ మార్పు కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతను చైతన్య పరుస్తున్న ఏఐవైఎఫ్ బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మహమూద్, ఆఫీస్ బేరర్స్ మజీద్, కళ్యాణ్, సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

- కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని అందుకు అధికారులు కాంట్రాక్టర్ దృష్టి సారించాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఆకాష్ నగర్‌లో పర్యటించి నూతన డ్రయినేజ్ పైప్ లైన్ పనులను కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తీ ప్రజలతో కలిసి పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందితో మాట్లాడుతూ స్థానికంగా డ్రైనేజీ సమస్య రాకుండా ఉండేవిధంగా పనులను చేయాలని, సమస్య తీవ్రంగా ఉండడంతో 12 ఇంచ్ లైన్ వేయడం జరుగుతుందని, తద్వా రా సమస్య పరిష్కారం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్, ముబాషీర్,రంగు ఉదయ్ కిరణ్ గౌడ్, జమీల్, సద్దాం, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.




## వీటితో అనారోగ్యాలకు చెక్

**మన వంటగదిలో సులభంగా దొరికే పదార్థాలు న్యాచురల్ యాంటీబయాటిక్‌గా పనిచేస్తాయని పోషకాహార నిపుణులు అంటున్నారు. ఈ పదార్థాలు మనలోని ఇమ్యూనిటీని బూస్ట్ చేయడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. ఇవి మిమ్మల్ని ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంచుతాయి. అవేంటో చూద్దాం...**

**వెల్లుల్లి** : ఇవి వంటకు మంచి రుచిని ఇవ్వడం మాత్రమే కాకుండా.. దీనిలోని శక్తివంతమైన ఔషధ గుణాలు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వెల్లుల్లిలో అలిసిన్ అనే శక్తివంతమైన యాంటీమైక్రోబయల్ సమ్మేళనం ఉంది. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. రోజూ వారి ఆహారంలో వెల్లుల్లి చేర్చుకుంటే.. అనారోగ్యాలతో సమర్థవంతంగా పోరాడవచ్చు.

**అల్లం** : ఇందులోని ఘాటైన సుగంధ తైలాలు జీర్ణ వ్యవస్థకు వచ్చే ఇబ్బందులని తగ్గిస్తాయి. అల్లానికి రక్తంలో కొవ్వుని తగ్గించే గుణాలు ఉన్నాయి. ఇందులో ఉండే ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులు, వాపులు తగ్గించడంలో చాలా బాగా ఉపయోగ పడతాయి. టేబుల్ స్పూన్ తేనెలో కొన్ని అల్లం రసం చుక్కల్ని కలుపుకోని తాగితే ఇమ్యూనిటీ బూస్ట్ అవుతుంది.

**బొప్పాయి** : బొప్పాయిలో బోలెడన్ని విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉంటాయి. దీనిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియ సాఫీగా జరగడానికి ఉపయోగపడుతుంది. ఈ పండులో ఉండే కెరోటినాయిడ్లూ, ఫైబర్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

**గుమ్మడి గింజలు** : ఈ చిన్న గింజల్లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పరాన్నజీవులతో పోరాడగలికే.. శక్తివంతమైన అమైనో యాసిడ్స్ ఉంటాయి. వీటిల్లో విటమిన్ కె, ఫాస్ఫరస్, మాంగనీస్, మెగ్నీషియం, ఐరన్, జింక్, రాగి దండిగా ఉంటాయి. వీటిలోని కెరొటినాయిడ్లు, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ దుష్ప్రభావాల నుంచి మనల్ని రక్షిస్తాయి.

**కొబ్బరికాయ** : కొబ్బరిలో మీడియం చైన్ ఫ్యాటీ యాసిడ్‌లు ఉంటాయి. ఇవి పరాన్నజీవులతో పోరాడతాయి. పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి, ఇన్‌ఫెక్షన్‌లకు వ్యతిరేకంగా పోరాడతాయి. వంట కోసం కొబ్బరి నూనెను ఉపయోగించండి, హైడ్రేషన్ కోసం కొబ్బరి నీటిని ఆస్వాదించండి, మీ వంటలలో తాజా కొబ్బరిని ఆస్వాదించండి.

**పసుపు** : వంటకాల్లో పసుపు వేస్తాం. ఇది వాటికి రంగూ, రుచిని అందిస్తుంది. దీనిలో యాంటీబ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీవైరల్ గుణాలుం టాయి. దీంట్లోని యాంటీఆక్సిడెంట్లు జబ్బుల బారిన పడ కుండా చేస్తాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. పాలలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే.. అనారోగ్యాల నుంచి రక్షిస్తుంది.

**ఇంటిని తీర్చిదిద్దడంతో పాటు సమాజాన్ని ఆర్థికంగా, సాంస్కృతికంగా బలపరచడంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనది. మహిళల మేధోపరమైన భాగస్వామ్యం లేనిదే ఏ దేశమూ, ఏ జాతీ ముందడుగు వేయలేదు. నేడు అన్ని రంగాల్లో ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో మహిళలు సమర్థతతో, సమయస్ఫూర్తితో అగ్రగామిగా నిలుస్తున్నారు. అటువంటి క్రియాశీలక మహిళల్లో ఒకరు లేబూరి శారద. సుగంధ ద్రవాలను పండించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చేస్తున్న ఆమె గురించి మరిన్ని వివరాలు...**

# రైతులకు ఆమె ఆపన్న హస్తం



ముప్పై రెండేండ్లకే భర్తను కోల్పోయారు శారద. అయినా గుండె దిటవు చేసుకుని, పిల్లలిద్దరినీ చదివించి ప్రయోజకుల్ని చేసారు. తాను చదువుకున్న వ్యవసాయ విజ్ఞాన శాస్త్రాన్ని సద్వినియోగ పరుచుకుని తోటి మహిళలకు నూతన సేద్యపు పద్ధతులను వివరిస్తున్నారు. వారికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. అంతేకాదు ఫ్రాన్స్‌లో ఉన్నత చదువు చదువుకుని సహజ సుగంధ ద్రవ్య వినియోగాన్ని తిరిగి అమలుల్లోకి తేవాలనే ఆశతో L' ESPERANZAU అనే సంస్థను ప్రారంభించారు. మన దేశంలో యుగయుగాలుగా ప్రజల జీవనశైలిలో ఒక అంతర్భాగంగా విలసిల్లిన సహజ సుగంధ తైలపు వాడకాన్ని తిరిగి అమలులోకి తెచ్చి ప్రజలకు అవి ఉపయోగపడేలా చేయాలనే ఆమె ఈ కంపెనీ ప్రారంభించారు. భారత కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో 2017లో దీన్ని స్థాపించారు. ఆమె ఆశించిన విధంగానే ప్రజలు కూడా దీన్ని స్వాగతించారు.

### నిర్విరామ కృషితో...

ఈ L' ESPERANZAU నేచురల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కుటుంబ యాజమాన్యంలోని సంస్థ. వీరు వినియోగదారులకు ఉత్తమమైన ఉత్పత్తులను ఇవ్వడానికి కృషి చేస్తున్నారు. విస్తారమైన అంతర్జాతీయ వ్యవసాయ, వ్యాపార అనుభవం కలిగి ఉన్న ఉత్సాహవంతులైన, నిబద్ధత కలిగిన వ్యవసాయ పట్టభద్రుల సమూహం ఇది. సుగంధ ద్రవ్యాల మొక్కల కోసం విత్తనాలు నాటడం, సేద్యం చేయడం, పంట చేతికొచ్చాక నూనెతీయడం, ప్యాకెట్లు చేసి చివరికి ఉత్పత్తులను హోల్సేల్, రిటైల్ షాపులకివ్వడం దీని పని. ఈ సంస్థ చేస్తున్న నిర్విరామ కృషితో పంట పండించే రైతులకు గొప్ప ఆత్మ విశ్వాసం కలుగుతోంది. వినియోగదారులు ప్రకృతి అందించే సుగంధ ద్రవ్యాలను సక్రమంగా ఉపయోగించుకోవడంలో అవగాహన కల్పిస్తున్నది.

### జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ...


లెస్పరేంజా నేచురల్ ఆయిల్స్ సంస్థ స్వచ్ఛమైన, అత్యవసర నూనెలను (వంంవత్‌ఋశ్రీ శీఱశ్రీం) ఉత్పత్తి చేసే సంస్థల్లో కెల్లా ప్రామాణిక మైనది. ఈ సంస్థ తయారుచేయించే సుగంధ తైలం నాణ్యతలో పేరెన్నిక గన్నది. ఈ సంస్థ అందించే సువాసనాభరిత నూనెలు ప్రజలకు మానసికోల్లాసాన్ని, మంచి ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన శారద తన సంస్థ ద్వారా రైతులకు ఎంతో సేవ చేస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తులను పండించేలా అన్నదాతలకు ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. తద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నారు.

### సంస్థ చేసే పనులు

నిమ్మగడ్డి, పామ్రోజ్, జాస్మిన్, యూకలిప్టస్ వంటి సుగంధ తైలాల సహజ సేంద్రీయ వ్యవసాయం చెయ్యడం మొదలుకొని ఆ మొక్కల నుంచి స్వచ్ఛమైన, సహజమైన, అత్యంత ఆవశ్యక సుగంధ తైలాలను తియ్యడం వరకు అన్ని దశల్లోనూ సన్నకారు రైతులకు సహాయ సహకారాలందిస్తుంది. అలాగే దేశ వ్యాప్తంగా ఔత్సాహికులు ముఖ్యంగా మహిళారైతులను ఆహ్వానించి, వారికి ఆధునిక సహజ సేంద్రీయ పద్ధతుల్లో, లాభసాటి వ్యాపార విధానాల్లో శిక్షణనిచ్చి, వారు స్వయంప్రతిపత్తిని సాధించేలా కృషి చేస్తున్నారు. దీని కోసం వి హబ్ వారి సహాయసహకారాలు తీసుకుంటున్నారు. సుగంధ తైలాలను ఉపయోగించి వివిధ వస్తువులను అంటే ఉదాహరణకు సబ్బులు, సెంట్లు, తలనూనెలు, షాంపూలు తయారు చేయడంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

### రైతులను ఎంపిక చేసి

ప్రస్తుతం ఈ సంస్థ ఇరవై ఐదు రకాల తైలాలను, పది రకాల కెరీర్ ఆయిల్‌ను, ఐదు రకాల సబ్బులను, మూడు రకాల ఉద్యానవన జలాలను, మూడు రకాల స్నానపు ఉప్పు కణికలనూ తయారుచేస్తోంది. ఈ సుగంధ తైలాల ఆధారంగా ప్రీమియమ్ ఎఫ్.ఎమ్.సి గుడ్స్ మొదలుపెట్టి ఉత్పత్తులను పెంపొందించే ఆలోచన చేస్తోంది. కొంతమంది రైతులను ఎంపిక చేసుకుని వారు ఆరువందల ఎకరాల్లో పండించే సుగంధ ద్రవ్యాలను కొనే పద్ధతిలో పండిస్తోంది. అంతేకాకుండా భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలతో 'అవగాహన జ్ఞాపిక' (మెమొరీ ఆఫ్ అండర్ స్టాండింగ్)ను ఏర్పరచుకొని, భవిష్యత్తులో తమ ఉత్పత్తుల ఎగుమతుల గురించి కూడా ప్రణాళికలు వేస్తోంది.



### వ్యాపార విజయాలు

జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సత్సంబంధాలు నెరపుతూ మంచి గుర్తింపును పొందుతున్నారు. ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, గూగుల్ మొదలైన సమాచార సాధనాల ద్వారా తమ సుగంధ తైలాల క్రయ విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఆర్గానిక్ దుకాణాల్లో వీరి ఉత్పత్తులు మనకు కనిపిస్తాయి. వీరి సుగంధ తైలాలు చర్మ జుట్టు సమస్యలు, కండరాల నొప్పులు, నిద్రలేమి, మానసిక ఒత్తిడుల వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ప్రజలకు ఇన్ని రకాల ప్రయోజనాలు అందిస్తున్న ఈ సంస్థకు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందాయి.

\- ఆకొండి (ముద్దు) వెంకటలక్ష్మి



## ఇదేనా సనాతన ధర్మం?

(మొదటిపేజీ తరువాయి)

తమిళనాడు నుంచి అధీనం పొందారు. కానీ ఆమె(రాష్ట్రపతి) వితంతువు, గిరిజన వర్గానికి చెందినందున ఆహ్వానించలేదు. ఇదేనా సనాతన ధర్మం?" అని ఉదయనిధి స్టాలిన్ ప్రశ్నించారు. దీనికి వ్యతిరేకంగా తాము గొంతెత్తుతామని అన్నారు.

కొత్త పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన బంగారు పూత పూసిన వెండి భూతమైన సెంగోల్‌ను తీసుకువెళ్లిన 21 మంది హిందూ పూజారుల (తమిళనాడుకు చెందిన అధీనం) సమక్షంలో పార్లమెంట్ భవనం ప్రారంభించబడిన విషయం విదితమే. ఆ సమయంలో ద్రౌపది ముర్మును ఆహ్వానించకపోవటం పట్ల విపక్షాలు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి.

కొత్త పార్లమెంట్‌లో మొదటి సెషన్ జరిగిన రోజు (బుధవారం) పార్లమెంటును సందర్శించిన కంగనా రనౌత్, ఈషా గుప్తాలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రపతికి ఆహ్వానం అందలేదు కానీ ,కొంతమంది హిందీ నటులు కొత్త పార్లమెంటుకు ఆహ్వానించబడ్డారని ఉదయనిధి చెప్పారు. "నిన్న కూడా, వారు(బీజేపీ) బిల్లు ప్రవేశానికి సినీ నటీమణులను ఆహ్వానించారు. కానీ రాష్ట్రపతిని కాదు. అందరూ సమానంగా ఉండాలని మేము సూచిస్తున్నాం. కాబట్టి, సనాతనను నిర్మూలించడమే మా లక్ష్యం" అని ఉదయనిధి నొక్కిచెప్పారు. ఈ విషయంలో డీఎంకే వైఖరికి గల కారణాలనూ ఆయన వెల్లడించారు. నా చావుకు పిలుపునిచ్చి, నా తలపై వెల ప్రకటించే పూజారుల వల్ల తాను భయపడను అని కూడా ఆయన చెప్పాడు.

సనాతన ధర్మం డెంగ్యూ, మలేరియా లాంటిదనీ, దానిని నిర్మూలించాల్సినవసరం ఉన్నదని ఆయన గతంలో చేసిన ప్రకటనల తర్వాత, ఉదయనిధికి బెదిరింపులు వచ్చాయి. ముఖ్యంగా అయోధ్య పీఠాధిపతి పరమహంస ఆచార్య ఉదయనిధి తల నరికివేస్తే రూ. 10 కోట్ల రూపాయల రివార్డును సైతం ప్రకటించారు. ఉదయనిధి వ్యాఖ్యలపై ప్రధాని మోడీ సహా, బీజేపీ నేతలు, హిందూత్వ గ్రూపుల నాయకుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది.

## రైల్వే కూలీగా రాహుల్

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌లో హల్‌చల్ చేశారు. సామాన్లు మోసే రైల్వే కూలీలను కలుసుకున్నారు. కాసేపు వారిలాగే రైల్వే కూలీగా అవతారం ఎత్తారు. ఎర్ర షర్టు ధరించి, చేతికి బ్యాడ్జితో తలపై లగేజీని ఎత్తుకొని ముందుకు కదిలారు. ఈ సందర్భంగా రైల్వే కూలీలు, కార్మికులు, ఆయనను చుట్టుముట్టారు. "రాహుల్ గాంధీ జిందాబాద్" నినాదాలతో ఆయనతో పాటు ముందుకు కదిలారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

"ఈ రోజు(గురువారం) ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌లో ప్రజా నాయకుడు రాహుల్ గాంధీ లగేజీని మోసే కూలీల(పోర్టర్‌లు)ను కలిశారు. ఇటీవల రైల్వే స్టేషన్‌లోని పోర్టర్లు రాహుల్‌ను కలవాలని కోరుకున్న వీడియో వైరల్‌గా మారింది. ఈరోజు రాహుల్ అక్కడికి చేరుకుని వారి మాటలు విన్నారు. భారత్ జోడో ప్రయాణం కొనసాగుతుంది" అని పార్టీ 'ఎక్స్'లో స్పష్టం చేసింది.రాహుల్ కూలీగా మారి లగేజీని మోస్తున్న వీడియోను కాంగ్రెస్, ఆ పార్టీ అభిమానులు, మద్దతుదారులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న పోస్టులు కనిపించాయి. గతంలోనూ ఆయన బైక్ మెకానిక్‌లు, లారీ డ్రైవర్లు, రైతులు, ఇతర రంగాల కూలీలు, కార్మికులను కలిసి ఇలాగే బాధలను పంచుకున్నారని గుర్తు చేసుకున్నారు.

## డీఎస్సీ సిలబస్ మార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) సిలబస్‌లో ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు డీఎస్సీ సిలబస్‌ను గురువారం విడుదల చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టులకు సంబంధించిన సిలబస్‌లో మార్పులు చేశారు.

**ఉపాధ్యాయ పోస్టులను పెంచాలి : రామ్మోహన్‌రెడ్డి**

ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలా జిల్లాల్లో రోస్టర్‌వారీగా పోస్టులను చూస్తే సున్నాలున్నాయనీ, దీంతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యే ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీలో కలపాలని కోరారు. డీఎస్సీ రాతపరీక్షలను నవంబర్‌లో కాకుండా వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## కలిసే పోటీచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత అమలు చేయడమంటే ఎన్నికల్లో లబ్ధికోసమేనని వ్యాఖ్యానించారు. మహిళలను ఉద్ధరించే ఉద్దేశం మోడీ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. మహిళా బిల్లులో ఓబీసీ కోటా ఉండాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం మూడో ఫ్రంట్ ఆలోచన అంతా బీజేపీ కోసమేనని విమర్శించారు. వివిధ రాష్ట్రాల్లో ఆ పార్టీ కావాలనే పోటీ చేసి ఓట్లను చీల్చిందన్నారు.

బీజేపీకి సహకరించేలా సీఎం కేసీఆర్ ఆలోచన ఉందని చెప్పారు. గతంలో కేసీఆర్ కలిసిన నేతలందరూ ఇండియా కూటమిలో ఉన్నారని గుర్తు చేశారు. కానీ ఆయన మాత్రం ఇండియా లేదా ఎన్డీఏ కూటమిలో చేరకుండా పరోక్షంగా బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారని అన్నారు. తాము మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి కోసమే పనిచేస్తామని చెప్పారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలు ఐక్యంగా ఉండాలని అన్నారు. సీపీఐ, సీపీఐ(ఎం) ఎన్నికల్లోనే కాదు, ప్రజా సమస్యలపైనా కలిసే పోరాటం చేస్తాయని వివరించారు.

**కాంగ్రెస్‌తో పొత్తు అంశం చర్చకు రాలేదు : కూనంనేని**

తమ భేటీలో కాంగ్రెస్‌తో పొత్తు అంశం చర్చకు రాలేదని కూనంనేని చెప్పారు. అయితే ఆ పార్టీతో తాము పొత్తు వద్దనుకోవడం లేదని స్పష్టం చేశారు. వామపక్షాలకు కాంగ్రెస్ సీట్లు ఇస్తుందంటూ ఊహాగానాలు వద్దనీ, కలిసి మాట్లాడినప్పుడు ఆ అంశం చర్చకు వస్తుందన్నారు. ప్రస్తుతానికి వచ్చే ఎన్నికల్లో సీపీఐ, సీపీఐ(ఎం) కలిసే పోటీ చేస్తాయనీ, సీట్ల విషయంలో వచ్చేనెల ఒకటిన మరోసారి చర్చించి ఉమ్మడి అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. అంగన్‌వాడీ కార్మికులపై పోలీసులు దాడి చేయడం సరైంది కాదన్నారు. సమ్మె చేస్తే కొడతారా?అని ప్రశ్నించారు. సమ్మె చేస్తే ఉద్యోగంలోకి తీసుకోబోమంటూ ప్రభుత్వం చెప్పడం దారుణమని అన్నారు. ఉద్యమాల ద్వారా ఏర్పడిన తెలంగాణలో ఉద్యమాలు చేస్తున్న వారిని అణచివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంఐఎంతో కేసీఆర్‌కు మంచి సఖ్యత ఉందన్నారు. సమైక్యతా దినోత్సవమంటే ఏమిటో ఎంఐఎం నేతలు, కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. థర్డ్ ఫ్రంట్ పెట్టాలంటూ కేసీఆర్ ఆ పార్టీని అడుగుతున్నారని చెప్పారు. అందరి మీద దాడులు చేసే బీజేపీ ప్రభుత్వం ఎంఐఎం మీద ఒక్క కేసూ ఎందుకు పెట్టడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేయడంలో బీజేపీ ఆరితేరిందని విమర్శించారు. జనాలను మభ్యపెట్టడానికే మహిళా బిల్లును తెచ్చిందన్నారు. రాష్ట్రపతి వితంతువు కావడం వల్లే కొత్త పార్లమెంట్‌ను ఆమెతో ప్రారంభించలేదని చెప్పారు. రాజ్యాంగ పీఠిక గుండెకాయలాంటిదని అన్నారు. అందులో నుంచి సామ్యవాదం, లౌకికవాదం పదాలను ఎలా తొలగిస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. హిందూరాజ్యంగా చేయడం కోసమే బీజేపీ ఇలాంటివి చేస్తున్నదని విమర్శించారు. ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. బీజేపీ కూటమి వచ్చే ఎన్నికల్లో ఓటమి పాలవుతుందని చెప్పారు.

## దక్షిణాదికి ఇబ్బందే !

(మొదటిపేజీ తరువాయి)

మార్పులు చోటుచేసుకుంటాయి. 2002లో చేసిన రాజ్యాం గ సవరణ ద్వారా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను 2026 వరకూ నిలిపివేశారు. అప్పటికి దేశవ్యాప్తంగా జనాభా పెరుగుదల సమానంగా ఉంటుందని అంచనా వేశారు. కానీ..'మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాలలో దశ వార్షిక (2011-2021) జనాభా వృద్ధి రేటు 12-15% మధ్య ఉంది. అదే దక్షిణాది రాష్ట్రాలలో ఈ పెరుగుదల కేవలం 6% నుండి 10% మాత్రమే ఉంది. దీనిని బట్టి ఈ పది సంవత్సరాలలో దేశవ్యాప్తంగా జనాభా పెరుగుదల ఒకేలా లేదని అర్థమవుతోంది' అని ఎన్నికల కమిషన్ మాజీ ప్రధానాధికారి ఓపీ రావత్ చెప్పారు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే బీజేపీకి గట్టి బలమున్న రాష్ట్రాలలో జనాభా పెరుగుదల వేగవంతంగా జరుగుతోంది.

**కులాల కోటా కొట్లాట**

సాధారణంగా జాతీయ పార్టీలు కుల, ప్రాంతీయ రాజకీయాలపై పెద్దగా ఆధారపడవు. ప్రాంతీయ పార్టీల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. గడచిన రెండు దశాబ్దాలుగా జాతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లుపై దాదాపు ఏకాభిప్రాయంతోనే ఉన్నాయి. ఓబీసీ రాజకీయాల ప్రభావం ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్‌లాంటి రాష్ట్రాలు మాత్రం ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్లలో కులాలకు కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఓబీసీ రిజర్వేషన్లు కేవలం చట్టసభలలో స్థానాల కేటాయింపు పైనే ఆధారపడి లేవన్న వాస్తవాన్ని ఆ రాష్ట్రాలు విస్మరిస్తున్నాయి.

## ఓటమి భయంతోనే మహిళా రిజర్వేషన్ బిల్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే మోడీ ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకొచ్చిందని, మహిళలకు సాధికారత సాధించాలనే తపనతో కాదని సీపీఐ(ఎం) రాజ్యసభ నేత ఎలమారం కరీం విమర్శించారు. గురువారం రాజ్యసభలో మహిళా బిల్లుపై జరిగిన చర్చలో సీపీఐ(ఎం) తరఫున ఎలమారం కరీం మాట్లాడారు. "కర్నాటక, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయాక.. బీజేపీకి భయం పట్టుకుంది. జనం తమ వెంట లేరన్న విషయాన్ని గమనించింది.ఆ భయమే మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని బీజేపీని ఒత్తిడి చేసింది. అంతేకానీ నారీ శక్తి బంధన్ బీజేపీ లక్ష్యం కాదు. సీపీఐ(ఎం) ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. బిల్లు ఆమోదం పొందిన వెంటనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలి. కానీ జనాభా లెక్కల కోసం వేచి ఉండకండి" అని అన్నారు.

"యూపీఏ హయాంలోనే రాజ్యసభ ఆమోదం పొందింది. సోనియాగాంధీ, .బృందా కరత్‌లు బిల్లు కోసం గట్టిగా నిలబడ్డారు. రాజ్యసభ చైర్మెన్ హామీద్ అన్సారీ ధృఢ వైఖరి కూడా నిర్ణయాత్మకమైంది. కానీ లోక్‌సభలో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. ప్రజాస్వామిక మహిళా సంఘం వంటి మహిళా సంఘాల సుదీర్ఘ పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు. 2014లో మహిళా బిల్లును ప్రవేశపెడతామని బీజేపీ హామీ ఇచ్చింది. కానీ ఇన్నేళ్లుగా ఏమీ చేయలేదు. 2019లో కూడా బీజేపీ అదే హామీ ఇచ్చింది. కానీ నాలుగున్నరేండ్లుగా ఏమీ చేయలేదు" అని విమర్శించారు.

".మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి, సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసినప్పుడు, బీజేపీ మహిళలపై ప్రేమ చూపలేదు. దేశం గర్వించదగ్గ మల్లయోధులను బీజేపీ నాయకుడే అయిన ఫెడరేషన్ అధ్యక్షుడు వేధించినప్పుడు కూడా మహిళలపై ప్రేమ కనిపించలేదు. ఉన్నావ్, కత్వా, హత్రాస్‌లలో మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న ఆసక్తి స్పష్టంగా కనిపించలేదు" అని విమర్శించారు.

"తదుపరి జనాభా లెక్కల అనంతరం నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. వచ్చే 15 ఏండ్లలో రిజర్వేషన్లు అమలు చేస్తారా? లేదా అనేది ఖచ్చితంగా తెలియదు. బెంగాల్‌లో 1983లోనే పంచాయతీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. కేరళలో స్థానిక సంస్థల్లో యాభై శాతం మహిళా రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరిస్థితి ఏంటీ?" అని ఎలమారం కరీం ప్రశ్నించారు.

**2011 జనాభా లెక్కలతో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే సరి..**
**రాజ్యసభ చర్చలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీలు కేకే, వద్దిరాజు**

ఇప్పుడు దేశంలో జనగణన లేదని, అలాంటప్పుడు 2011 జన గణనను పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్లు అమలు చేస్తే సరిపోయేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవ రావు సూచించారు. అయితే చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు అనే అంశం చాలా సుదీర్ఘ కాలంగా చర్చలో ఉందని, కేంద్ర తెచ్చిన ఈ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు తెలుపుతుందని స్పష్టం చేశారు.

గురువారం రాజ్య సభలో మహిళ రిజర్వేషన్ల బిల్లు పై చర్చలో ఆ పార్టీ తరఫున కేకే, వద్దిరాజు రవిచంద్రలు మాట్లాడారు. కేంద్రం తెచ్చిన మహిళ రిజర్వేషన్ల బిల్లులో జనగణన, డీలిమిటేషన్ అనే కండీషన్లు ఉన్నాయన్నారు. దీని ప్రకారం జనగణన, డీలిమిటేషన్, ప్రజాభిప్రాయం తర్వాత ఈ బిల్లు రావాలంటే 2023 తర్వాతే మహిళ రిజర్వేషన్లు అమలవుతాయని చెప్పారు.

## ఢిల్లీ గడ్డపై వాలిన నేతలు...సీటు కోసం పైరవీలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సీడబ్ల్యూసీ సమావేశాలు, విజయభేరి సభ జయప్రదం కావడంతో కాంగ్రెస్‌లో జోష్ మరింత పెరిగింది. ఎన్నికలకు అత్యంత కీలకమైన టికెట్ల ప్రక్రియను ప్రారంభించింది. దీన్ని పూర్తి చేసి ప్రజల్లోకి వెళ్లేందుకు సంసిద్ధమవుతున్నది. ఈ క్రమంలో ఢిల్లీలో బుధవారం ప్రారంభమైన స్క్రీనింగ్ కమిటీ రెండో రోజు కూడా కొనసాగింది. ఈ నేపథ్యంలో టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది నాయకులు ఢిల్లీ గడ్డపై వాలిపోయారు. స్క్రీనింగ్ కమిటీ జరుగుతున్న పరిసర ప్రాంతల్లో మకాం వేశారు. వారికి పరిచయం ఉన్న అగ్రనేతలతో పైరవీలు చేస్తున్నట్టు తెలిసింది. స్క్రీనింగ్ కమిటీలోని నాయకులు ఎవరు చెబితే వింటారు? వారితో ఉన్న సంబంధాలేంటి? సీడబ్ల్యూసీ సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, గతంలో రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యతలు చూసిన ఇంచార్జీలను, చివరికి అగ్రనేతల పీఏలను సైతం రాష్ట్ర నాయకులు వదలడంలేదు. 'ఏది ఏమైనా సరే ఫలానా నియోజకవర్గం టికెట్ నాకే రావాలి. మీరేం చేస్తారో తెలియదు. నా గురించైతే మీకు తెలుసు. దశాబ్దాలుగా నేను పార్టీకి సేవ చేస్తున్నా...ఇన్నాళ్లు పార్టీ నమ్ముకుని ఉన్నా...ఇప్పటికీ నాకు న్యాయం జరగలేదు. ఈసారైనా నాకు ఫేవర్ చేయండి. నాకు టికెటు ఇస్తే కచ్చితంగా బయటపడుతా' అంటూ హస్తినలో ఫోన్లు మోగుతున్నాయి. మరికొందరు నేరుగా కలిసి విజ్ఞప్తులు చేస్తున్నారు. రాష్ట్రానికి చెందిన ఏ ఇద్దరు కలిసినా తనకు టికెట్ దక్కుతుందా? లేదా? అనేదే చర్చ. స్క్రీనింగ్ కమిటీలో రాష్ట్రం నుంచి పార్టీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్ కూడా సభ్యులుగా ఉన్నారు. వారి సొంత జిల్లాల నుంచి ఢిల్లీకి వెళ్లి వారిని కలుస్తున్నారు. అంతే కాకుండా ఆ నాయకుల ప్రధాన అనుచరులు, వారినే నమ్ముకున్న నేతలు కూడా హస్తినకు వెళ్లారు. ప్రతి పార్లమెంటు పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో ఎక్కువ మంది హస్తినకు చేరుకున్నారు. దాదాపు 35 నుంచి 40 సీట్లకు ఒకే పేరు పంపించినట్టు తెలిసింది. మిగతా నియోజకవర్గాల నుంచి కొన్ని చోట్ల రెండు పేర్లు, మరికొన్ని చోట్ల మూడుపేర్లు పంపించినట్టు పార్టీ నేతలు అంటున్నారు. ఒక్కటే పేరు ఉన్న నియోజకవర్గాల్లో ఎలాంటి సమస్య లేకపోయినా, రెండు, మూడు పేర్లు ఉన్న చోట ఏ ఒక్కరికి ఇచ్చినా మరొకరి నుంచి సమస్య ఎదురయ్యే అవకాశం ఉన్నట్టు పార్టీ భావిస్తున్నది. దీంతో జాబితా దఫాదఫాలుగా ప్రకటించకుండా మొత్తం సీట్లను రెండు జాబితాలుగా ప్రకటించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో పైరవీల స్పీడ్ పెరుగుతోంది. ప్రస్తుత రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే సొంత రాష్ట్రమైన మహారాష్ట్రకు వెళ్లి...ఠాక్రే ఎవరు చెప్పితే వింటారో కూడా విచారిస్తున్నట్టు సమాచారం. అక్కడి నుంచి చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అంతకు ముందు రాష్ట్ర ఇంచార్జిలుగా వ్యవహరించిన దిగ్విజయ్‌సింగ్, రామచంద్రకుంతియా, మాణిక్యం ఠాగూర్‌లను కొంత మంది నేతలు ప్రసన్నం చేసుకుంటున్నట్టు తెలిసింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ మురళీధరన్ సొంత రాష్ట్రమైన కేరళ కూడా వెళ్లి పైరవీలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మరోవైపు పార్టీ మాత్రం సమర్థత, ప్రజల్లో పలుకుబడి, వారు చేస్తున్న కార్యక్రమాలు బేరిజు వేసి టికెట్ ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి కొన్ని చోట్ల ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని భావిస్తోంది. వారు పార్టీకి అన్ని సహయ,సహకారాలను అందించేటట్టు ఆదేశించింది. కొంత మందికి పార్టీ అధికారంలోకి రాగానే ఏదో ఒక పదవి ఇస్తామని ఒప్పిస్తున్నది. ఈసారి పైరవీలకు తావులేదంటూ అధిష్టానం చెబుతున్నా...నాయకులు వారి మాటలను పెడచెవిన పెట్టి ఢిల్లీకి వెళ్లారని కొంత మంది నేతలు పెదవి విరుస్తున్నారు.

## నీట్ కటాఫ్ స్కోర్ తగ్గించిన కేంద్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ పీజీ కటాఫ్ స్కోర్‌ను కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ తగ్గించింది. ఈ నేపథ్యంలో మెడికల్ సీట్లకు మరోమారు దరఖాస్తులు చేసుకునే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో కాళోజీ నారాయణరావు ఆరోగ్యవిశ్వ విద్యాలయం పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో కన్వీనర్, యాజమాన్య కోటాలో మరోమారు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈనెల 24వ తేది సాయంత్రం 6 గంటల వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్‌లోని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఒక ప్రకటన జారీ చేసింది.



చారిత్రక చార్మినార్ వద్ద ఐసీసీ వరల్డ్‌కప్ ట్రోఫీ

# ప్రాక్టీస్ పిచ్‌లు 14

- సరికొత్త ఎల్ఈడీ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు
- ప్రపంచకప్‌కు ఉప్పల్ స్టేడియం ముస్తాబు

నవతెలంగాణ-హైదరాబాద్

ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్‌కు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) ముస్తాబవుతోంది. రెండు వార్మప్ మ్యాచులు, మూడు ప్రధాన మ్యాచులకు ఆతిథ్యం ఇవ్వనున్న ఉప్పల్ స్టేడియం.. అభిమానులకు, ప్రపంచ క్రికెట్ ప్రియులకు సరికొత్త అనుభూతి అందించేందుకు ఏర్పాట్లలో ఎక్కడా తగ్గటం లేదు. స్టేడియంలో కొత్తగా ఎల్ఈడీ ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయగా.. ప్రాక్టీస్ పిచ్‌లకు సైతం ఆధునాతన ఎల్ఈడీ ఫ్లడ్‌లైట్లు అమర్చారు. ఉప్పల్ స్టేడియం ఆవరణలో రెండు ప్రాక్టీస్ గ్రౌండ్‌లు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు ఒక్క గ్రౌండ్‌కు మాత్రమే ఫ్లడ్‌లైట్ల వెలుతురు ఉండేది. ప్రపంచకప్ నేపథ్యంలో రెండు ప్రాక్టీస్ గ్రౌండ్లకు సైతం ఫ్లడ్‌లైట్ల సదుపాయం కల్పించారు. పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియాలు హైదరాబాద్‌లో ప్రపంచకప్ మ్యాచులు ఆడనుండగా.. ఐసీసీ ప్రమాణాల మేరకు అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 9, 10న వరుస మ్యాచులు షెడ్యూల్ చేశారు. ఏక కాలంలో నాలుగు జట్లు ప్రాక్టీస్ చేసేందుకు వీలుగా ఏకంగా 14 ప్రాక్టీస్ పిచ్‌లను సిద్ధం చేశారు. 'ప్రపంచకప్ ఏర్పాట్ల పరంగా హెచ్‌సీఏ ముందుంది. హైదరాబాద్‌కు రానున్న జట్ల షెడ్యూల్, ప్రాక్టీస్, వసతి, ప్రయాణం సహా అన్ని అంశాలపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందించాం. సెప్టెంబర్ 29న జరగాల్సిన వార్మప్ మ్యాచ్‌కు అభిమానులను అనుమతించటం లేదు. మిగతా మ్యాచుల నిర్వహణకు పోలీసుల నుంచి పూర్తి సహకారం ఉంది. ఇటు పోలీసులు, అటు బీసీసీఐతో నిత్యం టచ్‌లో ఉన్నాం. ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా స్టేడియంలో నూతన ఫ్లడ్‌లైట్లు, సీటింగ్, ప్రాక్టీస్ పిచ్‌లు సిద్ధం చేశాయి. ఏర్పాట్ల పరంగా ఎటువంటి లోటు లేకుండా చూసుకుంటున్నాం. ప్రపంచకప్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఉప్పల్ స్టేడియం సరికొత్తగా కనిపించనుంది. ప్రపంచకప్ అనుభూతిని అభిమానులు ఆస్వాదించేలా ముందుకెళ్తున్నామని' హెచ్‌సీఏ సీఈవో సునీల్ తెలిపారు.

**ప్రపంచకప్ ట్రోఫీ సందడి :** హైదరాబాద్‌లో ప్రపంచకప్ ట్రోఫీ సందడి చేసింది. రెండు రోజులుగా నగరంలో ఐసీసీ వరల్డ్‌కప్ ట్రోఫీ టూర్ సాగుతుండగా, గురువారం చారిత్రక చార్మినార్, ట్యాంక్‌బండ్ సహా ఉప్పల్ స్టేడియంలో ట్రోఫీని ప్రదర్శించారు. ప్రపంచకప్ ట్రోఫీతో అభిమానులు, ఔత్సాహికులు సెల్ఫీలు, ఫోటోలు తీసుకున్నారు.

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు 15 రోజుల కౌంట్‌డౌన్ సైతం మొదలైంది. టైటిల్ రేసులో నిలిచిన అగ్రజట్లు మరోసారి వేట సన్నద్ధతను బేరీజు వేసుకునే పనిలో ఉన్నాయి. అందులో భాగంగానే మాజీ చాంపియన్లు భారత్, ఆస్ట్రేలియా మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో ఢీకొట్టనున్నాయి. టీమ్ ఇండియా ఆసియా కప్ విజేతగా నిలిచిన ఉత్సాహంలో ఉండగా.. సఫారీతో వన్డే సిరీస్‌లో 2-0 ఆధిక్యం నుంచి 2-3తో సిరీస్ కోల్పోయిన స్థితి నుంచి కంగారూలు భారత్‌లో అడుగుపెట్టారు. ప్రపంచకప్ తుది సన్నద్ధతలో భారత్ బెంచ్ ఆటగాళ్లపై ఫోకస్ పెట్టగా.. ఆసీస్ వరల్డ్‌కప్ జట్టుతోనే బరిలోకి దిగుతోంది. భారత్, ఆస్ట్రేలియా తొలి వన్డే నేడు.

# ఆ ఇద్దరిపైనే ఫోకస్!

- అశ్విన్, సుందర్ మాయ మెప్పించేనా?
- మధ్యాహ్నం 1.30 నుంచి జియో సినిమాలో..

భారత్, ఆసీస్ తొలి వన్డే నేడు

నవతెలంగాణ-మొహాలి

భారత్, ఆస్ట్రేలియా ఆఖరు సన్నాహానికి సిద్ధమయ్యాయి. అక్టోబర్ 8న చెపాక్‌లో ముఖాముఖి పోరుతో టైటిల్ వేట షురూ చేయనున్న మాజీ చాంపియన్లు.. అంతకుముందు వారం రోజుల వ్యవధిలో మూడు వన్డేల్లో మెరుపు సమరానికి సై అంటున్నారు. ఇరు జట్లను గాయాల బెడద వేధిస్తుండగా, ఇరు జట్లు ఈ సిరీస్‌లో తుది జట్టు కూర్పు సహా ప్రత్యామ్నాయ వనరుల అన్వేషణ లక్ష్యంగా బరిలో నిలుస్తున్నాయి. అగ్ర జట్లు పోటీపడుతున్న సిరీస్‌లో వరల్డ్‌కప్ ముంగిట.. రక్తికట్టించే మ్యాచులు లాంఛనమే!. భారత్, ఆస్ట్రేలియా చివరగా తలపడిన సిరీస్‌లో సూర్యకుమార్ యాదవ్ హ్యాట్రిక్ డకౌట్‌గా నిష్క్రమించాడు. దీంతో అశ్విన్, వాషింగ్టన్ సుందర్‌తో పాటు సూర్యకుమార్ యాదవ్ సైతం కంగారూలతో సిరీస్‌లో సత్తా చాటేందుకు ఎదురు చూస్తున్నాడు.

**మాయ మెప్పించేనా?! :** రవిచంద్రన్ అశ్విన్ చివరగా 2022 జనవరిలో వన్డే మ్యాచ్‌లో కనిపించాడు. ప్రపంచకప్ ప్రణాళికల్లో లేని ట్రంప్‌కార్డ్ ఆఫ్ స్పిన్నర్ ఆఖరు క్షణాల్లో జట్టు మేనేజ్‌మెంట్ దృష్టిని ఆకర్షించాడు. దీంతో మెగా ఈవెంట్‌లో అవసరం అవుతాడనే అంచనాతో అశ్విన్‌తో పాటు వాషింగ్టన్ సుందర్‌నూ ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. ప్రపంచకప్ జట్టులో మణికట్టు స్పిన్నర్, లెఫ్టార్మ్ స్పిన్నర్లు మాత్రమే ఉన్నారు. ఆఫ్ స్పిన్నర్‌కు చోటు దక్కలేదు. దీంతో ఆఫ్ స్పిన్నర్లు అశ్విన్, వాషింగ్టన్ సుందర్‌ను ఈ సిరీస్‌లో పరీక్షించనున్నారు. నాణ్యమైన కంగారూ బ్యాటింగ్ లైనప్‌ను అశ్విన్, వాషింగ్టన్ స్పిన్ జోడీ మాయలో పడేయగలిగితే.. ప్రపంచకప్ జట్టులోకి ఏ క్షణంలోనైనా అడుగుపెట్టే దీమా దక్కించుకున్నట్టే!. కీలక ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, కుల్దీప్ యాదవ్‌లు తొలి రెండు వన్డేలకు దూరమయ్యారు. సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్ సహా ఇషాన్ కిషన్‌లకు మరింత బ్యాటింగ్ ప్రాక్టీస్ కోసమే సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది.







తెలుగు తేజం తిలక్ వర్మ సైతం మిడిల్ ఆర్డర్‌లో చోటు కోసం పోటీపడుతున్నాడు. కానీ అయ్యర్, సూర్యలకు తొలి ప్రాధాన్యత కనిపిస్తుంది. కెప్టెన్ కెఎల్ రాహుల్ నాయకత్వంతో పాటు వ్యక్తిగత ప్రదర్శనతోనూ సత్తా చాటాల్సి ఉంది. పేస్ విభాగంలో బుమ్రా, సిరాజ్, షమిలు బరిలోకి దిగుతున్నారు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, రవిచంద్రన్ అశ్విన్ రూపంలో ఏకంగా ముగ్గురు స్పిన్ ఆల్‌రౌండర్లు తుది జట్టులో నిలువనున్నారు.

**ప్రణాళికలు మొదలు! :** ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ ప్రణాళికలు ఈ సిరీస్ నుంచే ఆరంభం కానున్నాయి. ప్రపంచకప్ జట్టులో కంగారూలు స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్‌కు చోటు కల్పించారు. టెస్టు జట్టులో ఈ ఇద్దరు గొప్ప బ్యాటర్లు. కానీ ధనాధన్ ఫార్మాట్‌గా మారిన వన్డేల్లో స్మిత్, లబుషేన్‌కు చోటు కల్పించటం సాహసమే అవుతుంది. మిడిల్ ఆర్డర్‌లో ఈ ఇద్దరితో ఎలా ముందుకు సాగాలనే అంశంలో ఆసీస్ నేడు భారత్‌తో తొలి వన్డేలో ప్రయోగం చేయనుంది. గ్లెన్ మాక్స్‌వెల్, ఆష్టన్ ఆగర్, ట్రావిశ్ హెడ్, మిచెల్ స్టార్క్‌లు అందుబాటులో లేరు. దీంతో స్మిత్, లబుషేన్ తుది జట్టులో నిలువనున్నారు. డెవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్‌లు ఓపెనర్లుగా రానుండగా.. అలెక్స్ కేరీ, కామరూన్ గ్రీన్, మార్కస్ స్టోయినిస్‌లు లోయర్ మిడిల్ ఆర్డర్ బాధ్యత తీసుకోనున్నారు. కెప్టెన్ పాట్ కమిన్స్ పేస్ దళాన్ని నడిపించనుండగా.. తన్వీర్ సంగా, జోశ్ హాజిల్‌వుడ్, స్టోయినిస్‌లు సారథితో కలిసి పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

**పిచ్, వాతావరణం :** మొహాలి గత నాలుగేండ్లుగా వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వలేదు. కానీ ఇక్కడ జరిగిన ఐపీఎల్ మ్యాచుల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. భారత దేశవాళీ సీజన్‌కు సైతం ఇది మరీ ముందు!. అయినా, పిచ్ పెద్దగా మారే అవకాశం కనిపించటం లేదు. మ్యాచ్ రోజు ఎటువంటి వర్షం సూచనలు లేవు.

**తుది జట్లు (అంచనా) :**

**భారత్ :** ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, కెఎల్ రాహుల్ (కెప్టెన్, వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్, జశ్‌ప్రీత్ బుమ్రా.

**ఆస్ట్రేలియా :** డెవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్, స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), కామెరూన్ గ్రీన్, మార్కస్ స్టోయినిస్, పాట్ కమిన్స్ (కెప్టెన్), స్పెన్సర్ జాన్సన్, ఆడం జంపా, జోశ్ హాజిల్‌వుడ్.

# బంగ్లాపై భారత్ గెలుపు

- పెనాల్టీతో గట్టెక్కిన ఛెత్రిసేన



**హాంగ్జౌ :** ఆసియా క్రీడల్లో భారత ఫుట్‌బాల్ జట్టు బోణీ కొట్టింది. మంగళవారం ఆతిథ్య చైనాతో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో 0-5తో దారుణ పరాజయం చవిచూసిన టీమ్ ఇండియా.. రెండో మ్యాచ్‌లో పుంజుకుంది. చీఫ్ కోచ్ స్టిమాక్ స్టార్ ఆటగాడు సునీల్ ఛెత్రిని మైదానంలోకి పంపించేందుకు ఆసక్తి చూపలేదు. యువ ఆటగాళ్లను ప్రయోగించి సత్తా చాటాలనే తెగువ చూపించినా.. ఆఖరుకు కెప్టెనే వచ్చి పెనాల్టీ కిక్‌తో భారత్‌ను విజయాన్ని అందించాడు. 85వ నిమిషంలో బంగ్లాదేశ్ అందించిన పెనాల్టీని అలవోకగా గోల్‌గా మలిచిన సునీల్ ఛెత్రి భారత్‌ను 1-0తో ముందంజలో నిలిపాడు. ఆధిక్యం నిలుపుకున్న టీమ్ ఇండియా.. గ్రూప్ దశలో తొలి విజయం సాధించింది. మయన్మార్‌తో సమానంగా నిలిచిన భారత్.. గోల్స్ వ్యత్యాసంగా పరంగా వెనుకంజలో నిలిచింది. చైనా చేతిలో ఐదు గోల్స్ తేడాతో పరాజయం పాలవటం గ్రూప్ దశ దాటేందుకు అడ్డుగా మారుతోంది. బంగ్లాదేశ్‌తో విజయంతో భారత్ ఆశలు సజీవంగా నిలిచినా.. గ్రూప్‌లో ఇతర మ్యాచుల ఫలితాలపైనే భారత్ ముందంజ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి!.

# చెలరేగిన షెఫాలీ

- రాణించిన జెమీమా, మంధాన
- మలేషియాతో మ్యాచ్ వర్షార్పణం



**హాంగ్జౌ :** ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్టు ఘనమైన ఎంట్రీకి వరుణుడు అడ్డు నిలిచాడు. గురువారం క్వార్టర్‌ఫైనల్లో మలేషియా మహిళల జట్టుతో తలపడిన భారత అమ్మాయిలు.. తొలుత 15 ఓవర్లలో 173 పరుగుల భారీ స్కోరు నమోదు చేశారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను తొలుత 15 ఓవర్లకు కుదించినా.. మలేషియా ఇన్నింగ్స్ సందర్భంగా మరోసారి వరుణుడు అడ్డు తగిలాడు. దీంతో మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. టోర్నీలో ఉత్తమ సీడింగ్ ప్రకారం భారత్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఓపెనర్లు స్మృతీ మంధాన (27), షెఫాలీ వర్మ (67, 39 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అదిరే ఆరంభాన్ని అందించారు. షెఫాలీ అర్ధ సెంచరీతో కదం తొక్కగా.. మంధాన ఐదు బౌండరీలతో మెరిసింది. జెమీమా రొడ్రిగస్ (47 నాటౌట్, 29 బంతుల్లో 6 ఫోర్లు), రిచా ఘోష్ (21 నాటౌట్, 7 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఆటతో అదరగొట్టారు. 15 ఓవర్లలో 2 వికెట్లకు భారత్ 173 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. మలేషియా ఛేదనలో 0.2 ఓవర్లలో 1/0 స్కోరు వద్ద వర్షం మ్యాచ్‌కు ఆటంకం కలిగించింది.

---



కృతిశెట్టి

## తొలిసారి శర్వానంద్ సరసన..

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై శర్వానంద్, శ్రీరామ్ ఆదిత్య కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇది శర్వానంద్ నటిస్తున్న 35వ చిత్రం కావడం విశేషం. కృతి శెట్టి ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడిగా నటిస్తోంది. గురువారం కృతిశెట్టి పుట్టినరోజు సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ వీడియోను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. ఈ వీడియోలో కృతి శెట్టి అందంగా, క్యూట్‌గా కనిపిస్తూ అందర్నీ మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఒక షెడ్యూల్ మినహా మిగతా షూటింగ్ మొత్తం పూర్తయింది. అక్టోబర్ నుంచి ప్రమోషన్ కార్యక్రమాలను విస్తృతంగా చేయనున్నారు. ఇంట్రెస్టింగ్ పాత్రలో శర్వానంద్ కనిపించనున్న ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాత : టీజీ విశ్వ ప్రసాద్, సహ నిర్మాత : వివేక్ కూచిభొట్ల.

## ప్రేమలోని కొత్త కోణం



బాలు, స్నేహ

శ్రీవెంకట సుబ్బలక్ష్మి మూవీస్ పతాకంపై అన్వర్ దర్శకత్వంలో వెంకట్రావు మోటుపల్లి నిర్మిస్తున్న చిత్రం 'నీ వెంటే నేను'. ఈ చిత్రంతో బాలు - స్నేహ హీరో,హీరోయిన్లుగా ఇంట్రడ్యూస్ అవుతున్నారు. వీరిద్దరూ స్వతహా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడం విశేషం. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ క్లీన్ లవబుల్ ఎంటర్టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం 'సినీబజార్' అనే డిజిటల్ థియేటర్‌లో అక్టోబర్ 6న 177 దేశాల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సినీబజార్ సి.ఇ.ఓ రత్నపురి వెంకటేష్ భాస్కర్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తుండడం చాలా ఆనందంగా ఉంది. పైరసీకి ఎట్టి పరిస్థితుల్లో తావులేని విధంగా సినీ బజార్‌ను తీర్చిదిద్దాం' అని అన్నారు.



నవీన్ పోలిశెట్టి

## హ్యాట్రిక్‌హిట్‌తో సంతృప్తిగా ఉన్నా..

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'జాతి రత్నాలు' ఘన విజయాల తర్వాత...'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'తో హ్యాట్రిక్ సూపర్ హిట్ అందుకున్నారు హీరో నవీన్ పోలిశెట్టి. అనుష్క శెట్టితో కలిసి ఆయన నటించిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ నేపథ్యంలో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సక్సెస్ తనకు అందించిన హ్యాపీనెస్ గురించి మీడియాతో హీరో నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ, 'మంచి సినిమా అనే వర్డ్ ఆఫ్ మౌత్‌తోనే అందరికీ రీచ్ అయ్యింది. థర్డ్ వీక్‌లో కూడా యూఎస్‌లో రన్ అవుతోంది. స్క్రీన్స్ పెంచుతున్నారు. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్‌లో కూడా డిమాండ్ మేరకు షోస్ పెంచుతున్నారు. ఇప్పటిదాకా నాకు దక్కిన మూడు సక్సెస్ ఫుల్ మూవీస్ ఒక్కోటి నా కెరీర్‌కు ఒక్కో రకంగా హెల్ప్ చేశాయి. ఈ సినిమాతో నేను కేవలం కామెడీ మాత్రమే కాదు ఎమోషన్ కూడా చేయగలను అని నిరూపించుకున్నా. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నా. హిందీలోనూ కథలు వింటున్నాను. కపిల్ షో లాంటి మంచి హ్యూమరస్ టీవీ ప్రోగ్రాం చేయాలని ఉంది' అని చెప్పారు.

# నవచిత్రం

## హాయిగా నవ్వుకుంటారు



సంతోష్ శోభన్, ఫల్గుణి ఖన్నా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'జోరుగా హుషారుగా షికారు పోదమ'. స్టోరీ క్యాట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్.ఒరిజినల్స్ అసోసియేషన్ విత్ ఎం.ఆర్.ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై సుభాష్ చంద్ర దర్శకత్వంలో ప్రవీణ్ నంబారు, సృజన్ ఎరబోలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర మోషన్ పోస్టర్ రిలీజ్ వేడుకలో డైరెక్టర్ క్రిష్ మాట్లాడుతూ, 'సుభాష్ ఈ సినిమాకు న్యాయం చేశాడు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మ్యూజిక్ బాగుంది. సంతోష్ శోభన్‌లో ఎంతో ఈజ్ ఉంటుంది. ప్రేక్షకులను కూడా జోరుగా హుషారుగా షికారు పోదమ అనేలా తీసుకెళ్తారని అనుకుంటున్నాను' అని అన్నారు.

'దర్శకుడు సుభాష్ సినిమాని అద్భుతంగా తీశాడు. ప్రేక్షకుడికి విజువల్స్ కనిపిస్తాయి. కానీ నిర్మాతగా నాకు నా టీం కష్టం కనిపిస్తుంది' అని నిర్మాత ప్రవీణ్ చెప్పారు. దర్శకుడు సుభాష్ చంద్ర మాట్లాడుతూ,'లైట్ హార్టెడ్ ట్రావెల్ మ్యూజికల్ లవ్ స్టోరీ. ఈ సినిమాను చూస్తున్నంత సేపు హాయిగా నవ్వుకుంటారు. ఇండియా మొత్తం చుట్టి వచ్చినట్టుగా ఉంటుంది' అని తెలిపారు. 'స్వీట్ సింపుల్ ట్రావెల్ రోమ్ కామ్ సినిమా. ప్రవీణ్‌లో పెద్ద నిర్మాత అయ్యే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఆయనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది' అని హీరో సంతోష్ శోభన్ చెప్పారు.

## కేబుల్ రెడ్డిగా సుహాస్



సుహాస్

సుహాస్ తాజాగా నటిస్తున్న చిత్రం 'కేబుల్ రెడ్డి'. శ్రీధర్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా, ఫ్యాన్ మేడ్ ఫిలింస్ బ్యానర్‌పై బాలు వల్లు, ఫణి ఆచార్య మణికంఠ జెఎస్ నిర్మిస్తున్నారు. లేటెస్ట్‌గా మేకర్స్ ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని లాంచ్ చేశారు. ఈ పోస్టర్ సుహాస్‌ని 'కేబుల్ రెడ్డి'గా ప్రెజెంట్ చేసింది. టైటిల్, ఫస్ట్-లుక్ పోస్టర్ సుహాస్ కేబుల్ డిష్ ఓనర్‌గా నటిస్తున్నట్లు సూచిస్తున్నాయి. సినిమా ఫన్ రైడ్‌గా ఉండబోతుందని హామీ ఇచ్చే పోస్టర్‌లో సుహాస్ సాధారణ గ్రామ యువకుడిగా కనిపించారు. ఇందులో సుహాస్‌కు జోడిగా షాలిని కొండేపూడి నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: మహి రెడ్డి పండుగుల, సంగీత దర్శకుడు: స్మరణ్ సాయి, ఆర్ట్ డైరెక్టర్: క్రాంతి ప్రియం.

## ఆస్కార్ కోసం రంగంలోకి..



'ఆర్‌ఆర్‌ఆర్'లోని 'నాటు నాటు' పాట ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డుని కైవసం చేసుకుని తెలుగు సినిమా సత్తాని ప్రపంచవ్యాప్తంగా చాటింది.

దీంతో ఈ ఏడాది ఏ తెలుగు సినిమా ఆస్కార్ బరిలోకి వెళ్తుందనే అమితాసక్తి అందరిలోనూ ఉంది. 96వ అకాడమీ అవార్డుల్లో (ఆస్కార్ -2024) ఉత్తమ విదేశీ చిత్ర విభాగం కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభమైంది. ప్రముఖ ఫిల్మ్ మేకర్ గిరీష్ కాసరవల్లి అధ్యక్షతన 17 మంది సభ్యులతో కూడిన ఆస్కార్ కమిటీ చెన్నై వేదికగా ఆస్కార్ ఎంట్రీ కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను వీక్షిస్తోంది.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు అన్ని భాషల నుంచి 22 సినిమాలు వచ్చినట్లు తెలుస్తోంది. వీటిల్లో 'ది స్టోరీ టెల్లర్', 'మ్యూజిక్ స్కూల్', 'మిస్ ఛటర్జీ వర్సెస్ నార్వే', 'ట్వల్త్ ఫెయిల్', ఘూమర్, గదర్ 2, అబ్ థో సాబ్ భగవాన్ భరోస్, రాఖీ ఔర్ రాణికి ప్రేమ్ కహానీ, జ్విగాటో, ది కేరళ స్టోరీ వంటి తదితర బాలీవుడ్ చిత్రాలు, విడుదలై పార్ట్1 (తమిళం), వాల్వి (మరాఠి) సినిమాలతోపాటు తెలుగు చిత్ర సీమ నుంచి బలగం, దసరా చిత్రాలు పరిశీలనకు వచ్చాయి.

ఈ సినిమాలను వీక్షించిన అనంతరం మన దేశం తరపున ఒక చిత్రాన్ని 'ఉత్తమ విదేశీ చిత్రం' కేటగిరిలో ఆస్కార్‌కి పంపుతారు. ఈ నేపథ్యంలో మన తెలుగు నుంచి 'బలగం', 'దసరా' సినిమాలు పోటీ పడుతుండటంతో ఏ సినిమా ఆస్కార్ వైపు అడుగులు వేస్తుందనే ఉత్కంఠ అందరిలోనూ ఉంది.

అయితే ఈ ఏడాది మన దేశం నుంచి 'విడుదలై పార్ట్ 1, జ్విగాటో, బలగం' చిత్రాల్లో ఏదో ఒకటి ఆస్కార్ ఎంట్రీకి వెళ్ళే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ మూడు సినిమాలు ఇప్పటికే పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అత్యధికంగా అవార్డులను దక్కించుకుని బాగా పాపులర్ అయ్యాయి. వీటిల్లో 'బలగం' సినిమా ఏకంగా 100కి పైగా అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం.

## పవర్‌ఫుల్ పాత్ర చేశా..



అనసూయ

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందుతున్న న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులో కీలక పాత్ర పోషించిన అనసూయ భరద్వాజ్ మీడియాతో మాట్లాడుతూ, "కథాపరంగా ప్రేక్షకులు పెదకాపు వరల్డ్‌తో ఖచ్చితంగా కనెక్ట్ అవుతారు. సినిమా చూసిన తర్వాత నా పాత్ర ఇంకా ఇంపాక్ట్ ఫుల్‌గా ఉంటుంది. ఇందులో నా పేరు నాకు చాలా కొత్తగా అనిపించింది. చాలా నచ్చింది. సినిమా విడుదల తర్వాత అందరూ ఆ పేరుతోనే పిలుస్తారనే నమ్మకం ఉంది. 'రంగస్థలం'లో రంగమ్మత్తగా, 'విమానం'లో సుమతి పాత్రలో విభిన్నంగా కనిపించాను. ఇప్పుడు ఇందులో చేసిన పాత్ర కూడా చాలా బలంగా, వైవిధ్యంగా ఉంటుంది. ఇది చాలా రా ఫిల్మ్. నా పాత్రలో కొన్ని బోల్డ్ డైలాగ్స్ కూడా ఉన్నాయి. దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల పెదకాపు లాంటి కథ చెప్పినపుడు షాక్ అయ్యా. దర్శకుడిగా ఆయనకి ఇది చాలా డిఫరెంట్ ట్రాన్స్‌ఫర్మేషన్. దీంతోపాటు ఆయన నటించడం బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ సినిమాలోని పాత్ర కోసం సినిమాటోగ్రాఫర్ ఛోటా కె.నాయుడు దర్శకుడు శ్రీకాంత్‌కి నన్ను రిఫర్ చేయటం ఆనందంగా ఉంది' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.